www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

శుక్రవారం, జూలై, 25, 2025 RNI No : TGTEL/25/A1676 సంపుటి : 1 సంచిక : 20 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



2వ పేజీలో...

అనిల్ అంబానీ రిలయన్స్ ఆఫీసులలో

## ఈడీ రెయిడ్

- మనీలాండరింగ్ కేసులో భాగంగా సోదాలు
- ముంబైతో పాటు ఢిల్లీ నుంచి అధికారుల రాక
- ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ

ముంబై: రిలయన్స్ కమ్యూనికేషన్స్ అధినేత అనిల్ అంబానీకి చెందిన ఆఫీసులలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఈ రోజు ఉదయం నుంచి సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ముంబై, ఢిల్లీలోని ఆఫీసుల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.



ఆ ఒప్పందం భారీ

2వ పేజీలో...

## విజయం

మోదీ పర్యటన వేళ బ్రిటన్ ప్రధాని వ్యాఖ్యలు

ఢిల్లీ,: ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తుతం బ్రిటన్‌లో పర్యటిస్తున్నారు. ఈసందర్భంగా రెండు దేశాల మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది తమ దేశానికి దక్కిన భారీ విజయమని అభివర్ణించారు. దీనిద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. వ్యాపారాలకు కొత్తదారులు తెరుచుకుంటాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అంశంపై ఇరుదేశాల మధ్య మూడేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. బోరిస్ జాన్సన్ ప్రధానిగా ఉన్నప్పటినుంచి ఇరుదేశాల మధ్య చర్చలు నడుస్తూ వచ్చాయి. స్వేచ్ఛా మార్కెట్, వాణిజ్య ఆంక్షలు సడలించడం ద్వారా 2040 నాటికి ఇరుదేశాల వాణిజ్యాన్ని 25.5 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా పలు దఫాలుగా చర్చలు జరిగిన సంగతి తెలిసిందే.



2వ పేజీలో...

## ఆ ఒక్క పథకంతో విప్లవాత్మకమార్పు

మహాలక్ష్మిపై సిఎం రేవంత్ ఎక్స్‌లో పోస్ట్



2వ పేజీలో...

రష్యాలో ఘోర విమాన

## ప్రమాదం

49మంది మృతి

మాస్కో : రష్యాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. 49 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం అమూర్ ప్రాంతంలో కుప్పకూలింది. తొలుత ఈ విమానం అదృశ్యమైనట్లు- వార్తలు రాగా.. కాసేపటికే అది కూలిపోయినట్లు- అధికారులు నిర్ధరించారు. ఏటిసి నుంచి సంబంధాలు తెగిపోగా ఎక్కడ అదృశ్యం అయ్యిందా అన్న ఆందోళన నెలకొంది. అంతలోనే కూలిపోయినట్లు సమాచారం అందింది.అంగారా ఎయిర్‌లైన్‌కు చెందిన ఏఎన్-24 విమానం గురువారం ఉదయం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది.



తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం

2వ పేజీలో...

## 2.0 ఉద్యమం

- దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్థిక, సామాజిక సర్వే
- రాష్ట్రపతి అనుమతి కోసం ఎదురు చూస్తున్న బిసి బిల్లు
- రాహుల్ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం పోరాటం
- రాహుల్, ఖర్గేలతో సిఎం రేవంత్, భట్టి తదితరుల భేటీ
- ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించిన మల్లి కార్జున ఖర్గే



2వ పేజీలో...

భారత టెక్కీలను

## దూరం పెట్టండి

అమెరికన్లకు ఉద్యోగాలపై ఫోకస్ పెట్టాలి
గూటుల్, మైక్రోసాఫ్ట్‌లకు ట్రంప్ సూచన

వాషింగ్టన్,జూలై24 : గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి మేటి టెకీ కంపెనీలకు అమెరికా అధ్యక్షుడు డోనా ల్డ్ ట్రంప్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. విదేశీ ఉద్యోగు లను తీసుకోవడం ఆపేయాలన్నారు. ముఖ్యంగా ఇండియా లాంటి దేశం నుంచి టెకీలను రిక్రూట్ చేసుకోవద్దు అన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన ఏఐ సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా కంపె నీలు స్వదేశంలో ఉద్యోగాలు క్రియేట్ చేయడంపై ఫోకస్ పెట్టాలన్నారు.

- సృజనాత్మక శక్తిని వెలికితీసేలా ప్రత్యేక దృష్టి
- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇగ్నైట్ సెల్ ఏర్పాటు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్



ఉన్నత ప్రమాణాలతో..

## విద్యా బోధన

విజయవాడ,జూలై24 : సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనను అందించడంతో పాటు సృజనా త్మక శక్తిని వెలికితీసేలా అధికారు లు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. స్వరాంధ్ర - 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను సాధించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ సెల్‌ను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సందర్శించారు.

## వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేద్దాం

- అధ్యక్షుడు దార రమేష్

విశ్వంభరా , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 3 వ తేదీన హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దార రమేష్ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాలని అన్నారు. వైశ్యులు ఎవరి వాటాలను అడగడం లేదని మేమెంతో మాకు అంతా సీట్లు కేటాయించాలని అన్నారు.. సమాజంలో వైశ్యులు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు వైశ్యులకు కూడా అవకాశం కల్పించాలని అన్నారు. ఈడబ్ల్యూఎస్ లో వర్గీకరణ తేవాలని, కులగనన నివేదికలో అగ్రవర్ణాల



వివరాలు కులాలవారీగా ప్రకటించాలని అన్నారు. తెలంగాణలో అన్ని జిల్లాల ఆర్యవైశ్యులు పాల్గొని వైశ్య రాజకీయ రణబేరిని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, శంకర్ రావు, మాజీ అధ్యక్షుడు రమేష్, ధీరజ్, శ్రీనివాస్, దామోదర్ రావు ,శ్రీరాములు, మనోహర్, తరుణ్ ,జగన్నాథం, శ్రీనివాస్, పవన్, హరి, నాగేశ్వరరావు, వీరాంజనేయులు, అవినాష్ గుప్తా , బుక్క ఈశ్వరయ్య, కోడుమూరి దయాకర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమం

**మొదటిపేజీ తరువాయి...**

న్యూఢిల్లీ, : తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి మల్లికార్జున ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సీఎం, డిప్యూటీ-సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ఖర్గే ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా... కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని... కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించలేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, 



ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో మెజారిటీ-గా ఉన్నా.. కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యా సంస్థల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ అన్యాయం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించలేదు. ఢిల్లీలో ఏఐసీసీ నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆయనతోపాటు- రాహుల్ గాంధీని తెలంగాణ నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చలు చేపట్టారు. అంతేకాకుండా 50శాతం రిజర్వేషన్ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రజల ఒత్తిడికి లోనై కుల గణన నిర్వహించేందుకు అంగీకరించినా, 50 శాతం పరిమితిని తొలగించడానికి సిద్ధంగా లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా సంస్థలలో ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్లు సిఫారసు చేసిందని.. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నదని ఆయన గుర్తు చేశారు.

# రాజ్యసభపై జనసేన గురి

**మొదటిపేజీ తరువాయి...**

అందులో వైసీపీకి చెందిన పరిమళ నత్వాని, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, టీడీపీకి చెందిన సానా సతీష్ బాబులు 2026 జూన్ 21న పదవీ విరమణ చేయనున్నారు. అంటే మరో ఏడాదిలో నాలుగు రాజ్యసభ సభ్యుల పదవులు ఖాళీ కానున్నాయి. ఇందులో టీడీపీకి చెందిన సానా సతీష్ బాబుకు తిరిగి రాజ్యసభ పదవి దక్కే అవకాశముంది. వైసీపీకి ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి ఒక్క పోస్టు కూడా రాదు. దీంతో మిగిలిన మూడింటిలో బీజేపీ, టీడీపీ, జనసేన మూడు పంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నా అందులో టీడీపీది ఒకటి ఉండటంతో దానిని వదిలేయగా మిగిలిన మూడింటిలో ఒకటి తమకు ఇవ్వాలని ఇటీవల చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన సందర్భంలో అమిత్ షా చెప్పినట్లు సమాచారం. ఆ సమావేశం తర్వాతనే పవన్ కల్యాణ్ కూడా తమ పార్టీకి ఒకటి కేటాయించాలని కోరడంతో మొత్తం ఖాళీ అయ్యే నాలుగు స్థానాల్లో రెండింటిలో టీడీపీ, బీజేపీ, జనసేన చెరి ఒకటి స్థానాలను తీసుకోవాలన్న ఒప్పందం దాదాపు ఖరారయినట్లు తెలిసింది. అయితే మొన్నటి వరకూ జనసేన నుంచి లింగమనేని రమేష్ అనే ప్రచారం నడిచింది. అయితే లింగమనేని రమేష్ కు టీడీపీ నుంచి ఇవ్వాలని పవన్ కోరినట్లు తెలుస్తోంది. సుపరిపాలన కార్యక్రమంలో కొత్త అడుగులు మరొక వ్యక్తికి... తమ పార్టీ నుంచి మరొకరిని రాజ్యసభకు




పంపుతామని పవన్ కల్యాణ్ చెప్పినట్లు తెలిసింది. లింగమనేని రమేష్ పేరును జనసేన నుంచి పంపినా జనాలు మాత్రం అతనిని తెలుగుదేశం అభ్యర్థిగానే భావిస్తారని, అందుకే తమ పార్టీకి చెందిన వారికే ఇవ్వాలని పవన్ కల్యాణ్ అనుకుంటున్నట్లు సమాచారం. తూర్పు గోదావరి జిల్లా నుంచి బలమైన నేతను రాజ్యసభకు ఎంపిక చేయాలని కూడా పవన్ కల్యాణ్ ప్రాథమికంగా నిర్ణయించారని తెలిసింది. అయితే మరొక ఆలోచన కూడా చేస్తున్నారట. నాగబాబును రాజ్యసభకు పంపి, ఎమ్మెల్సీ స్థానాన్ని మరొకరికి అప్పగించే యోచనలో కూడా జనసేనాని ఉన్నారని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాల్సి ఉంది.

# ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన

**మొదటిపేజీ తరువాయి...**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలో ఎ.కొండూరు, రెడ్డిగూడెం, గంపలగూడెంలలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో మైనార్టీ విద్యార్థులతో పాటు బీసీ, ఎస్టీ, ఎస్సీలతో పాటు- విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించి ప్రైవేట్ పాఠశాలలకు ధీటు-గా ఫలితాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ద్వారా మూడు దశలలో 29 పాఠశాలలను ఎంపిక చేసుకుని ఐకాన్ స్కూల్స్‌గా మార్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇందుకు ప్రభుత్వం 6 కోట్ల 72 లక్షల రూపాయలను మంజూరు చేసి రూ.4 కోట్ల 72 లక్షలు నిధులను విడుదల చేయడం జరిగిందని ఇప్పటికే 2 కోట్ల 32 లక్షల రూపాయల పనులను పూర్తిచేయడం జరిగిందన్నారు. ఆయా స్కూల్స్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు- చేసి విద్యార్థులు మెరుగైన పరిశోధనలు చేసేలా, వినూత్న ఆలోచనలను కార్యరూపమిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్ పథకం ద్వారా ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రై సైకిళ్లు, బ్రెయిలీ కిట్లు, ఎల్బోక్రచ్‌లు, టీఎల్ఎం కిట్లు, వీల్ ఛెయిర్లు, వాకింగ్ స్టిక్‌లు వంటి ఉపకరణాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మికులు, బడిమానిన పిల్లలను గుర్తించి ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించడంద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని.. జిల్లాలో 94 వేల 480 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల స్కూల్ యూనిఫామ్, బెల్ట్, బ్యాగు, బూట్లు-, నోట్ బుక్స్, -టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇగ్నైట్ సెల్ సందర్శనలో కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష అడిషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, సీఎంవో ఎన్. చంద్రశేఖర్, ఏఎంవో ఎస్.అశోక్‌బాబు, అసిస్టెంట్ ఏఎంవో శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్ ఏవీవీ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# భారత టెక్కీలను దూరం పెట్టండి

**మొదటిపేజీ తరువాయి...**

చైనాలో ఫ్యాక్టరీలు నిర్మించ డం కానీ, భారతీయ టెకీ ఉద్యోగులను రిక్రూట్ చేయడం లాంటివి వద్దన్నారు. టెకీ కంపెనీలు ప్రదర్శిస్తున్న గ్లోబల్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శి ంచారు. ఇలాంటి విధానం వల్ల అనేక మంది అమెరికన్లు ఇబ్బంది పడుతున్నట్లు- చెప్పారు. అమెరికా స్వేచ్ఛను వాడుకుని కొన్ని టాప్ కంపెనీ లు అధిక లాభాలు గడించినట్లు- తెలిపారు. ఆ కంపెనీలు విదేశాల్లో ఎక్కువగా పెట్టు-బడి పెట్టాయన్నారు. ట్రంప్ అధ్యక్ష హయంలో ఇక రోజులు ఉండవని ఆయన అన్నారు. అమెరికాలో ఉదారమైన ప్రయోజనాలను పొందుతూ చైనాలో కర్మాగారాలను నిర్మిస్తున్నాయని అమెరికా దిగ్గజ కంపెనీలపై ట్రంప్ మండిపడ్డారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా కొన్ని కంపెనీలు అక్కడ భారత్ నుంచి ఉద్యోగులను నియమించుకుంటున్నాయని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైనాలో తమ పరిశ్రమలను నిర్మించడం, అక్కడ భారత్ కు చెందిన కార్మికులను నియమించుకోవడం ద్వారా సదరు అమెరికా కంపెనీలు అమెరికన్ల విశ్వాసాన్ని కోల్పోయాయని అన్నారు. తన హయాంలో ఇక ఆ రోజులు ముగిసిపోయినట్టేనని చెప్పిన ట్రంప్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో గెలవడానికి దేశభక్తి కావాలన్నారు. ఏఐ రంగంలో అమెరికాను మొదటి స్థానంలో ఉంచాలని టెక్ కంపెనీలను ట్రంప్ కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో విజయం సాధించడానికి సిలికాన్ వ్యాలీ లోపల, వెలుపల కొత్త దేశభక్తి, జాతీయ విధేయత అవసరమని ట్రంప్ సూచించారు.

అమెరికా టెక్ పరిశ్రమ చాలా కాలం వరకు రాడికల్ గ్లోబలిజాన్ని అనుసరించిందని.. ఇది మిలియన్ల మంది అమెరికన్లకు అపనమ్మకాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా వైట్ హౌస్ యాక్షన్ ఎ÷-లాన్ సహా కృత్రిమ మేధకు సంబంధించిన మూడు కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. ఈ సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ అమెరికా కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్లూప్రింట్‌ను విడుదల చేశారు. కీలక సాంకేతిక పరిజ్ఞానంలో చైనాపై అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నంలో పర్యావరణ నిబంధనలను సడలించడం, మిత్రదేశాలకు కృత్రిమ మేధ ఎగుమతులను విస్తరించడం లక్ష్యంగా ఈ కొత్త కృత్రిమ మేధ బ్లూప్రింట్ ను ట్రంప్ విడుదల చేశారు. 21వ శతాబ్దాన్ని.. ఏఐ నిర్వచించే పోరాటంగా అభివర్ణించిన ట్రంప్.. చైనాతో సాంకేతిక ఆయుధ పోటీని వివరిస్తూ ఈ ప్రణాళికను విడుదల చేశారు.

# యువత, విద్యార్థులకు సమగ్ర శిక్షణ

**పోటాపోటీగా జాగృతి, బిఆర్ఎస్ కార్యక్రమాలు**

**26న కొంపల్లిలో జాగృతి, నాచారంలో బిఆర్ఎస్ శిక్షణ**

హైదరాబాద్, : తెలంగాణలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని మరింత పెంచేందుకు బిఆర్ఎస్,జాగృతి సంస్థలు వేర్వేరు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు ఈ నెల 26న రెండు కీలక కార్యక్రమాలు జరగనున్నాయి. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి సంస్థ యువత, మహిళలను నాయకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో లీడర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. అదే రోజు, భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాచారంలోని ఓ కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ రెండు కార్యక్రమాలు రాష్ట్రంలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు దోహదపడనున్నాయి. తెలంగాణ జాగృతి సంస్థ, ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో యువత, మహిళలను బలమైన నాయకులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమం ద్వారా నాయకత్వ లక్షణాలను, సామాజిక సమస్యలపై అవగాహన, నిర్ణయాధికార నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ సమాజంలో మార్పు తీసుకురావాలంటే, యువత,




మహిళలు నాయకత్వ బాధ్యతలు తీసుకోవాలని కవిత పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే వారికి నాయకత్వం, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం తో పాటు, తెలంగాణ సంస్కృతి, చరిత్ర, రాజకీయాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తినిచ్చే వేదికగా ఉంటుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. అదే రోజు నాచారంలోని కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు ప్రధాన వక్తలుగా పాల్గొననున్నారు. యువ విద్యార్థులను రాజకీయంగా చైతన్యవంతం చేయడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, రాష్ట్ర అభివృద్ధిలో వారి పాత్రను బలోపేతం చేయడమే ఈ సమావేశం లక్ష్యం. విద్య, ఉపాధి, సామాజిక న్యాయంపై చర్చలు జరపడంతో పాటు-, విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తారు.

# ఆ ఒక్క పథకంతో విప్లవాత్మకమార్పు

**మొదటిపేజీ తరువాయి...**

**హైదరాబాద్,జూలై24 : ఒక సంక్షేమ పథకం అనేక విప్లవాత్మక మార్పులకు కారణమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఆడబిడ్డలకు ఆర్థిక భారాన్ని తగ్గించిందన్నారు. ఆరోగ్య రక్షణకు ఆసరాగా నిలిచిందని పేర్కొన్నారు. ఒక్క పథకం వల్ల ఆర్టీసీ సంస్థ అప్పుల నుంచి గట్టెక్కిందని తెలిపారు. 200 కోట్ల జీరో టికెట్లతో సరికొత్త రికార్డుకు చేరుకుందని వివరించారు. ఆర్టీసీకి ప్రాణం పోసిన ప్రతి ఉద్యోగి, సిబ్బంది, కార్మికులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ యాజమాన్యానికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఒక్క పథకం వల్ల ఆర్టీసీలో ఆడబిడ్డల ఆక్యుపెన్సీ 35 నుంచి 60 శాతానికి పెరిగింది. ప్రజాపాలన ప్రారంభమయ్యే నాటికి ..ఇక ఆర్టీసీ కథ కంచికే అన్నట్లు-గా పరిస్థితి ఉండేది. పేదవాడి ప్రగతి రథ చక్రం ఇక చరిత్ర పుటల్లోకి జారి పోతుందనే విధంగా ఉండేది. అక్కడ నుంచి మొదలైన ప్రయాణం నేడు 200 కోట్ల జీరో టికెట్లతో ఆడబిడ్డలకు సాయం చేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు.**

# ఏపీలో మరిన్ని నూతన పరిశ్రమలు..

**మొదటిపేజీ తరువాయి...**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఇవాళ(గురువారం జులై24) ఏపీ సచివాలయంలో కేబినెట్ సమావేశం (జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మొత్తం రూ.70 వేల కోట్లు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటన్నింటినీ గ్రౌండ్ చేయించిన పక్షంలో, లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. వీటిని మనం వెంటబడి గ్రౌండ్ చేయించాలని సూచించారు. ఐటీ, రెన్యువబబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్, ఆటోమొబైల్స్ రంగాల్లో ఈ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపట్టాలని.. ఈ విషయంపై అందరూ దృష్టి సారించాలని మంత్రులకు మార్గనిర్దేశం చేశారు సీఎం చంద్రబాబు. క్వాంటం వ్యాలీ మాదిరిగా మనం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా అందరి కంటే ముందు ఉండాలని.. దీనివల్ల మనకు ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చారు. సింగపూర్‌తో సంబంధాలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు మన చూపించిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం ముందుకు వచ్చి మనకు సహాయం చేసిందని గుర్తుచేశారు. సింగపూర్ ప్రభుత్వం కూడా అలానే సహాయం చేసిందని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు.

# ఆ ఒప్పందం భారీ విజయం

**మొదటిపేజీ తరువాయి...**

ఒప్పందంలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే 99 శాతం ఉత్పత్తులకు జీరో టారిఫ్ వర్తిస్తుంది. అలాగే, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతయ్యే విస్కీపై సుంకం 150 శాతం నుంచి 75 శాతానికి తగ్గనుంది. నిర్దేశిత కోటా మేరకు ఆటోమొబైల్ దిగుమతుల సుంకం 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గనుంది. వీటితో పాటు వైద్య పరికరాలు, అధునాతన మెషినరీ పరికరాలు, చాక్లెట్లు, బిస్కెట్లపై టారిఫ్‌లను భారత్ తగ్గించనుంది. అలాగే, సామాజిక భద్రత ఒప్పందంలో భాగంగా బ్రిటన్‌లో పనిచేసే భారతీయులు సోషల్ సెక్యూరిటీ ఫండ్స్ కింద రెట్టింపు చెల్లింపు చేయాల్సిన అవసరం తప్పుతుంది.

అది ఎంతగానో హత్తుకుంది: మోదీ

నాలుగు రోజులపర్యటనలో భాగంగామోదీ బ్రిటన్,మాల్దీవుల్లో పర్యటిస్తున్నారు. ఈక్రమంలోనే రాత్రి లండన్‌కు చేరుకున్నారు. బ్రిటన్ రాజు ఛార్లెస్-3నికూడా కలవనున్నారు. ఇక లండన్‌లో దిగిన ప్రధానికి ప్రవాస భారతీయుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. స్వదేశం పురోగతిపై వారు చూపుతోన్న నిబద్ధత తనను ఎంతగానో హత్తుకుందని ఆయన వారిని ఉద్దేశించి సంతోషం వ్యక్తంచేశారు.

# అనిల్ అంబానీ రిలయన్స్ ఆఫీసులలో ఈడీ రెయిడ్

**మొదటిపేజీ తరువాయి...**

ఈ సోదాల కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా అధికారులు ముంబైకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, అనిల్ అంబానీ నివాసంలో మాత్రం తనిఖీలు జరగడంలేదని సమాచారం.అనిల్‌అంబానీకిచెందిన రిలయన్స్ సంస్థలు మనీలాండరింగ్ కు పాల్పడ్డాయనే ఆరోపణలతో ఈ సోదాలు చేపట్టినట్లుఅధికార వర్గాలసమాచారం.రిలయన్స్ కమ్యూనికేషన్స్ తో పాటు అనిల్ అంబానీకి చెందిన ఇతర కంపెనీలలో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ ఇటీవల సీబీఐ రెండు ఎఫ్ఐఆర్ లు నమోదు చేసింది. అదేవిధంగా, రిలయన్స్ కమ్యూకేషన్స్‌తో పాటు ఆ సంస్థ ప్రమోటర్-డైరెక్టర్ అనిల్ అంబానీని ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ 'మోసపూరితం' అని పరిగణించిన సంగతి తెలిసిందే.

# నెల్లూరులో పారిశుద్ధ కార్మికుల భారీ ర్యాలీ




నెల్లూరు: మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు సమ్మెలో భాగంగా ఈరోజు నెల్లూరు జిల్లా గాంధీ బొమ్మ స్వతంత్ర పార్కు నుంచి మున్సిపల్ కార్మికులు తొమ్మిదో డివిజన్లో కాంట్రాక్టులకి టెండర్లు పిలవడానికి వ్యతిరేకిస్తూ, టెండర్లను రద్దు చేయాలని వీఆర్సి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్టర్ వేషధారణతో మున్సిపల్ కార్మికుల మెడలకి ఉరితాడు బిగించి వినూత్నమైన పద్ధతిలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో 9వ డివిజన్లో టెండర్ల ప్రక్రియ రద్దు చేయాలని, కాంట్రాక్టీకరణ రద్దు చేయాలని నినాదాలు చేస్తూ వి ఆర్ సి వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు మాట్లాడారు.

# రష్యాలో ఘోర విమాన ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి...**

మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ కావాల్సి ఉండగా.. ఉన్నట్టుండి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌తో సంబంధాలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎమర్జెన్సీ సర్వీసెస్‌ను సిద్ధం చేశారు. విమానం కోసం గాలించగా.. గమ్యస్థానానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో అది కూలిపోయినట్లు గుర్తించారు. దీంతో అందులో ఉన్నవారంతా మరణించి ఉంటారని భావిస్తున్నారు. ఘటనా స్థలంలో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. రెస్క్యూ సిబ్బంది అక్కడికి చేరుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ విమానం తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా.. పరిస్థితులు అనుకూలించలేదని తెలిసింది. రెండోసారి ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. రాడార్ నుంచి సంబంధాలు తెగిపోయి గల్లంతై కూలినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 43 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికుల్లో ఐదుగురు చిన్నారులు ఉన్నట్లు రష్యన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రాణనష్టంపై ఇంకా వివరాలు తెలియరాలేదు. అయితే ఎవరు కూడా బతికి ఉండరిన తెలుస్తోంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

# తెలంగాణ ఐకాన్ కేటిఆర్: బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



విశ్వంభర, సరూర్ నగర్ తెలంగాణ రాష్ట్ర యువతకు మాజీ మంత్రి, బిఆర్ ఎస్ కార్యానిర్వాహాక అధ్యక్షులు కేటిఆర్ తెలంగాణ ఐకాన్ అని బిఆర్ ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్ కె పురం డివిజన్ లో గురువారం డివిజన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అధ్వర్యంలో కేటిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి పురపాలక శాఖ మంత్రిగా కల్వకుంట్ల తారక రామారావు చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. హైదరాబాద్ లో ఐటీ కంపెనీలు విస్తరించడానికి కేటిఆర్ విశేషంగా కృషి చేశారని అని అన్నారు. ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన కేటిఆర్ ప్రపంచంలోనే ప్రముఖ ఐటీ కంపెనీలను తీసుకువచ్చినా ఘనత కేటీఆర్ దే అని అన్నారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడానికి ఆయన చేసిన కృషి చేశారు అన్నారు. బెంగళూరు నగరానికి ధీటుగా హైదరాబాద్ నగరంలో ఐటీ అభివృద్ధి చెందడానికి కేటిఆర్ తీసుకున్న నాటి నిర్ణయాలు భవిష్యత్తు యువత ఉపాధికి దోహదం చేస్తున్నాయని అని అన్నారు.
తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ, రాష్ట్ర అభివృద్ధిలో కూడ కల్వకుంట్ల తారక రామారావు పాత్ర అత్యంత కీలక పాత్ర పోషించారు అని ఆయన పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో ఆర్ కె పురం డివిజన్ సమగ్రాభివృద్ధికి
కృషి చేస్తానని అరవింద్ శర్మ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్ , సాజిద్, శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, కొంద్రు శ్రీనివాస్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, ముచ్చింతల జగన్, రమేష్ కురుమ, వాజిద్ పటేల్, సంతోష్, శివ నాయక్, నవీన్ గౌడ్, నిరంజన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు తెలంగాణ దిక్సూచి కేటీఆర్ - అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి



విశ్వంభర,మీర్ పెట్ బంగారు తెలంగాణ దిక్సూచి కేటీఆర్ అని మీర్పేట్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట,మాజీమంత్రికల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు . కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మీర్పేట్ జూనియర్ కళాశాలలో నోటుబుక్కులు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డిక్షనరీ, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కామేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు ప్రగతి పథం చూపిన నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీ నరసింహ రెడ్డి, జనరల్ సెక్రటరీ శీను నాయక్,మహిళా అధ్యక్షురాలు సునీత, విజయలక్ష్మి,సీనియర్ నాయకులు సిద్దాల బీరప్ప, దీప్‌లాల్ చౌహన్, సుదర్శన్ రెడ్డి, నరసింహారెడ్డి, చారి, దయానంద్ ముదిరాజ్, శేఖర్ గౌడ్,ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్, పంతంగి మాధవి, శేఖర్ రెడ్డి, బిందు, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల పంట పండింది

**-యానాంలో తాజాకా రూ.26 వేలు పలికిన పులస చేప**
**-భారీ ధర పలుకుతున్న పులస చేపలు**
**-ఈ సారి అంతకు మించి ధర**



యానాం : గోదావరి నదికి వరదలు వస్తుండడంతో యానాంలో పులసల సందడి కొనసాగుతోంది.ప్రస్తుతం వేలంలో పులస చేపలు భారీ ధర పలుకుతున్నాయి. జరిగిన పాటలో 2కిలోల పులస చేప వేలంలో 26వేలకు భారీ ధర పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర కావడం విశేషం.ఈ సీజన్‌లో పులస చేపల కోసం చాలా మంది ఆసక్తి కనబర్చడం కారణంగానే భారీ ధర పలుకుతున్నాయట. ఈ సీజన్‌లో తొలి పులస చేప యానాం ఫిష్ మార్కెట్‌లో రూ.4వేలు ధర పలికింది కాని అది పులస కాదు విలస అని అపోహలు ఉన్నాయి. అయితే తర్వాత వచ్చే చేపలకు పులస ప్రియులు వేలంలో పోటీ పడడంతో మరో చేప రూ.15వేలు పలికింది. తర్వాత దొరికిన రెండు పులస చేపలు రూ.13 వేలు, రూ.18 వేలుగా అమ్ముడయ్యాయి. ఈ వారంలో మరో చేప రూ.22 వేల ధర పలికింది. అయితే తాజాగా 2 కిలోల పులస చేప రూ.26 వేలు పలికింది. ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన బెజవాడ సతీష్ అనే వ్యక్తి తాజాగా జరిగిన వేలం పాటలో 26 వేలకు దక్కించుకున్నారు. యానాంలో పులసల సందడి మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో రికార్డు ధర పలుకుతుందేమో చూడాలి. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో పులస సీజన్ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది గోదావరికి వరద నీటి తాకిడి పెరగడంతో పులస చేపల సీజన్ మొదలైంది. నదికి ఎర్ర నీరు ఉధృతంగా రావడంతో పులసలు ఎదురీదుతూ వస్తున్నాయి. ఈ క్రమంలోనే యానాంలో మత్స్యకారుల పంట పండుతోంది. నదీ ప్రవాహానికి అతి వేగంగా ఎదురీదడం పులస ప్రత్యేకత. అంతేకాదు..ఎంతో రుచికరంగా కూడా ఉంటుంది. అందుకే పులస కోసం వేలంలో ఎంత ధర పెట్టడానికైనా జనాలు వెనుకాడరు. 'పుస్తెలు అమ్మైనా సరే.. పులస తినాలి' అని అంటారు.

# ఇంటర్ సిటీకి అదనపు బోగీలు



విజయవాడ : రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. ప్రయాణికుల సౌకర్యం, డిమాండ్ నేపథ్యంలో విజయవాడ – లింగంపల్లి– విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు బోగీలు అమర్చనున్నట్లు విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయంలో ఓ ప్రకటనలో తెలిపింది. విజయవాడ లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక 3ఎం ఎకానమీ కోచ్.. అలాగే లింగంపల్లి విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు మరో 3ఎం ఎకానమీ కోచ్ ఏర్పాటు చేయనున్నారు. జూలై 26, 27 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది.రైలు ప్రయాణికులకు శుభవార్త. విజయవాడ – లింగంపల్లి – విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయనున్నారు ఈ విషయాన్ని విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికుల సౌకర్యం కోసం, అలాగే ప్రయాణికుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను అనుసరించి రైలు నంబర్ 12795/96 విజయవాడ – లింగంపల్లి – విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు శాశ్వతంగా అదనపు కోచ్‌లు పెంచినట్లు విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయం వెల్లడించింది. అదనపు బోగీలు ఏర్పాటు ద్వారా మరిన్ని సీట్లు, సౌకర్యవంతమైన, సుఖవంతమైన ప్రయాణానికి వీలు కలుగుతుందని తెలిపింది. 12795 నంబర్ విజయవాడ – లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక 3ఎం ఎకానమి కోచ్ అమర్చనున్నారు. 12796 నంబర్ లింగంపల్లి – విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక 3ఏసీ ఎకానమీ కోచ్ అమర్చనున్నారు. జూలై 26, జూలై 27వ తేదీల నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయం వెల్లడించింది. మరోవైపు విజయవాడ – లింగంపల్లి – విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ జంక్షన్ రైల్వేస్టేషన్ నుంచి తెలంగాణలోని లింగంపల్లి మధ్య ప్రతిరోజూ అందుబాటులో ఉంటాయి. 2018లో వీటిని ప్రవేశపెట్టారు. ఏపీ రాజధాని ప్రాంతం.. హైదరాబాద్ మధ్య ప్రయాణించే ప్రభుత్వ ఉద్యోగులకు ఈ రైళ్లు సౌకర్యంగా ఉంటాయి.విజయవాడ – లింగంపల్లి– విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 336 కిలోమీటర్ల దూరాన్ని సుమారు 5 గంటల 55 నిమిషాలలో చేరుకుంటాయి. లింగంపల్లి నుంచి ప్రతిరోజూ ఉదయం 4 గంటల 40 నిమిషాలకు లింగంపల్లి –విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (12796) రెలు బయల్దేరుతుంది. ఉదయం 10 గంటల 35 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుంది. థర్డ్ ఎకానమీ (3ఇ), చైర్ కార్ (అఅ), సెకండ్ సీటర్ (2ూ) కోచ్‌లు అందుబాటులో ఉన్నాయి. బేగంపేట్ , సికింద్రాబాద్ జంక్షన్, నల్గొండ, గుంటూరు జంక్షన్, మంగళగిరిలో ఈ రైలుకు స్టాపింగ్ ఉంది.



## ఓంకార్ నగర్ లో అమావాస్య అన్న ప్రసాద వితరణ.

విశ్వంభర, హస్తినాపురం,హస్తినాపురం డివిజన్ ఓంకార్ నగర్ లోని గణేష్ కిరాణా దగ్గర అమావాస్య అన్న ప్రసాద వితరణ ఆర్యవైశ్య సంఘం హస్తినాపురం ఆధ్వర్యంలో దాదాపు 600 మందికి అన్న ప్రసాద వితరణ చేసినట్లు అధ్యక్షుడు నీల మధుసూదన్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ బిజ్జల వేణుగుప్త, ట్రెజరర్ బండారు సుధాకర్ గుప్తా, హానర్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు గుప్తా, పి ఆర్ ఓ నీలాంటి వెంకటేశ్వర్లు గుప్తా, ఆర్గనైజర్ సెక్రెటరీ యేలకంటి రవీంద్ర, ముఖ్య సలహాదారులు భాస్కర్ గుప్త, సముద్రాల ఆంజనేయులు, జూలూరు సురేష్, కర్నాటి శ్రీను, చీకటి మల్ల శేఖర్, గణేష్ ,సుభాష్, విజయ్ కుమార్, హరి నారాయణ ,సుధాకర్ ,వెంకయ్య, క్షత్రయ్య, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిపై 11 లక్షల అప్పు

ప్రపంచంలో ఎంత అప్పు ఉందో తెలుసా..? అది ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ పంచితే దాదాపు రూ.11 లక్షల ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం, ప్రపంచం మొత్తం అప్పు 102 ట్రిలియన్ డాలర్లు అంటే రూ. 8,67,53,95,80,00,00,001. ప్రపంచ జనాభా 8.2 బిలియన్లు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా అత్యధిక రుణాన్ని కలిగి ఉంది. కాగా, చైనా, జపాన్, యూరోపియన్ దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ జాబితాలో భారత్ 7వ స్థానంలో ఉంది. దీని మీద 3 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉంది. ఇది మొత్తం ఉఆఖ కంటే తక్కువగా ఉండవచ్చు. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌కి ఈ రుణం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచం, దేశాల రుణాలకు సంబంధించి ఈ నివేదికలో ఎలాంటి గణాంకాలు ఉన్నాయో చూద్దాం. భారతదేశం గత దశాబ్దకాలంలో అనేక ఆర్థిక సంస్కరణలు, సామాజిక పథకాలు, రాజకీయ మార్పులను చవిచూసింది. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశ ఆర్థికవృద్ధి, ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ఎన్నో వాగ్దానాలు చేసింది. అయితే, ఇటీవలి ఆర్థిక నివేదికలు, సామాజిక వాస్తవాలు సామాన్య పౌరుడి జీవితంలో పెరిగిన అప్పుల భారాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల విడుదల చేసిన ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్- 2025 ప్రకారం, దేశంలోని ప్రతి పౌరుడిపై సగటున రూ. 4.8 లక్షల అప్పు ఉంది. ఇది గత రెండేళ్లలో రూ. 90,000 మేర పెరిగింది. ఈ గణాంకాలు సామాన్యుడి జీవన పరిస్థితులు ఎంత దిగజారాయో చాటుతున్నాయి.ఆర్‌బిఐ నివేదిక ప్రకారం, 2023 మార్చిలో ఒక్కో పౌరుడిపై అప్పు రూ. 3.9లక్షలుగా ఉండగా, 2025 మార్చి నాటికి ఇది రూ. 4.8 లక్షలకు చేరింది. ఈ రూ. 90,000 పెరుగుదల సామాన్యుడి ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది. దేశ జిడిపిలో అప్పుల వాటా 41.9 శాతంగా ఉంది. ఇందులో గృహ రుణాలు 29 శాతం. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, మొబైల్ ఇఎంఐలు 54.9 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మరో ఆందోళనకర అంశం ఏమిటంటే, లోన్- టు-వాల్యూ (ఎల్‌టివి) రేషియో 70 శాతానికి పైగా ఉండటం. ఇది రుణాల రికవరీని కష్టతరం చేస్తుంది. అంతేకాక, 25 శాతం రిటైల్ రుణాలు సురక్షితం కానివిగా గుర్తించారు. ఇది ఆర్థిక వ్యవస్థలో అస్థిరతను సూచిస్తుంది.ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, దేశంలో సగటు తలసరి ఆదాయం రూ. 2.16 లక్షలు మాత్రమే. అంటే, సామాన్యుడి అప్పు అతని ఆదాయం కంటే రెండింతలకు పైగా ఉంది. ఈ అసమతుల్యత సామాన్య పౌరుడు తన రోజువారీ జీవన అవసరాల కోసం అప్పులపై ఆధారపడుతున్నాడని స్పష్టం చేస్తుంది. ఆర్‌బిఐ గణాంకాలు చెప్పేది ఏమిటంటే 55% అప్పులు, ఆస్తుల సృష్టికి కాకుండా, కేవలం జీవన ఖర్చుల కోసమే తీసుకోబడుతున్నాయి. క్రెడిట్ కార్డుల వాడకం, వ్యక్తిగత రుణాలు, ఇఎంఐలు ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. సామాన్యుడు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది, నిత్యావసర వస్తువుల ధరలు గత 11 ఏళ్లలో దాదాపు 300 శాతం పెరిగాయి. ఆహారం, ఇంధనం, గృహ ఖర్చులు, విద్య, వైద్యం వంటి అంశాలు సామాన్యుడికి భారంగా మారాయి.రెండవది, ద్రవ్యోల్బణం పెరిగినా, వేతనాలు దానికి అనుగుణంగా పెరగలేదు. చాలీచాలని జీతాలతో కుటుంబ ఖర్చులను భరించలేక, ప్రజలు అప్పులపై ఆధారపడుతున్నారు. మూడవది, నైపుణ్యానికి తగిన ఉపాధి అవకాశాలు తగ్గాయి. యువతలో నిరుద్యోగం రేటు గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది, ఇది ఆర్థిక అస్థిరతకు దారితీస్తోంది. ఈ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలు- ఉదాహరణకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై), ఆయుష్మాన్ భారత్- పేదలకు సహాయం చేసే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. అయితే, ఈ పథకాలు అమలులో లోపాలు, అవగాహన లేమి లేదా అర్హత సమస్యల వల్ల సామాన్యుడికి పూర్తి ప్రయోజనం చేకూరడం లేదుపిఎంఎవై కింద గృహ రుణాలపై సబ్సిడీలు అందుతున్నప్పటికీ అర్హత నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియలు సంక్లిష్టంగా ఉండటం వల్ల చాలా మంది ఈ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వంటి విమర్శకులు, మోడీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విఫలమైందని ఆరోపిస్తున్నారు. అచ్చేదిన్ నినాదంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం, వాస్తవానికి ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిందని వాదిస్తున్నారు. ఒక వైపు సామాన్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే, ప్రభుత్వానికి సన్నిహిత వ్యాపార వేత్తలు మాత్రం అపార సంపదను సృష్టించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు, ఉదాహరణకు, ఐటి హార్డ్‌వేర్, బయో టెక్నాలజీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ ఈ ప్రయోజనాలు ప్రధానంగా కార్పొరేట్ రంగానికే చేకూరుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. మొదట ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి.నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడం అత్యవసరం. రెండవది, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలి. మూడవది, రుణాల విషయంలో పారదర్శకత, సురక్షిత రుణవిధానాలను అమలు చేయాలి. అంతేకాక సామాన్యులకు విద్య, వైద్యం, గృహసౌకర్యాలు అందించే పథకాలు సులభతరం చేయాలి. తద్వారా వారు అప్పులపై ఆధారపడకుండా ఉండగలరు. మోడీ పాలనలో దేశం కొన్ని రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ, సామాన్యుడి జీవనపరిస్థితులు మాత్రం ఆశాజనకంగా లేవు. పెరిగిన అప్పుల భారం, ద్రవ్యోల్బణం, ఉపాధి అవకాశాల కొరత వంటివి పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక స్థిరత్వం, సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే సామాన్యుడి జీవితం మరింత కష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. భారతదేశం మొత్తం ఉఆఖ 3.7 ట్రిలియన్ డాలర్లు. అటువంటి పరిస్థితిలో భారతదేశం అప్పు మొత్తం జీడీపీ కంటే తక్కువగా ఉంది. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు అప్పుల పరిమాణం చాలా ప్రమాదకరమైనది. ప్రపంచ రుణంలో వాటా గురించి మాట్లాడినట్లయితే, అది 3.2 శాతం. ప్రపంచంలో చాలా తక్కువ రుణాలు ఉన్న దేశాలు ఉన్నాయి. ఇరాక్, చిలీ, చెక్ రిపబ్లిక్, వియత్నాం, హంగరీ, జఇ. బంగ్లాదేశ్, ఉక్రెయిన్, తైవాన్, రొమేనియా, నార్వే, స్వీడన్, కొలంబియా, ఐర్లాండ్ మరియు ఫిన్లాండ్. అదే సమయంలో ప్రపంచ రుణంలో పాకిస్తాన్ మొత్తం అప్పుల వాటా 0.3 శాతంగా కనిపించింది.ఎఓఈ నివేదిక ప్రకారం.. 2024 నాటికి ప్రపంచం పెరుగుతున్న అప్పులు పెద్ద సమస్యగా మారాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాల అప్పులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. మనం ప్రపంచ రుణం గురించి మాట్లాడినట్లయితే, అది 102 ట్రిలియన్ డాలర్లు అంటే రూ. 8,67,53,95,80,00,00,001. కాగా గ్లోబల్ జిడిపి 110 [redacted]

# స్మార్ట్ ఫోన్లతో పిల్లల్లో మానసిక సమస్యలు..!

## హెచ్చరించిన అధ్యయనం



న్యూఢిల్లీ, : స్మార్ట్‌ఫోన్‌లు వాడుతున్న 13 ఏండ్ల పిల్లల్లో మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. భారత్‌తో సహా ఆయా దేశాలకు చెందిన 1,30,000 మంది (18–24 ఏండ్ల) మానసిక ఆరోగ్య డాటాను పరిశోధకులు విశ్లేషించగా, స్మార్ట్‌ఫోన్ వాడుతున్న 13 ఏండ్ల లోపు పిల్లల్లో దూకుడు స్వభావం, వాస్తవికతకు దూరంగా భ్రమల్లో గడపటం, నిర్లిప్తత, ఆత్మహత్య ఆలోచనలు.. మొదలైనవి ఎక్కువగా కనపడినట్టు వారి నివేదిక పేర్కొన్నది. 'జర్నల్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్, క్యాపబిలిటీస్' కథనం ప్రకారం, పిల్లల కోసం 'కిడ్స్ ఫోన్లు' తీసుకురావాల్సిన అవసరముందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. 13 ఏండ్ల లోపు స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న పిల్లలు తీవ్ర మానసిక ఆరోగ్య సమస్యల బారిన పడతారని, దీనికి ప్రత్యామ్నాయ మార్గాలను కనుగొనాల్సిన అవసరముందని, సురక్షితమైన డిజిటల్ వేదికలను అందుబాటులో తీసుకొచ్చేలా విధానాలు రూపొందించాలని తెలిపింది.

www.vishvambhara.com తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...

# వర్షాకాలంలో దంత సంరక్షణ కీలకం



మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా అనారోగ్యంతో ఉన్నామా? అనేది మన దంతాల ఆరోగ్యాన్ని బట్టి చెప్పేయొచ్చు. శరీరం మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన దంత సంరక్షణ కూడా అవసరం. నోటి పరిశుభ్రత పాటించకపోతే దంత క్షయం, చిగుళ్ల వ్యాధులు వస్తాయి. దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తినాలి. కొన్ని సాధారణ అలవాట్లు, దంతవైద్యుల సూచనలు పాటించటం ద్వారా చిగుళ్ళు. దంతాల ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపర్చుకోవచ్చు.

ప్రస్తుత వర్షాకాలంలో మన శరీరం ఒక రకమైన ఆహ్లాదానికి గురౌతూ ఉంటుంది. తొలకరి చినుకులు, మట్టి వాసనలు శరీరానికి హాయి నిస్తాయి. వీటిని ఆస్వాదించే లోపుగానే వ్యాధులు కూడా చుట్టుముట్టే స్తుంటాయి. వీటిలో ముఖ్యంగా నోటికి, చిగుళ్లు, దంతాలకు సంబంధించిన వ్యాధులు మరీ ఎక్కువగా మనల్ని బాధిస్తుంటాయి. వాతావరణంలోని అధిక తేమ, చల్లదనం, తరచూ నోటి సమస్యలకు దారితీస్తుంటాయి. వీటిని విస్మరిస్తే పూర్తి శరీర ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో వచ్చే దంత ఆరోగ్య సమస్యలు- వాటికి పరిష్కార మార్గాలు గురించి తెలుసుకుందాం..

సాధారణ సమస్యలివే: వాతావరణంలో తేమ కారణంగా బ్యాక్టీరియా, ఫంగై (ఫంగి) మన నోట్లో అధికంగా పెరిగే అవకాశం ఉంది. చిగుళ్లు, పంటి ఎముక సమస్యలు పెరిగే అవకాశం ఉంది. చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి రక్తస్రావం వంటి సమస్యలు, పళ్లు శుభ్రం చేసుకునే సమయంలో తరచూ గమనించొచ్చు. వీటిని అశ్రద్ధ చేస్తే చిగుళ్ల క్రింది భాగానికి వ్యాపించి పంటి ఎముకను బలహీనపర్చి పన్ను పటుత్వాన్ని క్షీపింప జేసే అవకాశం ఉంది.

చిగుళ్ల వ్యాధులు : వాతావరణంలో తేమ కారణంగా నోట్లో బ్యాక్టీరియా అధికంగా వృద్ధి చెందుతుంది. ఆ క్రిములు చిగుళ్ల నుంచి లోపలి భాగాలకు తేలికగా వ్యాపిస్తాయి. అదే సమయంలో పంటిపై ఈ క్రిములు శాశ్వత నివాసం ఏర్పర్చుకునే ప్రయత్నం చేస్తాయి. ఇవి గణనీయంగా పెరిగితే ఒక్కోసారి తొలగించటం కష్టతరంగా మారుతుంది. అందుకే ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్ట్ వాడాలి. పళ్ల మధ్యలో (రెండు పళ్ల మధ్యలో) శుభ్రం చేసుకో వటానికి డెంటల్ ఫ్లాస్‌ను వినియోగించాలి. తద్వారా బ్రష్ చేయలేని ప్రాంతాల్లో కూడా శుభ్రం చేసు కోవచ్చు. అవసరమైతే మౌత్‌వాష్‌ను వాడాల్సి రావొచ్చు.

నోటి దుర్వాసన : ఈ కాలంలో వచ్చే మరో సమస్య. నోరు ఎండిపోవడం, లాలాజలం ఉత్పత్తి తగ్గిపోవటం, నీరు తాగడం (వాతావరణ ప్రభావం వల్ల) తగ్గడం వల్ల, పళ్లలో ఆహార పదార్థాలు ఇరుక్కుపోయి అక్కడే ఉండిపోవటం వల్ల నోటి దుర్వాసన సమస్య మొదలవుతుంది. కాఫీ, టీ మొదలైన పానీయాలు తాగటం పెరగటం వల్ల నోరు ఎండిపోయి నోటి దుర్వాసన ఎక్కువవుతూ ఉంటుంది. తీపి, కారపు పదార్థాలు తిన్నప్పుడు ఈ సమస్యలు ఎక్కువగా వస్తాయి. ఆహారంలో మసాలాలు, ఘాటుగా ఉండే పదార్థాలు, ధూమ పానం, కాఫీ వంటి పానీయాలు తగ్గిస్తే కొంతమేర ఫలితం ఉంటుంది.

పళ్ల తీపులు (జివ్వుమని లాగడం) : ఈ కాలంలోనే పళ్లు జివ్వుమని లాగడం ఎక్కువగా గమనిస్తుంటాం. బయట వాతావరణం చల్లగా మారటం, ఇళ్లలో వాతావరణం వేడిగానే ఉండటం వల్ల మననోటిలోని పళ్లు కూడా విస్తరణ- సంకోచానికి గురై తద్వారా జివ్వుమని లాగుతాయి. వేడి, శీతల పానీయాలు తీసుకున్నప్పుడు కూడా గమనించొచ్చు. పంటి పొర ఎనామిల్ దెబ్బతినటం వల్ల రెండో పొర డెంటిన్ పొర బయటపడుతుంది. ఈ డెంటిన్ పొర ఉష్ణోగ్రత మార్పులకు అను గుణంగా మార్పు చెందుతుంది. పంటి లోపలి నరాలు ఈ మార్పులకు స్పందించి జివ్వుమనే ఒక షాక్ వంటి పరిస్థితికి మన పళ్లను గురి చేస్తాయి.అల్ట్రా సాఫ్ట్ బ్రష్‌తో పళ్లను శుభ్రం చేయటం, ఫ్లోరైడ్ వార్నిష్, లేజర్ డీ సెన్సిటైజేషన్ వంటి పద్ధతుల ద్వారా ఈ సమస్యను అరికట్టొచ్చు.

పిప్పిపళ్లు : అధికంగా తీపి, వేయించిన పదార్థాలు తినటంతో పిప్పిపళ్లు తయారయ్యే ప్రమాదముంది. నోట్లో హానికారకమైన క్రిములు వృద్ధి చెందుతాయి. అవి పంటిపై యాసిడ్ దాడిచేసి గట్టి దనాన్ని తగ్గిస్తాయి. తద్వారా పన్ను మెత్తపడి పిప్పిగా మారుతుంది. తీయగా, జిగురుగా ఉండే ఆహార పదార్థాలను తినటం తగ్గించాలి. తీపి తిన్న తర్వాత పళ్లను శుభ్రం చేసుకోవాలి. టూత్‌పేస్ట్‌లో ఫ్లోరైడ్ ఉండే విధంగా జాగ్రత్త పడాలి.

నోట్లో అల్సర్లు : సరైన పోషణ లేమి, ఒత్తిడి, తరచూ జలుబు, ఫ్లూ మొదలైన వ్యాధులు బారిన పడటంతో మనలో వ్యాధి నిరోధక శక్తి క్షీణించి నోట్లో పలు రకాల అల్సర్లు వస్తుంటాయి. వీటివల్ల ఆహారం తీసుకోవటం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. కారణమేమంటే వ్యాధి నిరోధక శక్తి, శరీరంలోని నీటిశాతం తగ్గటం, అధికంగా పులుపు వస్తువులు తినడం, తగిన వేడి పానీయాలను తాగటం వల్ల నోట్లో అల్సర్లు ముదురుతాయి. వీటి నివారణకు మంచి పోషక విలువలున్న ఆహారాలైన విటమిన్ సి, బి 12లను తీసుకోవాలి. తగిన మోతాదులో నీరు తాగాలి. అధికంగా కారం, పులుపు వస్తువులు తీసుకోకూడదు. దంత వైద్య పరీక్షలు చేయించుకుని వాటికి తగిన మందులు వాడాలి

కలుషిత నీటితో ఇన్ఫెక్షన్లు : తాగేనీరు కలుషితమైతే అనేక రకాల క్రిములునోటి ద్వారా శరీరంలోకిప్రవేశించి అనేక రకాలైన వ్యాధులకు గురిచేస్తాయి. ఈ క్రిములతో చిగుళ్ల సమస్యలు అధికంగా వస్తాయి.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు : తేమశాతం అధికమవ్వటం వల్ల నోట్లో క్యాండియాసిస్ అనే ఫంగల్ ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. ఇది వ్యాధి నిరోధక శక్తి క్షీణిం చిన వారిలో అధికంగా కనిపిస్తుంటుంది. నోట్లో తెల్లని మచ్చలు, పొక్కులు కన్పిస్తాయి. దీనివల్ల నోరు మంట, నొప్పి, మింగడం కష్టంగా మారటం వంటి లక్షణాలుంటాయి. రోజుకు రెండుసార్లు పళ్లను శుభ్రం చేసుకోవటం, నోట్లో ఎవ్వరికైనా పళ్ల సెట్టు ఉంటే వాటిని రాత్రి వేళల్లో తీసేసి ఉదయం శుభ్రపర్చుకుని మళ్లీ ధరించటం ద్వారా మెరుగైన ఫలితాలు పొందొచ్చు.

పళ్లపై మచ్చలు, మరకలు : రోజుకు పలుమార్లు టీ, కాఫీ, ఇతర పానీయాలు సేవించే వారి పళ్లు అందవిహీనంగా తయారవుతాయి. పళ్లు పచ్చ, గోధుమరంగులో మారిపోతుంటాయి. టీ, కాపీ, ఇతర పానీయాల్లో టానిన్లు అనేక రకమైన పిగ్మెంట్లు ఉండటంతో అవి మన పంటి పై పొరకు అతుక్కుపోయి మరకలుగా కనిపిస్తాయి. క్రమంగా అవి గట్టిపడి తొలగించటానికి కష్టంగా తయారవు తాయి. కాఫీ, టీ ఇతర పానీయాల వాడకాన్ని తగ్గించాలి. సేవించిన వెంటనే నోటిని పుక్కి లించాలి. రోజుకు రెండుసార్లు శుభ్రం చేసుకోవాలి. పళ్లు తెల్లబడే టూత్‌పేస్టులు వాడాలి.

ఈ జాగ్రత్తలు మేలు: రోజుకు రెండుసార్లు పళ్లు, నాలుకను శుభ్రం చేసుకోవాలి. తగిన మోతాదులో రక్షిత మంచినీటిని తాగాలి. అతి వేడి, అతి శీతల పానీయాలు ఆపేయాలి. తీపి, పులుపు పదార్థాలను మితంగా తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలి. తాజా పండ్లు, మంచి ఆహారాన్ని తినాలి.

# ఈ ఆగస్టు 5 ఏం చేస్తారో..?

న్యూఢిల్లీ: మోదీ 3.0 ప్రభుత్వం 2025 సంవత్సరానికి సంబంధించిన వర్షాకాల పార్లమెంటు సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 21, 2025 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాలు గతంలో ఎన్నడూ లేని విధంగా 21 రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ సమావేశాలు రాజకీయ, భద్రతా, చట్టసభా దృష్ట్యా అత్యంత కీలకమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రధాన పరిణామాలు దేశ రాజకీయ వాతావరణంలో ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి:.. ఒకటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ సందర్శన, రెండోది ఆగస్టు 5న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హఠాత్తుగా ఢిల్లీకి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమావేశాలు, ముఖ్యంగా అమిత్ షాతో గంటసేపు, మోదీతో రెండుసార్లు జరిగిన చర్చలు, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్శన రాష్ట్రంలోని రాజకీయాల గురించా.. లేక భద్రతా అంశాలా.. లేక సమావేశాల్లో చర్చించబడే కీలక బిల్లులకు సంబంధించిన సన్నాహాలై ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, భద్రతా ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది. ఈ డ్రిల్ దాడులు లేదా ముట్టడి వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధతను పరీక్షించే లక్ష్యంతో నిర్వహించబడింది. ఆగస్టు 5 ఎన్డీఏ ప్రభుత్వానికి చారిత్రక ప్రాముఖ్యత కలిగిన తేదీ. 2019లో ఆర్టికల్ 370 రద్దు, 2020లో రామమందిర భూమిపూజ వంటి కీలక సంఘటనలు ఈ రోజున జరిగాయి. ఈ సంవత్సరం ఆగస్టు 5న మరో కీలక బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఊహాగానాలు సాగుతున్నాయి. 'ఒకే దేశం ? ఒకే ఎన్నిక' లేదా ఇండియన్ సిటిజన్‌షిప్ యాక్ట్ వంటి బిల్లులు ప్రవేశపెట్టబడవచ్చని అంచనాలు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం తన నిర్ణయాలను రహస్యంగా ఉంచి, ఊహించని విధంగా ప్రకటించడంలో పరిచయస్తుడు కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. ఇదిలా ఉంటే ప్రతిపక్షాలు సమావేశాలను స్తంభింపజేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన, ఆపరేషన్ సిందూర్‌లో యుద్ధ విమానాల నష్టం, ఆపరేషన్ ఆపివేత కారణాలు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధ నిలిపివేత సూచనలపై స్పష్టత కోరుతూ ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ విషయాలపై వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇది సమావేశాల సాఫీగా సాగే అవకాశాలను సవాలు చేస్తుంది.ప్రభుత్వం ఈ సమావేశాల్లో 15 బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. వీటిలో 8 కొత్త బిల్లులు, 7 పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఉన్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్?2025 బిల్లు వంటి కొన్ని బిల్లులపై ఇప్పటికే చర్చ జరుగుతోంది. అయితే, ఆగస్టు 5న ప్రవేశపెట్టబడే బిల్లు దేశ రాజకీయాలను మర్చేదిగా ఉంటుందన్న ఊహాగానాలు సాగుతున్నాయిఈ సమావేశాలు కేవలం చట్టసభా కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కాకుండా, దేశ రాజకీయ, భద్రతా వాతావరణంపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ పర్యటన, పార్లమెంట్ వద్ద మాక్ డ్రిల్ వంటి సంఘటనలు భద్రతా ఆందోళనలను సూచిస్తున్నాయి. అదే సమయంలో, ప్రతిపక్షాల ఆందోళనలు, కేంద్రం యొక్క రహస్య నిర్ణయాలు ఈ సమావేశాలను ఉత్కంఠభరితంగా మార్చాయి.

# భారీ వర్షాలు.. బొగత వాటర్ ఫాల్స్ వద్ద నిషేధాజ్ఞలు..!



వరంగల్ : రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుశాయి. ములుగు జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. దాంతో లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. జయశంకర్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షాలకు ములుగు జిల్లాలో బొగత వాటర్ ఫాల్స్ వద్ద భారీగా వరద పెరిగింది. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దుల్లో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వాజేడు మండలం వద్ద ఉధృతంగా బొగత జలపాతం వరద పరవళ్లు తొక్కుతున్నది. దాంతో అధికారులు అప్రమత్తమై వాటర్ ఫాల్స్ వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. భారీగా వరద వస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పర్యాటకులను అనుమతించడం లేదని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ములుగు జిల్లాలో భారీగా వర్షపాతం నమోదైంది. వెంకటాపురంలో అత్యధికంగా 25 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. అలాగే, ఏటూరునాగారంలో 18.4, మంగపేటలో 15.8, అలుబాక(జెడ్)లో 14.9, గోవిందరావుపేటలో 12.3, వెంకటాపూర్‌లో 8.9, లక్ష్మీదేవిపేటలో 9.3, వాజేడులో 7.2, ములుగు మండలం మల్లంపల్లిలో 6.4 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయ్యిందని వాతావరణశాఖ తెలిపింది.



## నాగారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

నాగారం, నాగారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన వైశ్య రాజకీయ రణభేరి గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక , వైశ్య రాజకీయ రణభేరి అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్త ముఖ్య అతిధిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైశ్య రాజకీయ రణభేరి అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ ఆగస్టు 3 న హైద్రాబాద్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే వైశ్య రాజకీయ రణభేరి మీటింగ్ కు పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా వైశ్యులు హాజరు అవ్వాలని కోరుతూ అలాగే వైశ్యుల హక్కుల కోసం, రాజ్యాధికారంలో వాటా కోసం, ఈడబ్ల్యుఎస్ వర్గీకరణ అంశాలతో పాటు వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించే దిశగా ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రతిఒక్కరు ఈ మీటింగ్ కు హాజరయ్యి విజయవంతం చేయాలనీ కోరారు. ఈ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో గుండ వెంకన్న ,లింగ నాగేందర్ ,ఉప్పల ప్రసన్న కుమార్ లింగ అమరేందర్ బెజుగం శ్రీనివాస్, బెజుగం సుదర్శన్, వినయ్ గుప్తా, లింగ లత పబ్బ రేఖ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి: మధు యాష్కీ గౌడ్.



విశ్వంభర, ఎల్బీనగర్‌పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని గడ్డి అన్నారం డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ సునీల్ బాబు, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు బద్దుల వేణు గోపాల్ యాదవ్ లకుటీపీసీసీ క్యాంపెనింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మధు యాష్కి గౌడ్ సూచించారు. గురువారం క్యాంప్ ఆఫీస్ లో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అయిన 6 గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేసి చూపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ , కృష్ణారెడ్డి , మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


# శ్రీశైల జలాశయానికి భారీగా వరద..

## అవుట్ 1.14లక్షల క్యూసెక్కులు..!



శ్రీశైలం : ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రభావం కొనసాగుతున్నది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి డ్యామ్‌లో చేరుతున్నది. ప్రస్తుతం జలాశయానికి 91,812 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఇక అవుట్ ఫ్లో 1,14,709 క్యూసెక్కులుగా నమోదైంది. ఒక స్పిల్‌వే గేట్ ఎత్తి 27,52 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20వేల క్యూసెక్కులు విడుదలవుతోంది. ఎడమ గట్టు, కుడిగట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. ఎడమగట్టు నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు నుంచి 31,870 క్యూసెక్కులు వరద దిగువకు వెళ్తున్నది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883.80 అడుగుల మేర నీరుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 208.72 టీఎంసీల మేర నిల్వ ఉందని అధికారులు తెలిపారు. అయితే, ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో వానలు దంచికొడుతున్నాయి. వర్షాలు ఇలాగే కొనసాగితే కృష్ణా నదికి వరద ఇంకా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## తడకమల్లలో ఆర్టీసీ బస్సుకు నిప్పుపెట్టిన దుండగులు..!



మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. గ్రామంలో రాత్రి నైట్‌హాల్టుగా ఉన్న ఆర్టీసీ బస్సును గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి నట్లు సమాచారం. దాంతో బస్సు పాక్షికంగా దగ్ధమైందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ లక్ష్మయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మరో వైపు ఆర్టీసీ అధికారులు సైతం గ్రామానికి చేరుకొని బస్సును పరిశీలించారు. బస్సును తగులబెట్టేందుకు ప్రయ త్నించిన వారి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు ఆరా తీస్తున్నారు. బస్‌కు ఎందుకు నిప్పు పెట్టారో ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబం ధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వైశ్య రాజకీయ రణభేరి గోడ పత్రిక ఆవిష్కరణ

### ముఖ్య అతిధిగా పాల్గొన్న డా. కాచం సత్యనారాయణ గుప్త

మేడ్చల్ మల్కాజిగిరి : ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ లో వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో వైశ్య రాజకీయ రణభేరి గోడ పత్రిక ఆవిష్కరణ చేపట్టిన కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక , వైశ్య రాజకీయ రణభేరి అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్త ముఖ్య అతిధిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైశ్య రాజకీయ రణభేరి అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ ఆగస్టు 3 న హైద్రాబాద్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే వైశ్య రాజకీయ రణభేరి మీటింగ్ కు పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా వైశ్యులు హాజరు అవ్వాలని కోరుతూ అలాగే వైశ్యుల హక్కుల కోసం, రాజ్యాధికారంలో వాటా కోసం , ఈడబ్ల్యుఎస్ వర్గీకరణ అంశాలతో పాటు వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించే దిశగా ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రతిఒక్కరు ఈ మీటింగ్ కు హాజరయ్యి విజయవంతం చేయాలనీ కోరారు. ఈ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో వాసవి మిత్ర మండలి అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్తా, కార్యనిర్వాన కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్తా, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్తా, అమర కృష్ణ గుప్తా,చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు ఉప్పల ఆంజనేయులుగుప్తా, మిర్యాల అరుణ్ కుమార్ గుప్తా, ఏనిశెట్టి రమేష్ గుప్తా, రాయి కంటి వేణు గుప్త, సభ్యులు రాయల శ్రవణ్ గుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్త, పెద్ధి నవీన్ గుప్త, నీలా శివకుమార్ గుప్త, కొకలా కృష్ణమూర్తి గుప్త, పొద్దుటూరి వెంకటేశ్వర్లు గుప్తా, రాజూరి జగదీష్ గుప్తా, కండే శివగుప్త చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా, అర్థం శ్రీనివాస్ గుప్తా, కోడూరి లక్ష్మణ్ గుప్త, విబివి కృష్ణ గుప్త, బుస్స శ్రీనివాస్ గుప్తా, రవ్వ ఈశ్వరరావు గుప్త, పసునూరి వెంకటేశం గుప్తా, దాచా ప్రసాద్ గుప్తా, గజ్జల రమేష్ గుప్తా, గుబ్బ రామచంద్ర గుప్తా, పొద్దుటూరి శ్రీధర్ గుప్తా, బెల్లీదే భగవాన్ గుప్తా, నిఖిల్ గుప్తా , మౌనిక తదితరులు పాల్గొన్నారు.




## గ్రామపంచాయతీ కార్యదర్శులకు తప్పని ఇబ్బందులు

**సిపిఎం మండల కార్యదర్శి చెల్పూరి రాము**



జమ్మికుంట: ప్రత్యేక అధికారుల పాలనలో ఇల్లందకుంట మండలంలోని గ్రామ కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదని స్వంతంగా ఖర్చు పెట్టుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించాల్సి వస్తుందని మండల సిపిఎం కార్యదర్శి చెల్పూరి రాము. అన్నారు. స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లా డుతూ గ్రామపంచాయతీలలో పారిశుద్ధ పనులకు బ్లీచింగ్ పౌడర్, ట్రాక్టర్ డీజిల్, వీధిలైట్లు వెలగకపోయినా కొత్త లైట్లు వేయిం చడం విద్యుత్ మోటార్లు కాలిపోతే మరమ్మతులు జరిపించాలంటే అందుకు అయ్యే ఖర్చు కార్యదర్శులే భరించాల్సి వస్తుందన్నారు. గ్రామాలలో ఏ సమస్య వచ్చిన పరిష్కారం బాధ్యత కార్యదర్శులకు అప్పగించడంతో నిధులు లేక సొంత ఖర్చులతో పనులు చేస్తూ అప్పుల పాలవుతున్నార న్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని కుక్కల బెడద తీవ్రంగా ఉందని అన్నారు. వివిధ గ్రామాలలో మనుషులపై కోతులు, కుక్కలు, దాడి చేయడంతో పాటు గొర్రెలు మేకలను చంపుతున్నాయని కుక్కల బెడద కోతుల బెడదను నివారించాలన్నారు. గ్రామ కార్యదర్శులకు రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్ లు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాకపోవ డంతో అప్పుల పాలయ్యారని వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెల్పూరి రాము, అన్నారు.

# ఏఐ హబ్ గా భారత్....



బెంగళూరు, : ఈ ప్రపంచంలో ఎక్కడైనా సరే ఉత్పత్తికి తగ్గట్టుగా డిమాండ్ ఉంటేనే ఉపాధి లభిస్తుంది. ఉత్పత్తి అధికంగా ఉండే డిమాండ్ తక్కువగా ఉంటే ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. అలాగే డిమాండ్ అధికంగా ఉండి ఉత్పత్తి తక్కువగా ఉంటే అప్పుడు కూడా ఉపాధి అవకాశాలు ప్రభావితమవుతాయి.. అందువల్లే ఉత్పత్తికి, డిమాండుకు వ్యత్యాసం ఉండకూడదని.. ఇవి రెండు సమాంతరంగా సాగిపోవాలని ఆర్థిక నిపుణులు చెబుతుంటారు. దీనినే ఆర్థిక శాస్త్ర పరిభాషలో క్షీణోపాంత సూత్రం అని పిలుస్తుంటారు. నేటి కాలంలో ఈ సిద్ధాంతాన్ని అనేక దేశాలు పాటిస్తుంటాయి.. కాకపోతే గడిచిన కొంతకాలంగా అన్ని దేశాలు అడ్డగోలు విధానాలను పాటిస్తున్న నేపథ్యంలో డిమాండ్ సప్లై అనే సిద్ధాంతం తడబాటుకు గురవుతోంది. అందువల్లే అన్ని దేశాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి.ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధ వెంట పరుగులు తీస్తోంది. ఓపెన్ ఏఐ అనే కంపెనీ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అధిక్రమ క్రమంగా అన్ని రంగాలలో విస్తరించడం మొదలు పెట్టింది. ప్రస్తుతం ఓపెన్ ఏఐ, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, ట్విట్టర్ వంటి టాప్ ఐటి కంపెనీలు కృత్రిమ మేధ లో సరికొత్త ప్రయోగాలు చేస్తున్నాయి. ఇవి ఎన్ని రకాలుగా ప్రయోగాలు చేసినప్పటికీ వినియోగం అనేది అంతిమంగా ఉండాలి. వినియోగం అనేది సరైన స్థాయిలో లేనప్పుడు కంపెనీలు తయారు చేసిన సాంకేతిక పరిజ్ఞానానికి అర్థం లేదు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించకపోతే మనుషులు వెనుకబడిపోతారు. ఈ విషయాన్ని గుర్తించి కేంద్రం సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేసింది. బహుశా ప్రపంచంలో ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించలేదు. కృత్రిమ మేధ వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో.. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా 10 లక్షల మంది సిటిజన్లకు కృత్రిమ మేధ ఎలా వాడాలో ఉచితంగా శిక్షణ ఇవ్వనుంది. ఇదే విషయాన్ని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.. ఈ ప్రకారం వచ్చే కొద్ది రోజుల్లో కృత్రిమ మేధ మార్కెట్లో భారత్ మొదటి స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉంది.కృత్రిమ మేధ లో భారతదేశానికి చెందిన కంపెనీలు కూడా పనిచేస్తున్నాయి.. దిగ్గజ సంస్థలు చేయలేని అద్భుతాలను చేసి చూపిస్తున్నాయి.. ఇప్పటికే వాట్సాప్ లో మన దేశం లో భాషలను మొత్తం అనుసంధానం చేసే విధంగా పుచ్ ఏఐని అర్జిత్ జైన్ అనే వ్యక్తి ప్రవేశపెట్టాడు.. అరవింద్ శ్రీనివాస్ అనే వ్యక్తి ప్రీ ఫ్లెక్సిటీ అనే ఏఐ టెక్నాలజీని రూపొందించాడు. ఇవన్నీ కూడా దిగ్గజ సంస్థల టెక్నాలజీని మించిపోయాయి. ఒక రకంగా ఐ, గూగుల్ ప్లే స్టోర్ లో టాప్ స్థానంలో ఉన్నాయి. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మీద ఇప్పుడే ప్రారంభ ప్రయోగాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఇందులో భారత ఐటీ నిపుణులు అత్యంత కీలకంగా పనిచేస్తున్నారు. టాప్ కంపెనీలలో పనిచేస్తున్న నిపుణులు మొత్తం భారతదేశానికి చెందినవారే. వారంతా వేలకోట్ల ప్యాకేజీ ఆదుకుంటున్నారు.. అయితే త్వరలో భారత నిపుణులు కంపెనీలు ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఈ కంపెనీలు గనుక ఏర్పాటు అయితే.. కృత్రిమ మేధ లో సమూల మార్పులు వచ్చే అవకాశం ఉంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద వినియోగదారుల మార్కెట్ గా ఉంది కాబట్టి .. కృత్రిమ మేధకు జనాలను అలవాటు చేయిస్తే.. ఆ కంపెనీలకు తిరుగు ఉండదు.ఉదాహరణకు డిజిటల్ చెల్లింపులను తీసుకుంటే.. ప్రపంచంలో అత్యధికంగా యూపీఐ పేమెంట్లు చేస్తున్న దేశంగా భారత్ నిలిచింది.. జూన్ నెలలో 24.3 లక్షల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. దీన్ని బట్టి భారత్ డిజిటల్ చెల్లింపుల్లో ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇక్కడ జనానికి కృత్రిమ మేధను వాడే అలవాటు చేయిస్తే భారత్ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుంది. దాంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి . దానికి అనుబంధంగా మరిన్ని కంపెనీలు వస్తాయి. అప్పుడు దేశ జిడిపి పెరుగుతుంది.. ఇతర వ్యాపారాలు కూడా ముమ్మరం అవుతాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని కేంద్ర మందిని అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# మెరుగైన వైద్యం కోసమే పల్లె దవాఖానాల ఏర్పాటు

## పల్లె దవాఖాన ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్



జయశంకర్ భూపాలపల్లి: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పల్లెలల్లో దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. నాడు భూపాలపల్లి నియోజకవర్గం లోని రేగొండ మండల కేంద్రంలో ఎన్ హెచ్ ఎం నిధులు రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖాన(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలు పల్లె దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ పనిచేసే డాక్టర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలను పొందాలని అన్నారు. నియోజకవర్గంలోని పల్లెలల్లో మరిన్ని దవాఖానాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..: గాంధీయ మార్గాన్ని ఆచరిస్తూ, నిరాడంబరతో పయనిస్తూ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కొరకు అనునిత్యం శ్రమిస్తున్న మాజీ పార్లమెంట్ సభ్యురాలు, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ మాజీ అధ్యక్షురాలు, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ జన్మదినం సందర్భంగా ఈరోజు రేగొండలో మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బర్త్ డే వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేకు కోసి, వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతీయ నాయకురాలుగా ఉన్న మీనాక్షి నటరాజన్ హంగూ ఆర్భాటాలకు దూరంగా ఉంటూ, సింప్లిసిటీగా ఉంటుందన్నారు. ఆమె సాధారణ రీతిలో పార్టీ కార్యక్రమాలకు హాజరవ్వడం జరుగుతుందని, అటు ఢిల్లీకి వెళ్ళినా, ఇటు హైదరాబాద్ కు వచ్చినా ఫ్లైట్ లో కాకుండా రైలులో ప్రయాణం చేస్తుందని అన్నారు. 2029 లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే ఏకైక లక్ష్యంగా మీనాక్షి నటరాజన్ అహర్నిశలు పనిచేస్తుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. వారికి ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఎమ్మెల్యే వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

# నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ






జయశంకర్ భూపాలపల్లి, : పంటలకు నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. నానో యూరియా వినియోగం, ఎరువులు సక్రమ సరఫరాపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ, సహకార సంఘాల సీఈఓలు, ఇన్పుట్ డీలర్లు తో ఐడిఓసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రైతుల భద్రత, శాస్త్రీయ పద్ధతుల్లో సాగుకు ప్రోత్సాహం కల్పించే క్రమంలో నానో యూరియా వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో పాటు సహకార సంఘాల సీఈఓలను ఆదేశించారు. నానో యూరియా వాడకం వల్ల మొక్కల పెరుగుదల బాగా ఉంటుందని, కావాల్సిన పోషకాలు అందడంతో పాటు శక్తి పర్యావరణహితమైనదని తెలిపారు. రైతులు దానివల్ల వ్యయాన్ని తగ్గించుకొని అధిక దిగుబడి సాధించగలరని వివరించారు. ప్రతి మండలంలో వ్యవసాయ అధికారులు, ఉద్యాన, సహకార సంఘాల సీఈవోలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫీల్డ్ డెమో, గ్రామ సభల ద్వారా నానో యూరియా ప్రయోజనాలు రైతులకు తెలియజేయాలని సూచించారు. పురాతన విధానాలను మరిచి శాస్త్రీయ పద్ధతులను అవలంబించడమే రైతులకు మేలు చేస్తుందని, అందుకే ప్రతి రైతుకు ఈ సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డీలర్లు ప్రతి రోజు ఎరువులు నిల్వలు స్టాకు బోర్డులో వ్రాయాలని తెలిపారు. యూరియా వ్యవసాయానికి కాకుండా ఇతర పనులకు మళ్లీస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. రైతులను. ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువులకు ఎలాంటి కొరత లేదని సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని రైతులు అపోహపడొద్దని తెలిపారు. యూరియాను వ్యవసాయ పనులకు కాకుండా ఇతర పనులకు వినియోగించినా, కృత్రిమ కొరత సృష్టించినా, నిల్వలలో తేడా వచ్చినా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులపై రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 8977741771 లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నంబర్ 7893098307 నంబరు కు కాల్ చేసి రైతులు సమాచారం ఇవ్వాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లా, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీములు నిరంతరం ఎరువులు, విత్తన దుకాణాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో 371 ప్రయివేటు డీలర్ దుకాణాలు, 10 సహకార సంఘాల ఎరువుల దుకాణాలు ఉన్నాయని సహకార, వ్యవసాయ అధికారులు తనిఖీలు చేస్తూ ప్రతి రోజు స్టాకు నిల్వలు ఈ పాస్ లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 3120 ఎకరాల్లో వరి, 90 వేలకుపైగా ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, ఆయా పంటలకు ఆగస్టు మాసం వరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరుల దుకాణం యజమానులు దుకాణం ముందు తప్పనిసరిగా ఎరువుల నిల్వలపై బోర్డులను ఏర్పాటు చేయాలని ,అందరికీ తెలిసే విధంగా ఎరువుల వివరాలు ప్రదర్శించాలని, ఏరోజుకారోజు ఎరువుల స్టాక్ వివరాలను అబోర్డుపై నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా ఎరువుల విషయంలో అక్రమాలకు పాటుపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఏఎస్పీ నవీన్ కుమార్, వ్యవసాయ అధికారి బాబు, సహకార అధికారి వాలియా నాయక్, మహదేవ పూర్ వ్యవసాయ శాఖ ఏడి శ్రీవ్యాల్, కోరమండల్ జీఎం సర్జన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# వరంగల్ లో 24 ఫ్లోర్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

వరంగల్, : వరంగల్‌లో సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తోంది. వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో రూ. 1,150 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి 2026 డిసెంబర్ నాటికి అందుబాటులోకి రానుంది. ఇందులో 2 వేల పడకలు ఉంటాయి. బోన్ మ్యారో నుంచి ప్లాస్టిక్ సర్జరీ వరకు అన్ని సేవలు ఉచితంగా లభించనున్నాయి. ఒకప్పుడు గవర్నమెంట్ హాస్పిటల్ అంటే.. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అన్నట్లుండేవి పరిస్థితులు. అయతే ప్రభుత్వాల చొరవ వల్ల ఈ పరిస్థితి మారుతోంది. నేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి. కొన్ని చోట్ల అధికారులు, వైద్యుల కృషి వల్ల ప్రైవేటు ఆస్పత్రిలో కన్నా మంచి సేవలు, సదుపాయాలు కలిగి ఉంటున్నాయి. ఈ క్రమంలో సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్యుల కోసం ఏకంగా 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురాబోతుంది. తెలంగాణ ప్రభుత్వం సామాన్యులకు మెరుగైన వైద్యం అందించడం కోసం.. 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న ఈ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని వచ్చే సంవత్సరం అనగా 2026, డిసెంబర్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. వచ్చే డిసెంబరు నెలాఖరులోపు ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం వరంగల్ కలెక్టర్ ఎంజీఎం ఆసుపత్రిలోని వివిధ వైద్య విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు.అనేక అంశాలపైచర్చించారుకొత్తగా నిర్మిస్తున్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలోని 24 అంతస్తులను.. వైద్య విభాగాల వారీగా కేటాయించారు. వేర్వేరు అంతస్తుల్లో.. వేర్వేరు వైద్య విభాగాలకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ఏమేం కావాలో నివేదిక తయారు చేసి.. జులై నెలాఖరులోగా అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.అంతస్తుల వారిగా కేటాయింపులు ఇలా..

ముందుగా గ్రౌండ్ ఫ్లోర్ కింద బేస్‌మెంట్ ప్రాంతంలో మెడికల్ ఆంకాలజీ అనగా క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లో అత్యవసర విభాగం, వృద్ధుల ఓపీ సేవలు, ఐసీయూ, ఫార్మసీ, సీటీ స్కాన్, న్యూబర్న్, లేబర్, మెడికల్ ఐసీయూ, ఆర్ఐసీయూ, ట్రామా ఐసీయూ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్, మామోగ్రఫీ, జనరల్ సర్జరీ, కలర్ డాప్లర్,ఆర్థోపెడిక్ విభాగాలు రానున్నాయి.


1వ అంతస్తులో: ఈఎన్‌టీ, రుమటాలజీ, ఓపీ సేవలు, డెర్మటాలజీ, న్యూరోసర్జరీ, జనరల్ మెడిసిన్, ఎండోస్కోపి, జనరల్ సర్జరీ, ఎక్స్‌రే, డీఎస్‌ఏ, డెమో రూంలకు కేటాయించారు. 2వ అంతస్తులో: పిల్లల ఈఎస్ఆర్ అత్యవసర విభాగం, ఐసీయూ వార్డులు, నియోనాటల్ కేర్ యూనిట్‌కు కేటాయించారు. 3వ: ఐవీఎఫ్(సంతాన సాఫల్య కేంద్రం) వార్డు, ఆర్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు (సుమారు 10 వరకు). 4వ: ఈఎన్‌టీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు. 5వ: డెంటల్ వార్డులు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్(బీఎంటీ) యూనిట్, జనరల్ సర్జికల్ డెమో, జనరల్ మెడిసిన్‌కు కేటాయించారు. 6వ: ఆర్థోపెడిక్, ఎమర్జెన్సీ వార్డు. 7వ: ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సేవలు. 8వ: ఒబెసిటీ, గైనాకలజీ, ఈఎన్‌టీ, పీడియాట్రిక్ వార్డు, 9వ: మెడికల్ ఆంకాలజీ, శ్వాసకోశ వ్యాధులు, సర్జికల్ వార్డు. 10వ: ప్లాస్టిక్ సర్జరీ, డెర్మటాలజీ. 11వ: ఎండోక్రైనాలజీ, వృద్ధులు, రోగనిరోధక వ్యవస్థను కోల్పోయిన వారికి, మానసిక, డ్రగ్స్ అలవాటు బారినపడిన వారి చికిత్స వార్డులు. 12వ: సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మానసిక రోగులు, మెడికల్ వార్డు ఏర్పాటు చేయనున్నారు. 13, 14వ అంతస్తుల్లో: సెమీ, వీఐపీ ప్రైవేటు గదులు. 15వ: బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయనున్నారు.మిగిలిన 9 అంతస్తుల్లో ఆయా వైద్య విభాగాల ఫ్యాకల్టీకి కేటాయించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ నెలాఖరు వరకు.. ఎంజీఎంలోని అన్ని వైద్య విభాగాల ప్రొఫెసర్లుఅందించే నివేదిక ఆధారంగా మార్పులుచేర్పులు చేయిస్తామని ఈ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నోడల్ అధికారి తెలిపారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే.. బోన్ మ్యారో నుంచి ప్లాస్టిక్ సర్జరీ వరకు అన్ని సేవలు ఒకే చోట.. అది కూడా ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

అంతా ఓకే, అడ్రస్సే తేడా కొట్టింది.. ప్రియుడితో కలిసి అడ్డంగా దొరికేసిన మహిళ..వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో రూ. 1,150 కోట్ల వ్యయంతో నిర్మాణం మొదలుపెట్టిన ఈ ఆస్పత్రి నిర్మాణం దాదాపు పూర్తయింది. దీనిలో 2 వేల పడకలు అందుబాటులోకి రానున్నాయి. 2021 జూన్ 21న అప్పటి సీఎం కేసీఆర్ ఈ భవనానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఇది ప్రజలకు వైద్య సేవలు అందించనుంది.

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...

# అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

## -నేడు ఆయన వర్ధంతి



( పెండ్యాల రామ్ కుమార్,మంథని ) మానవ జాతి వికాసానికి సృష్టి అందించిన వరప్రసాదమే సర్ ఆర్థ్ కాటన్. మద్రాసు రాష్ట్రంలో వారు అమలు చేసిన నీటి పారుదల పనులు అద్వితీయమైన విజయాలు సాధించాయి. సర్ ఆర్థర్ కాటన్ దూరదృష్టి, సునిశిత మేధాశక్తి అమోఘం, అద్వితీయం. దక్షిణ భారతావనిలో ఎన్నో నీటి పారుదల రూపకల్పన చేసిన అన్న దాత.. సర్ ఆర్థర్ కాటన్ ను ప్రభుత్వం సముచితంగా అనేక బిరుదులతో సన్మానించింది. 1803 మే 15వ తేది కాటన్ జన్మించారు. కుటుంబంలో అందరికంటే తల్లి వ్యక్తిత్వ ప్రభావం ఆయనపై పడింది. కాటన్ చిన్నతనం నుంచి మనో వికాసానికి సాహసానికి, ధైర్యానికి, దీక్షకు మారుపేరు. తల్లి ఇచ్చిన శిక్షణ కాటన్ కి ఎంతో ఉపక రించింది. 15 ఏళ్ళ ప్రాయంలో ఇండియాకు వెళ్ళడానికి స్కాలర్ షిప్ పొందారు. 1819 లో ఆర్థర్ కాటన్ జాగ్రత్తగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మెలిగి అది స్కాంబి లో చక్కగా విద్యనభ్యసించి ఏ పరీక్షకు హాజరు కాకుండానే రాయల్ ఇంజనీర్ సర్టిఫికేట్ ఆధారంగా ఉద్యోగం సంపాదించారు. 1821 లో 18 సంవత్సరాల ప్రాయంలో ఇండియాలో ఉద్యోగంలో నియమింపబడ్డారు. 1822 సంవత్సరం లో అనేక జిల్లాల్లోని చెరువు మరమత్తు పనులను పర్యవేక్షించే పనిని అప్పగించారు. 1824 సంవత్సరం వరకు ఈవిధంగా పనిచేసి మద్రాసు దక్షిణాన కొన్ని మైళ్ళ దూరంతో వున్న మిలిటరీ స్థావరమైన థామస్ మౌంట్ దగ్గర భవనాలు నిర్మించడానికి నియమించబడిరి. ఎనిమిదేళ్ళ సర్వీసు అయిన తర్వాత కెప్టెన్ ర్యాంక్ కు ఎదగారు. ఆయల కృషి వల్ల తంజావూరు జిల్లాలోని అనే నిర్మాణపు పనులు పూర్తి అయి రాష్టంతో సంపన్న జిల్లా గా మారింది. 1828 - 29 సంవత్సరాలలో అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశారు. తరువాత అనారోగ్య కారణాలవల్ల ఇంగ్లాండు తిరిగి వెళ్ళనలసి వచ్చింది. 1832 లో తిరిగి ఉద్యోగంలో ప్రవేశించారు. శక్తికి మించిన శ్రమ చేయడం వల్ల తరచు అనారోగ్యానికి గురయ్యేవారు. ఈసారి ఆస్ట్రేలియాకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వుండగా ఒక ధనవంతుని కుమార్తె ఎలిజబెత్ ని ప్రేమించి వివాహమాడారి. 1841 సంవత్సరం లో అక్టోబరు 10వ తేదీన వీరి వివాహం జరిగింది. తరువాత తిరిగి టాస్మోనియా వెళ్ళారు. ఆ సమయంలో రాజమండ్రి జిల్లా పరిస్తితి అద్వాహ్నంగా ఉండేది. గోదావరి తో పారే నీటిని వినియోగించి ఆ భూములను సస్యశ్యామలం చేయటం జరిగింది. అప్పటినుంచీ రాజమండ్రి జిల్లా గోదావరి జిల్లా గా పేరు గాంచింది. గోదావరి నదిపై 12 లక్షల ఎకరాల సాగుకు ఉపయోగపడే ఒక ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట నిర్మాణం ద్వారా ఆయన కన్న కలలు నిజమయ్యాయి. కాల్వలు తరువాత కాల్వలు, పిల్లకాత్వతు, పంట కాల్వలు త్రవ్వడం జరిగింది. 1841 నుండి 45 ఏండ్లు నీటి పారుదల పథకాల అమలుకై ఆయన నిర్విరామ కృషి చేశారు. 1881లో ప్రచురించిన %--%వీలున్నచోట నీటి పారుదలకు కాల్వలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, బావి నీరు, ఇతర విధానాల ద్వారా లభించే నీటి కన్నా భూమిని సారవంతం చేసే ఎరువు గల్గిన నీటుని పొలాలలకు కాల్వల దారా పారించవచ్చును. %--%ఒక చోటినుండి ఇంకొక చోటికి ఉత్పత్తులను కారు చౌక ఎగుమతి చేయడానికి నీటి కంటే మరొక ఉత్తమ సాధనం లేదు. ఆ కారణంగా నీటి పారుదల కాల్వలను స్టీమ్ బోట్ లు తిరగడానికి వాలుగా నౌకాయాన సౌకర్యాలు కల్పించారు. ధవళేశ్వరం ఆలకట్ట నిర్మాణంలో సర్ ఆర్థర్ కాటన్ చూపిన ప్రతి భాపాటవాలు నేటికి మరువలేనివి. ఈ బ్యారేజి నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 13,75,000 టన్నులు, ధాన్యము, 16,38,000 చెరుకు, 34,000 టన్నుల పప్పు ధాన్యము, చిరుధాన్యాలు ఉత్పత్తి ఆవుతున్నాయి. ఈ వ్యారేజి నిడిని 3.6. కి.మీ. దేశంతో కెల్ల అతి పెద్దదైల ధవళేశ్వరం బ్యారేజి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజిగా పిలువ బడుతున్నది. ఇండియాలో పబ్లిక్ వర్బ్ అనే పుస్తకాన్ని కూడా ఆయన రాసారు. మానవ జాతి మహెూదయానికి ఇంజనీరుగా రచయితగా ఆలోచలా పరులుగా శ్రీ కాటన్ చేసిన కృషి చిరస్మరణీయమైంది. ఆయన పేదరిక నిర్మూలనకు కరువు నివారణకు అనేక నీటి పథకాలు అమలు చేసి చరిత్ర ప్రసిద్ధుడైయాడు. ఎన్ని పనులు చేసినా ఆయన సామాన్యుడే. ధర్మాన్ని నిర్వర్తించాడు. అభివృద్ధే ఆయన ఆదర్శం. అందుకే ఆయనను అన్నదాతగా పిలిచేవారు. ప్రజల హృదయాలలో శాశ్విత స్థానాన్ని ఏర్పరచుకొని 1899 జులై 24వ తేది పరమపదించారు.

## కోట రాజబాబును సన్మానించిన మంథని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు



మంథని ప్రతినిధి, : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కోట రాజబాబు కు కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా నాయకుడు గోటికార్ కిషన్ జీ శుభాకాంక్షలు తెలిపారు. మహాదేవపూర్ లోని ఆయన నివాసంలో మంథని కాంగ్రెస్ బీసీ సెల్ నాయకులు గోటికార్ కిషన్ జీ,స్వర్ణకార సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వంగల తిరుమలేష్, నాయకుడు భీముని లింగయ్య లు మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అంధించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్ జీ మాట్లాడుతూ ఒక బీసీ నాయకుడు ప్రజల ఆదరణ పొంది మహాదేవపూర్ సర్పంచ్ గా, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా ప్రజలకు సేవలు అందించిన గొప్ప నాయకుడు కోట రాజబాబు అన్నారు. మహదేవ్పూర్ మండల కేంద్రం నుండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న రాజబాబు సేవలను గుర్తించిన మంత్రి శ్రీధర్ బాబు ఆయనకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. రాబోయే కాలంలో రాజబాబు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నామన్నారు. రాజబాబుకు ఈ పదవిని అప్పగించిన రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

# ఆ ఇద్దరే.. నేతలంతా సైలెంట్..



హైదరాబాద్, : తెలంగాణలో అపోజిషన్ బీఆర్ఎస్..అధికార కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అంటోంది. పార్టీ మీద, అతినేత మీద వస్తున్న విమర్శలు, ఆరోపణలను ఎదుర్కోవడంలో అయినా..ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రశ్నించడంలో అయినా..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు ముందుంటున్నారు. అయితే పదేళ్లు పవర్‌లో ఉన్నప్పుడు అధికారం అనుభవించిన చాలా మంది బీఆర్ఎస్ ముఖ్య నేతలెవరు తమంతట తాముగా ఏ కార్యక్రమం చేయడం లేదట.పార్టీ నేతలకు, క్యాడర్‌కు ఏ ఇబ్బందులు వచ్చినా, అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి వేధింపులు ఎదురైనా కేటీఆర్, హరీశ్‌రావు తప్ప మిగతా ముఖ్య నేతలు పెద్దగా స్పందించడం లేదట. తమ తమ జిల్లాల్లో జరుగుతున్న సంఘటనలపై కూడా పైనుంచి ఆదేశాలు వచ్చే వరకు మనకెందుకులే అన్న ధోరణితో ఉంటున్నారట బీఆర్ఎస్ కీలక లీడర్లు.మల్కాజ్‌గిరిలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వివాదం చెలరేగింది. బోనాల పండగ చెక్కుల పంపిణీలో ప్రోటోకాల్ రగడ కాస్త ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌పై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడి చేశారని అంటున్నారు. తమ పార్టీ నేతపై దాడి జరిగిందన్న విషయం తెలుకున్న వెంటనే ఖమ్మం పర్యటనలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా మల్కాజ్‌గిరిలోని కార్పొరేటల్ సునీత ఇంటికి వెళ్లి ఆమె భర్త రాము యాదవ్‌ను పరామర్శించారు.పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అయితే తమ పార్టీ నేతపై కాంగ్రెస్ లీడర్లు దాడి చేశారన్న విషయం తెలిసినా హైదరాబాద్‌లోని పార్టీ ముఖ్యనేతలు మందు సైలెంల్‌గా ఉండిపోయారట. కనీసం ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదట. కానీ కేటీఆర్ వెళ్లి వాళ్లను పరామర్శించి వచ్చాక అప్పుడు హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు మేల్కొన్నారట. అది కూడా కేటీఆర్ చెబితే కానీ హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు కదలలేదని తెలుస్తోంది. మన పార్టీ నేతలపై దాడి జరిగితే ఎందుకు స్పందించలేదని కేటీఆర్ వారిని ప్రశ్నించినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్.అందులోనూ బీసీ వర్గం నేతపై దాడి జరిగితే కనీసం పార్టీలోని ఆ సామాజికవర్గం నేతలు కూడా స్పందించరా అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేటీఆర్ చెప్పిన తర్వాత మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్ తదితరులు అప్పుడు మల్కాజ్‌గిరికి వెళ్లి దాడిలో గాయపడ్డ కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌ను పరామర్శించారని తెలుస్తోంది. ఇదే పని ముందు చేసి ఉంటే బాగుండేదన్న చర్చ పార్టీలో జరుగుతోంది.ఈ ఒక్క ఇష్యూలోనే కాదు చాలా అంశాల్లో, చాలా సందర్భాల్లో కేటీఆర్, హరీశ్‌రావులు మినహా మిగతా ముఖ్యనేతలంతా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న చర్చ బీఆర్ఎస్ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై వేధింపులు ఎక్కువయ్యాయని వాపోతోంది క్యాడర్. పార్టీ నేతలపై దాడులు, అక్రమ కేసులు పెట్టినా మిగతా నేతలు పెద్దగా స్పందించడం లేదని అంటున్నారు. అప్పుడు కూడా కేటీఆర్ లేదంటే హరీశ్‌రావులు చెబితే తప్ప ముఖ్య నేతలెవ్వరు రెస్పాండ్ కావడం లేదని చెబుతున్నారు.ఇలా ప్రతిసారి పైనుంచి ఆదేశాలు వస్తేనో.. అధిష్టానం చెబితేనో తప్ప మిగతా సందర్భాల్లో తమకెందుకులే అని పట్టీపట్టనట్లు ఉంటున్నారట బీఆర్ఎస్ నేతలు. అధికార కాంగ్రెస్, బీజేపీ నుంచి పార్టీ అధినేత కేసీఆర్ లేదంటే మిగతా వారిపై విమర్శలు, ఆరోపణలు చేసిన సందర్భాల్లోను పైనుంచి చెబితే ముఖ్యనేతలు రియాక్ట్ కావడం లేదని లేదని తెలుస్తోంది. ఇలా అన్నీ కేటీఆర్, హరీశ్‌రావులే చూసుకోవాలంటే కష్టమేనని, అన్నింటికీ వాళ్లే స్పందించాలంటే అయ్యే పని కాదని పార్టీ ముఖ్య నేతల్లో మార్పు రావాలన్న టాక్ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

# మంథనిలో రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం

### -సహకరించిన విద్యాసంస్థలకు ధన్యవాదాలు తెలిపిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్ కుమార్






మంథని ప్రతినిధి, : రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్ని వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బందులో భాగంగా మంథని మండల కేంద్రంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఎస్ఎఫ్ఐ మంథని మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ చేయించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ లు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్నటువంటి ఎంఈఓ, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు పక్కాబావనాల నిర్మించాలని, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, విద్యార్థ లకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్నటువంటి లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని అలాగే విద్యార్థులకు ఉచిత బస్ పాసులు అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యావిధానం 2020 విధానాన్నిఅమలు చేయకుండా చూడాలనే డిమాండ్లతోనేడు ఈ బంద్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ బంద్ కు సహకరించిన ప్రైవేటు మరియు ప్రభుత్వ విద్యాసంస్థల ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రజినీకాంత్, గణేష్, రోహిత్,ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి విద్యాసంస్థల బందు విజయవంతం..



### హాస్టల్ విద్యార్థులకు మేస్ చార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి..
### ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు డిమాండ్..

జమ్మికుంట, : ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణ కేంద్రంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించడం జరిగింది. అనంతరం ఏఐఎన్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్ధనూరి విష్ణ మాట్లాడుతూ..రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్, జూనియర్ కాలేజీలలో నెలకొన్న సమస్యలతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు చేసే ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న పిలుపునిచ్చిన విద్యాసంస్థల బందు విజయవంతం అయిందని అన్నారు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.బకాయి ఉన్న 8 వేలకోట్ల విద్యార్థుల స్కాలర్ షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయి కావున హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు మరియు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలో మౌలిక సదుపాయాలను కల్పించి, ఆర్టీసీ లో విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎండీ అజీమ్,ఆర్ అవినాష్, జె శశి, ఇ.గణేష్, పి.వికాస్ తదితరులు పాల్గొన్నారు

# బంద్ విజయవంతం

## వామపక్ష విద్యార్థి సంఘాలు..

నర్సంపేట జులై 23 (ప్రకాక్రాంతి) తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన బందు విజయవంతం అయింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దిడ్డి పార్థసారథి పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు గుర్రం అజయ్ పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు నరేష్ మాట్లాడుతూ,గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు,ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకోడం కారణంగా అధికారాన్ని కోల్పోయిందని.,కేసిఆర్ ను గద్దె దించే పోరాటల్లో వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయన్నారు.గత ప్రభుత్వం చేసిన తప్పిదలు మేము చేయమని, పేద విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తామని,విద్య రంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని, నిరుద్యోగ సమస్య తీరుస్తామని, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనా అందిస్తామని, అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ రెండు సంవత్సరలు కావొస్తున్న ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలను విడుదల చేయకపొగ,విద్య రంగం ఎదురకొంటున్న సమస్యలపై సమీక్షా నిర్వహించకుండా, విద్య శాఖ మంత్రిని నియమించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ ప్రవేట్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ,విచ్చలవిడిగా ప్రవేట్ యూనివర్సిటీలకు అనుమతులిస్తూ,పేద మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్రకు తెరలేపుతూన్నారన్నారు.ప్రజా పాలనా అని మాటల్లో చెపుతూ,ఆచరణలో అప్రజాస్వామ్య పాలనా కొనసాగుతుందన్నారు.ఇచ్చిన ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి ప్రశ్నించే వారిపైన అక్రమ కేసులు పెడుతున్నారన్నారు.ఒకవైపు ధనిక రాష్ట్రం అంటూనే మరో వైపు ఖజానా ఖాళీగా ఉందని నిస్సిగ్గుగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి చేతగాని తనానికి నిదర్శనమన్నారు.ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని ఇచ్చిన హామీలను అమలు చేస్తూ,ఎలాంటి పెండింగ్ బకాయిలు పెట్టకుండా,విద్య రంగంలో ఉన్నా అన్ని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ,ఫీజు నియంత్రనా చట్టం తీసుకోస్తు, విద్యార్థులందరికి ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.జాతీయ నూతన విద్య విధానాన్ని రద్దు చేస్తూ, అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు.ఈ కార్యక్రమలోఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి పైస గణేష్,ఏఐఎస్ ఎఫ్ జిల్లా నాయకులు పాలక పవన్ వరుణ్,బానోత్ స్టాలిన్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కిరణ్,క్రాంతి,ప్రవళిక,కళ్యాణి, శ్వేత,రజిని,నాగేంద్ర,గౌతమ్, నాగరాజు పాల్గొన్నారు.




# సబ్బితం జలపాతం అభివృద్ధికి 6 కోట్లు మంజూరు

### – ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,:మండలంలోని సబ్బితం గట్టు సింగారం గ్రామంలోని జలపాతం అభివృద్ధికి పర్యాటక శాఖ రూ. 6 కోట్లు మంజూరు చేసిందని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత సబ్బితం జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి పరచడానికి జలపాతాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ క్రమంలో సబ్బితం జలపాతం వద్ద పర్యాటకులు పడుతున్న ఇక్కట్లను తీర్చడానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయమని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ?6 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు.గతంలో ఎంతో మంది ఎందరో ప్రజా ప్రతినిధులు సబ్బితం జలపాతాన్ని సందర్శించి దానిని అభివృధి చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి పబ్బం గడిపారని, కానీ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. జలపాత అభివృద్ధి కోసం 6 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిధులు మంజూరుకు సహకరించిన జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబులకు పెద్దపల్లి శాసనస భ్యులు చింతకుంట విజయరమణ రావు కృతజ్ఞతలు తెలిపారు.

# వడగాల్పులతో ఏడాదిన్నర పాటు పాఠశాలలకు దూరమౌతున్న విద్యార్థులు : నివేదిక



న్యూఢిల్లీ : పర్యావరణ మార్పులతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. వీటికి తోడు వడగాల్పులు జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అయితే ఈ వాతావరణ మార్పులు విద్యపై కూడా ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నాయని అంతర్జాతీయ నివేదిక వెల్లడించింది. వడగాల్పులకు చిన్నారులు త్వరగా అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు ఏడాదిన్నరపాటు పాఠశాల విద్యను కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపింది. ఇది దశాబ్దాల పాటు విద్యారంగంలో సాధించిన అభివృద్ధిని నాశనం చేసే అవకాశం ఉందని హెచ్చరించింది. పర్యావరణ మార్పులతో వడగాల్పులు, కార్చిచ్చులు, తుఫానులు, వరదలు, కరువులు, వ్యాధులు మరియు సముద్ర మట్టాలు పెరగడం వంటి ప్రకృతి విపత్తులు తీవ్రమవుతున్నాయి. ఈ విపత్తులతో మధ్య -ఆదాయ దేశాలు ప్రతి ఏడాది పాఠశాలలను మూసివేస్తున్నాయని, దీంతో విద్యార్థుల్లో అభ్యాసం క్షీణించడం, డ్రాపవుట్స్ పెరగవచ్చని సూచించింది. "మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేటింగ్ క్లైమేట్ కమ్యూనికేషన్ అండ్ ఎడ్యుకేషన్ (ఎంఇసిసిఇ)" కింద యునెస్కోకి చెందిన అంతర్జాతీయ విద్య పర్యవేక్షణ (జిఇఎం) బృందం, కెనడాలోని సస్కెట్చేవాన్ యూనివర్శిటీలు ఈ నివేదికను రూపొందించాయి. గత 20 ఏళ్లలో సుమారు 75శాతం తీవ్ర వాతావరణ పరిస్థితులతో పాఠశాలలు మూసివేయబడ్డాయని, ఇవి ఐదు మిలియన్లు లేదా అంతకంటే ఎక్కువ మందిని ప్రభావితం చేశాయని తెలిపాయి.

ముఖ్యంగా ఉష్ణోగ్రతలు చిన్నారుల విద్యా ఫలితాలపై గణనీయమైన హానికారక ప్రభావాలను చూపుతున్నాయని పేర్కొంది. 1969-2012 మధ్య 29 దేశాలకు చెందిన జనగణన మరియు వాతావరణ సమాచారాన్ని విశ్లేషించగా.. ముఖ్యంగా ఆగేయాసియాలో, గర్భధారణ పూర్వ మరియు ప్రారంభ జీవిత కాలంలో సగటు కంటే అధిక ఉష్ణోగ్రతలకు గురికావడంతో తక్కువ సంవత్సరాల పాఠశాల విద్య పొందినట్లు స్పష్టమైంది. సగటు కంటే రెండు డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతను ఎదుర్కొంటున్న పిల్లవాడు మిగిలిన పిల్లల కంటే 1.5 సంవత్సరాలు తక్కువ పాఠశాల విద్యను పొందుతాడని అంచనా వేయబడింది. అమెరికా వంటి దేశాల్లో ఏసిలు లేకపోవడంతో.. పాఠశాల సంవత్సరంలో 1డిగ్రీ సెంటిగ్రేడ్ వేడిగా ఉండటం వలన పరీక్షల్లో స్కోరులు ఒక్కశాతం తగ్గాయి. అధిక వేడిగా ఉన్న పాఠశాల రోజులు ఆఫ్రికా, అమెరికాల్లోని విద్యార్థులపై అసమానంగా ప్రభావం చూపాయని తెలిపింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలను నవీకరించాల్సిన అవసరం ఉందని నివేదిక స్పష్టం చేసింది. ఈ ప్రభావం అట్టడుగు వర్గాలపై గణనీయంగా ఉందని పేర్కొంది. 2019లో తీవ్ర వాతావరణ మార్పులకు అధికంగా ప్రభావితమైన 10 దేశాల్లో, ఎనిమిది తక్కువ లేదా మధ్య ఆదాయ దేశాలని తెలిపింది. సుమారు 1బిలియన్ ప్రజలు నివసించే 33 దేశాల్లోని పిల్లలకు వాతావరణ ప్రమాదాలు అధికంగా ఉన్నాయని గుర్తించగా, వాటిలో 29 దుర్బలమైన దేశాలుగా పరిగణించినట్లు నివేదిక వెల్లడించింది. వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరిత్యాలు ఉపాధ్యాయుల, విద్యార్థుల మరణాలకు దారితీశాయని, పాఠశాలలను దెబ్బతీసి, నాశనం చేశాయని అధ్యయన బృందం తెలిపింది.

# ఆన్‌లైన్ మాంసం.. హానికరం!

**నిల్వ ఉంచిన మాంసాన్ని డెలివరీ చేస్తున్న ఈ -కామర్స్ యాప్‌లు**
**తాజాగా ఉండేందుకు సోడియం నైట్రేట్, సోడియం నైట్రైట్ కలిపి విక్రయాలు**
**ఫ్రాజెన్ మాంసంతో గర్భ సమస్యలు, క్యాన్సర్ ముప్పు**



హైదరాబాద్,: ఆన్‌లైన్‌లో చికెన్, మటన్, చేపలు ఆర్డర్ చేస్తున్నారా..? అయితే మీరుప్రాణాంతక వ్యాధులనుకొనితెచ్చుకుంటున్నట్లే.. అవును.. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారాడెలివరీ చేస్తున్న మాంసం ఏమాత్రం స్వచ్ఛమైనది కాదని అనేక నివేదికలు హెచ్చరిస్తున్నాయి. మాంసం తాజాగా కనిపించేందుకు ప్రమాదకర రసాయనాలను కలిపి విక్రయిస్తున్నారు. ప్రాణాంతక వ్యాధులను ఆన్‌లైన్ ద్వారా ఫ్రీగా డెలివరీ చేస్తున్నారు. ఆన్‌లైన్ డెలివరీ యాప్ సంస్థలు, వాటి గోడౌన్లలో నిరంతర తనిఖీలు చేపట్టకపోవడంతో ఇష్టారీతిన నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నాయి. యాప్ నిర్వాహకులు ఇచ్చే ఆఫర్లు, ప్రదర్శిస్తున్న నిబంధనలను చూసి వినియోగదారులు ఘోరంగా మోసపోతున్నారు. ప్రాణాలకు ముప్పు తెచ్చే వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు.

పది నిమిషాల్లోనే ఎలా సాధ్యం?: ఈ-కామర్స్ సంస్థలు వినియోగదారులకు అందిస్తున్న మాంసం ముమ్మాటికీ స్వచ్ఛమైనది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా మేక, గొర్రె మాంసాన్ని కూడా కేవలం పది నిమిషాల్లోనే ఇంటి వద్దకే తీసుకు రావడం ఎట్టిపరిస్థితుల్లోనూ సాధ్యం కాదు. ఎందుకంటే అప్పటికే కోసి ఉంచిన మాంసమైనా చిన్న ముక్కలుగా చేసి, ప్యాకింగ్ చేయడానికే కనీసం పది నిమిషాలు పడుతుంది. చేపలను కూడా ముక్కలుగా కోసి, కడిగేసరికి కనీసం పది నిమిషాలు పడుతుంది. కానీ ఈ కామర్స్ సంస్థల డెలివరీ బాయ్స్ మాత్రం ఆర్డర్ చేసిన పది నిమిషాల్లోనే ఇంటి ముందుకు వాలిపోతున్నారు.

రోజుల తరబడి నిల్వ: మాంసం, చేపలు, రొయ్యలు తాజాగా కనిపించడానికి ఈ కామర్స్ సంస్థల గోడౌన్‌లలో ప్రమాదకరమైన సోడియం నైట్రేట్,సోడియం నైట్రైట్ అనే రసాయనాలను కలుతారు. వీటి వల్ల మాంసం అప్పుడే కోసిన దానిలా లైట్ పింక్ కలర్‌లో ఉండి తాజాగా కనిపిస్తుంది. కానీ సోడియం నైట్రేట్, సోడియం నైట్రైట్ మాంసం లోపలికి చేరుతుంది. మాంసంతోపాటు దాన్ని తీసుకున్న వారి శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇలా ప్రాసెస్ చేసిన మాంసం అనేక క్యాన్సర్లకు కారణమవుతుందని డబ్ల్యూహెచ్‌వోఅనేక సార్లు హెచ్చరించింది. ఈ రసాయనాలను మాంసాన్ని నిల్వ చేసేందుకు ప్రిజర్వేటర్లుగా వాడకూడదని ఆదేశించింది. వీటికి బదులు ఆహార ఉత్పత్తుల్లో మరో సహజ, ప్రాణాంతకం కాని పదార్థాలను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఫ్రొజెన్ మాంసం తినడం వల్ల ప్రాణాంతక వ్యాధులు: ఈ-కామర్స్ సంస్థలు డెలివరీ చేసే మాంసం తాజాగా ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు వాడే సోడియం నైట్రేట్, సోడియం నైట్రైట్ వల్ల అనేక ప్రాణాంతక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ రసాయనాలు కలిపిన మాంసాన్ని తిన్నవారిలో పేగు, జీర్ణాశయ క్యాన్సర్లు సంభవిస్తాయి. నరాలు, కిడ్నీల పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. జెనెటిక్ వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా నూతనంగా వివాహమైన మహిళల్లో ఈ రసాయనాలు గర్భ నిరోధకాలుగా పనిచేస్తాయని పలు అధ్యయనాలు తేల్చాయి. గర్భం దాల్చివారిలో గర్భ స్రావానికి దారితీస్తున్నాయి. అదేవిధంగా చిన్నపిల్లల్లో అనేక జన్యు సంబంధిత వ్యాధులు సంభవిస్తున్నాయి. మానసిక, శారీరక ఎదుగలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటన్నింటి నుంచి తప్పించుకోవాలంటే ఆన్‌లైన్ డెలివరీ యాప్‌లను సంప్రదించకుండా దుకాణాల్లో తాజా మాంసాన్నే కొనుగోలు చేసి బాగా ఉడికించి తినాలని నిపుణులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఆహార ఉత్పత్తుల కొనుగోలులో ఆన్‌లైన్ డెలివరీ యాప్‌లను సంప్రదించకపోవడమే మంచిదని హెచ్చరిస్తున్నారు.

# 24 లక్షల కోట్ల డిజిటల్ లావాదేవీలు

న్యూఢిల్లీ, : ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికాకు పేరు ఉంది. రెండవ స్థానంలో చైనా ఉంది. మూడో స్థానంలో జర్మనీ కొనసాగుతోంది.. నాలుగు స్థానంలో ఇండియా ఉంది. తొలి మూడు దేశాలకు సాధ్యం కానిది.. ఆ మూడు దేశాలు చేయలేనిది భారత్ చేసింది. చేయడం మాత్రమే కాదు సరి కొత్త చరిత్ర సృష్టించింది.. ఆ మూడు దేశాలు కలలో కూడా ఊహించని అద్భుతాన్ని చేసింది.డిజిటల్ లావాదేవీలలో దూసుకుపోతోంది. ఫైవ్ స్టార్ హోటల్ నుంచి మొదలు పెడితే కూరగాయల దుకాణం వరకు ప్రతి లావాదేవీ కూడా అంతర్జాలంలోనే జరిగిపోతుంది. అరుదుగా మాత్రమే నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. మనదేశంలో జూన్ నెలలో 24.3 లక్షల కోట్ల నగదు లావాదేవీలు యూపీఐ ద్వారా జరిగాయి అంటే.. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఏ స్థాయిలో పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయాన్ని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వెల్లడించింది. గత ఏడది జూన్ నెలతో పోల్చి చూస్తే ఇది 32 శాతం అధికమని తెలుస్తోంది. "వ్యక్తిగత.. చిన్నచిన్న వ్యాపారులకు డిజిటల్ చెల్లింపు అనేది ఆర్థిక సాధనంగా మారింది. వారి వ్యాపారాలు డిజిటల్ విధానంలోనే సాగుతున్నాయి. ఇవన్నీ కూడా వారి ఆర్థికముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. చెల్లింపుల విధానం మారడం వల్ల వ్యాపారాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని" అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వెల్లడించింది.మనదేశంలో కోవిడ్ కంటే ముందు డిజిటల్ విధానంలో చెల్లింపులు ఒక స్థాయి వ్యక్తులకు మాత్రమే పరిమితమయ్యేవి. కానీ కోవిడ్ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. డిజిటల్ చెల్లింపులు అనేవి అన్ని రంగాలకు విస్తరించాయి. కనీవినీ ఎరుగని రీతిలో చెల్లింపుల స్థాయి పెరిగిపోయింది. అందువల్లే ఈ స్థాయిలో లావాదేవీలు జరుగుతున్నాయి.. ప్రభుత్వం కూడా డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి కృషి చేస్తున్న నేపథ్యంలో.. ఆర్థిక లావాదేవీలు మరింత పెరిగిపోతున్నాయి. అందువల్లే ప్రజలు చెల్లింపుల కోసం మరో మాటకు తావు లేకుండా యూపీఐ విధానాన్ని ఎంచుకుంటున్నారు. అయితే ఏడాది వ్యవధిలోనే 32 శాతం డిజిటల్ లావాదేవీలు పెరిగాయంటే.. భవిష్యత్ కాలంలో ఈ శాతం మరింత పెరుగుతుందని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు.ఆర్థికంగా శక్తివంతమైన తొలి మూడు దేశాలలో ఆన్లైన్ లావాదేవీలు అంతంత మాత్రమే సాగుతున్నాయి. ఇప్పటికీ ఆ దేశాలలో కొంతమంది ప్రజలకు ఆన్లైన్ లావాదేవీల మీద అవగాహన లేదు. అవగాహన కల్పించే ప్రయత్నాలను అక్కడ ప్రభుత్వాలు చేయడం లేదు. అక్షరాస్యత పరంగా ఆ మూడు దేశాలు మనకంటే మెరుగ్గానే ఉన్నప్పటికీ ఆర్థిక అక్షరాస్యత విషయంలో మాత్రం వెనుకబడే ఉన్నాయి. ఇప్పటికీ ఆదేశాలలో చెల్లింపులు నగదు ద్వారానే సాగుతున్నాయి.. డిజిటల్ విధానంలో చెల్లింపుల వల్ల ఆర్థిక అక్షరాస్యత మీద అవగాహన ఉంటుంది. మోసాలకు ఆస్కారం ఉండదు. పారదర్శకతకు పెద్దపీట వేయడం వల్ల అవకతవకలకు అవకాశం ఉండదు.

# సర్వేల వెనుక ప్రభుత్వ పెద్దలు

నెల్లూరు,: ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. అయితే ఈ ఏడాదిలోని అనేక రకాల సర్వేలు వచ్చాయి. ప్రభుత్వ పెద్దల పనితీరుపై మంచి మార్కులే పడ్డాయి. కానీ కొంతమంది ఎమ్మెల్యేల తీరు బాగా లేదంటూ సర్వేలు తేల్చి చెప్పాయి. అయితే అసంతృప్తి, వ్యతిరేకత అనే అంశాల చుట్టూ ఈ సర్వేలు కొనసాగాయి. కానీ ఏడాది పాలనలోనే ఇలా సర్వేలు చేయడం ఏపీలో ప్రత్యేకత. అయితే ఈ సర్వేల వెనుక ఎవరు ఉన్నారన్నది ఒక అనుమానం. అయితే ఈ సర్వేల వెనుక ప్రభుత్వమే ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని సీఎం చంద్రబాబు పక్కగా అడుగులు వేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల నాడిని పట్టుకునేందుకు ఈ సర్వేల ద్వారా ప్రభుత్వమే ముందుకు వెళుతోందన్నది ఒక ప్రధానమైన అనుమానం. దాదాపు అన్ని సర్వేలు ప్రభుత్వ పెద్దల పనితీరు బాగుందని చెప్పడం విశేషం. ఈసారి కూటమి కట్టడంతో అద్భుత విజయం దక్కించుకున్న ఈ మూడు పార్టీలు. కనీసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. అయితే ఏపీ రాజకీయాలు ప్రత్యేకంగా ఉంటాయి. అందుకే ఈసారి జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇవ్వకూడదని చంద్రబాబు, పవన్ ద్వయం భావిస్తోంది. అందుకే వరుసగా సర్వేలు చేపట్టి ప్రజల మూడ్‌కు అనుగుణంగా పాలన సాగించాలని భావిస్తున్నట్లు సమాచారం. పైగా ఇది ఎమ్మెల్యేలకు హెచ్చరికల ఉంటుందని భావించి ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ఎమ్మెల్యేలకు చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని.. వారి ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. అటు తరువాత చాలామంది ఎమ్మెల్యేల పనితీరుపై అభ్యంతరాలు ఉండడంతో నేరుగా హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయినా వారి తీరులో మార్పు రాకపోవడంతో ఈ సర్వేల ద్వారా వారిని అదుపులోకి తెచ్చుకోవాలని ప్రయత్నించినట్లు సమాచారం.చాలామంది ఈసారి కొత్తవారు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అటువంటి వారు ఎక్కువగా దూకుడు కనబరుస్తున్నారని ప్రచారం సాగుతోంది. రాజకీయాలకు కొత్త కావడంతో ఒత్తిడికి గురవుతున్నారని.. వారిపైనే అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయని తెలుస్తోంది. అందుకే వారిని సైతం అదుపులో పెట్టేందుకు ఈ కొత్తగా సర్వే పేరుతో కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటివరకు వెల్లడైనా సర్వేలు చూస్తే.. గతంలో అవి తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఫలితాలు ఇచ్చినవే. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఆ పార్టీకి అనుకూలంగా పనిచేసినవి. అటువంటిది టిడిపి అధికారంలో ఉన్న పార్టీ. ఈ సమయంలో ఆ పార్టీకి వ్యతిరేకంగా సర్వేలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఏడాది పాలనలోనే అన్ని జరిగిపోవు. కానీ ఈ ఏడాది పాలనపై సర్వేలు ఇవ్వడం మాత్రం నిజంగా ఆలోచించదగ్గ విషయం. పైగా ప్రభుత్వ పెద్దల పనితీరు బాగుంది.. ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారు.. కానీ ఎమ్మెల్యేల ప్రవర్తన పై వ్యతిరేకిస్తున్నారు. ఇలా చెబుతున్నాయి ఆ సర్వేలు. సో ఈ సర్వేల వెనుక కచ్చితంగా ప్రభుత్వ పాత్ర ఉందన్నది విశ్లేషకుల అభిప్రాయం. 2029 ఎన్నికల వరకు ఇలాంటి సర్వేలు వస్తూనే ఉంటాయి. అయితే ఇప్పుడు వచ్చిన సర్వేల ఫలితాలను చూసి వైసిపి మురిసిపోవడం లేదు. కచ్చితంగా దీని వెనుక ప్రభుత్వ పాత్ర ఉంటుందన్న అనుమానాలు ఆ పార్టీకి లేకపోలేదు. చూడాలి ఎవరి లెక్కలు వారివి..

# ఆగర్భ శత్రువుల ట్రంపాయణం



పాకిస్థాన్, ఇజ్రాయెల్ దేశాలు పూర్తిగా భిన్న ధ్రువాల్లాంటివి. సాంస్కృతికంగా, సైద్ధాంతికంగా, రాజకీయపరంగా ఇరుదేశాలవి వేర్వేరు దారులు. ఇంకా చెప్పాలంటే ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా గుర్తించేందుకు కూడా పాక్ నిరాకరిస్తున్నది. ఇన్ని వైరుధ్యాల మధ్యన ఈ రెండు దేశాల మధ్య ఒక సారూప్యత ఉండటం వైచిత్రి. అదేమిటంటే.. ఇటీవల ఈ రెండు దేశాలు తమ యుద్ధాలను ముగించాక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి పురస్కారానికి తమ దేశాల తరఫున నామినేట్ చేయడం.

2025, మే నెలలో భారత్‌తో జరిగిన యుద్ధంలో కాల్పుల విరమణ తర్వాత పాకిస్థాన్ వెంటనే అమెరికా అధ్యక్షుడిని నోబెల్ శాంతి పురస్కారానికి అధికారికంగా సిఫారసు చేసింది. దక్షిణాసియా దేశాల మధ్య అణుయుద్ధాన్ని దౌత్యపరమైన జోక్యం ద్వారా నివారించినందుకు గాను ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేస్తున్నట్టు పాకిస్థాన్ ప్రకటించింది. ఆ తర్వాత పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ట్రంప్ ప్రత్యేకంగా ఆతిథ్యం ఇచ్చారు. పాకిస్థాన్ మార్గంలోనే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ట్రంప్‌ను నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ చేశారు. అధికారిక నామినేషన్ లేఖతో ఇజ్రాయెల్ ప్రధాని జూలై 7న వైట్ హౌజ్‌ను సందర్శించారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరిగిన 12 రోజుల భీకర యుద్ధానికి ముగింపు పలికినందుకు గాను ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేస్తున్నట్టు నెతన్యాహు ప్రకటించారు. అయితే, ఈ యుద్ధాల్లో మరోవైపు ఉన్న భారత్, ఇరాన్ దేశాలు అమెరికా మధ్యవర్తిత్వ పాత్రను ఎన్నడూ గుర్తించకపోవడం ఆసక్తికరం.

భారత్, పాకిస్థాన్ మే 10న కాల్పుల విరమణకు అంగీకరించాయి. వాణిజ్యాన్ని నిలిపివేస్తామని బెదిరించి కాల్పుల విరమణకు ఇరుదేశాలను ఒప్పించానన్న ట్రంప్ వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. యుద్ధ పరిస్థితుల గురించి మాత్రమే అమెరికా, భారత్ మధ్య చర్చ జరిగిందని, ఆ సంభాషణల్లో ఎక్కడా వాణిజ్యం గురించి ప్రస్తావన రాలేదనిభారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఒకప్రకటనలో తెలిపింది. మరోవైపుఇజ్రాయెల్ తరఫున అమెరికాయుద్ధంచేసింది. ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపైబాంబులు వేసింది. ఆ తర్వాత జూన్ 24న ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పులవిరమణ ఒప్పందం కుదిరినట్టు ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించారు. కానీ, ఇరాన్ ఆ ప్రకటనను ఖండించింది. అయితే, ఖతార్ ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించడంతో కాల్పుల విరమణ ఒప్పందంజరిగినట్టు ఇరాన్‌అధికారి ఒకరు తర్వాత ధ్రువీకరించారు. అయినప్పటికీ ఇటు పాక్, అటు ఇజ్రాయెల్ దేశాలు మాత్రం అమెరికా అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపాయి.

అయితే, ఇజ్రాయెల్, పాక్ మధ్య అంతర్జాతీయ రాజకీయాల్లో మొదటినుంచీ ఏకాభిప్రాయం లేదు. పాకిస్థాన్ పాస్‌పోర్టులు ఇజ్రాయెల్‌లో తప్ప అన్ని దేశాల్లో ప్రయాణానికి చెల్లుబాటు అవుతాయని స్వయం గా పాక్ అధికారులు చెప్తుంటారు. ఐరాసలోనూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పాక్ అనేకసార్లు ఓటు వేసింది. గాజా ప్రాంతంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న విధానాలను పాకిస్థానీలు బహిరంగంగా విమర్శిస్తుంటారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పాక్‌లో నిరసనలు జరగడం సర్వసాధారణం.

పాలస్తీనాలో యూదు రాజ్యం స్థాపన ఆలోచనను పాక్ తొలినుంచీ ఆమోదించలేదు. ఇజ్రాయెల్ ఏర్పాటు తీర్మానానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితిలో పాక్ ఓటు వేసింది. కోల్డ్ వార్ సమయంలోనూ పాకిస్థాన్ పాశ్చాత్య దేశాల వైపు నిలబడింది. అరబ్ దేశాలతో బలమైన సంబంధాలను నెరపుతున్నది. అందుకు విరుద్ధంగా మధ్యప్రాచ్యంలోని అరబ్ దేశాలతో ఇజ్రాయెల్‌కు శత్రుత్వం ఉంది. ఆ దేశాలతో ఇజ్రాయెల్ యుద్ధాలూ చేసింది. అయితే, అమెరికా జోక్యంతో ఈ దేశాల్లో అనేకం ఇప్పుడు ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలను కలిగి ఉన్నాయి. అయితే, పాకిస్థాన్ మాత్రం ఇంకా చాలా దూరం పాటిస్తూనే ఉన్నది.

పాకిస్థాన్‌ను ఇజ్రాయెల్ మొదటినుంచీ తమ ప్రత్యర్థిగా భావించలేదు. అయితే, 1980లలో పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమాలను ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్ నిరోధించేందుకు ప్రయత్నించినట్టు వాదనలు ఉన్నాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్ విదేశాంగ విధానం పాకిస్థాన్‌పై పెద్దగా దృష్టి సారించడం లేదు. మరోవైపు, ఇజ్రాయెల్ విధానాలను పాకిస్థానీయులు విమర్శిస్తున్నారే తప్ప నాశనాన్ని మాత్రం కోరుకోవడం లేదు.

## రేషన్ కార్డుల పంపిణికి షెడ్యూల్ తయారు చేయండి..
## నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించండి...
### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రెండు నియోజక వర్గాలలో రేషన్ కార్డు పంపిణీ పై సమావేశం నిర్వహించి ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 10వ తేది వరకు రేషన్ కార్డులు పంపిణీకి అన్ని మండలాల వారిగా షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తన దుకాణాలాల్లో తప్పని సరిగా స్టాకు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబు, ఇరిగేషన్ ఈఈలు తిరుపతిరావు, ప్రసాదు, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

www.vishvambhara.com తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...

# ప్రగతి చక్రం విచ్ఛిన్నం!




రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఆర్‌టిసి) విలువైన స్థలాలపై బడా కార్పొరేట్ల కన్ను పడింది. అంతే, కారు చౌకగా ఆయా సంస్థలు కొట్టేసేందుకు వీలుగా టిడిపి కూటమి ప్రభుత్వంలో చకచక విధానాలు తయారై కేబినెట్‌లో ఆమోదానికి సిద్ధమైపోతున్నాయి. భూముల సంతర్పణకు ప్రభుత్వం ఎలాగూ అనుకూలమే కనుక మంత్రిమండలి గ్రీన్‌సిగల్ లాంఛనమే. విజయవాడ నడిబొడ్డునున్న అత్యంత విలువైన గవర్నర్‌పేట-2, పాతబస్టాండ్ జాగాలను అంతర్జాతీయ వాణిజ్య దిగ్గజం లూలూ గ్రూపునకు ధారాదత్తం చేసేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. లూలూ సంస్థ ఆర్‌టిసి నుంచి దక్కించుకునే స్థలాల్లో భారీ షాపింగ్‌మాల్ నిర్మిస్తుందని చెబుతున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో విశాఖలో ఇదే సంస్థకు భూములివ్వగా ప్రభుత్వం మారాక పత్తా లేదు. ఆ సంస్థకే ప్రస్తుత కూటమి సర్కారు ఆర్‌టిసి స్థలాలను హారతిపళ్లెంలో పెట్టి మరీ అందిస్తోంది. కనీసం రూ.400 కోట్ల విలువ చేసే ఆర్‌టిసి జాగాను ప్రజల, ఆర్‌టిసి సంస్థ అవసరాలకు వినియోగించాల్సిందిపోయి బహుళజాతి సంస్థ లూలూకు అర్పించుకోవడం, అందుబాటులో ఉండాల్సిన బస్ డిపోను ఎక్కడో ఊరవతలకు తరలించడం ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు పరాకాష్ట. ఎప్పుడైతే లూలూకు పాతబస్టాండ్ జాగా ఇస్తారని బయటికి పొక్కిందో ఆ క్షణం నుంచి ప్రజలు, ప్రజాసంఘాలు, ఆర్‌టిసి కార్మికులు ఆందోళనలకు ఉపక్రమించారు. బెజవాడ, పరిసర జనం పాత బస్టాండ్‌ను సెంటిమెంట్‌గా భావించడమే అందుక్కారణం.

మోడీ ప్రభుత్వం ఆర్‌టిసి వ్యవస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రత్యేక చట్టాలు చేయగా, ఎప్పటి నుంచో ఆర్‌టిసి ప్రైవేటీకరణ లక్ష్యంతో ఉన్న టిడిపి, ఇదే అదనుగా ముందుకెళుతోంది. ఆర్‌టిసి స్థలాల నగదీకరణ (మోనిటైజేషన్) ప్రాజెక్టు అమలు చేస్తోంది. నీతి-ఆయోగ్ అధికారులు దీనిపై స్వయంగా ఆర్‌టిసి అధికారులతో పర్యవేక్షిస్తున్నారు కూడా. అందులో భాగమే లూలూకు విజయవాడ పాతబస్టాండ్ స్థలాల అప్పగింత. ఆటోనగర్ బస్టాండ్, తిరుపతి బస్టాండ్, విద్యాధరపురం డిపో స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి పిపిపి విధానం అమలుకు ప్రతిపాదనలు ఉన్నాయి. అందుకు వ్యతిరేకంగా ఆయా ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. లూలూ మాల్ వస్తే చిరు వ్యాపారులేగాక మధ్యతరగతి, ఆ పైస్థాయి వారి వ్యాపారాలు కూడా కుదేలవుతాయి. గతంలో విజయవాడ పాతబస్టాండ్ జాగాను నగర సుందరీకరణకు తీసుకుంటామంటే ప్రజలు, కార్మికులు తిరగబడ్డారు. విద్యాధరపురం జాగాను ఇండో అమెరికన్ ఆస్పత్రికి ఇవ్వదలిస్తే ప్రతిఘటించారు. దాంతో ఆ రెండు ప్రతిపాదనపైనా సర్కారు విరమించుకోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో ఇంకా ఇలాంటివి ఎన్నో ఉన్నాయి.

ప్రభుత్వరంగంలోని ప్రజారవాణా వ్యవస్థలను కార్పొరేట్ల చేతిలో పెట్టే విద్యుత్ బస్‌ల పథకాన్ని మోడీ ప్రభుత్వం రూపొందించింది. కొనసాగింపుగా తొలిదశలో రాష్ట్రంలోని 19 డిపోల పరిధిలో 950 ఎలక్ట్రిక్ బస్‌లను కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ఆర్‌టిసి భూములను ఎలక్ట్రిక్ బస్ కంపెనీలకు నామమాత్రపు లీజుకు ఇస్తోంది. ఆ భూముల్లో బస్‌ల పార్కింగ్, నిర్వహణ, ఛార్జింగ్ యూనిట్లు, తదితర అవసరాలకు కంపెనీలు వాడుకుంటాయి. ఎలక్ట్రిక్ బస్‌ల నిర్వహణతో ఆర్‌టిసికి ఎటువంటి సంబంధమూ ఉండదు. అదే జరిగితే ఆర్‌టిసి ఆక్యుపెన్సీ తగ్గి నష్టం వస్తుంది. నిర్వహణాలోపాలతో నష్టాల్లోకి చేరిన సంస్థకు ఇది మరింత నష్టం. అందుకే విద్యుత్ బస్‌ల నిర్వహణను ఆర్‌టిసికే అప్పగించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఆర్‌టిసి బస్‌లు శిథిలావస్థకు చేరాయి. ఏళ్లతరబడి రిక్రూట్‌మెంట్ లేదు. బస్‌స్టాండ్‌లు, డిపోల స్థలాలు ప్రైవేటుకు ఇచ్చేస్తే సంస్థ మనుగడ ప్రశ్నార్థకం. 'ప్రగతి చక్రం' విచ్ఛిన్నమవుతుంది. ఇదే సమయంలో ప్రైవేటు ట్రావెల్స్ రోజు రోజుకు దేదీప్యమానంగా వెలిగిపోతాయి. మోడీ, బాబు ప్రభుత్వాలకు ఇదే కావాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసికి 20 వేల ఎకరాలకుపైన ఆస్తులున్నాయి. అవి ప్రజల ఆస్తులు. అవి ప్రజావసరాలకే వినియోగించాలి. కార్పొరేట్ల పరం కానీవ్వకుండా పరిరక్షించుకోవడం ఆర్‌టిసి కార్మికులు, సిబ్బందితోపాటు ప్రతిఒక్కరి కర్తవ్యం.

## మళ్లీ ఆశ చిగురిస్తోందా

విశాఖపట్టణం,: ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీకి ఓటు బ్యాంకు లేదు. మోదీ చరిష్మా ఉన్నప్పటికీ స్థిరమైన ఓటు బ్యాంకు కొన్ని దశాబ్దాల నుంచి లేదు. నేటికీ ఆ ఓటు బ్యాంకు శాతం మాత్రం పెరగలేదు. టీడీపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన నాడే ఏదో నాలుగైదు సీట్లువస్తాయి. ఇక్కడ పార్టీ అధ్యక్షులు మారినా.. సామాజికవర్గాల పరంగా ఎంపిక చేసినా.. ఫలితం లేదు. అనేక ప్రయోగాలు చేసిన కేంద్ర నాయకత్వం చివరకు ఆంధ్రప్రదేశ్ లో ఒంటరిగా వెళ్లలేమని డిసైడ్ అయినట్లుంది. అందుకే తొలి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి మాత్రమే కీలక పదవులను అప్పగిస్తూ వస్తుంది. ఎవరికీ విడిగా పోటీ చేసే పరిస్థితి లేదు. 2019లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఉద్దండులైన వారంతా ఓటమినే చవి చూశారు... ఎవరూ గెలవలేదు. కొన్ని చోట్ల అయితే డిపాజిట్లు కూడా రాలేదు. ఇప్పుడు పొత్తుతో ఎన్నికయిన పురంద్రీశ్వరి పార్లమెంటు సభ్యురాలిగా విశాఖలో ఒంటరిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మొన్న పొత్తుతో రాజమండ్రి నుంచి గెలిచారు. విష్ణుకుమార్ రాజు 2014లో గెలిచారు. 2014 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అంతే తప్ప 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి గెలవలేకపోయారు. ఇక సోము వీర్రాజు కూడా అంతే. కన్నాలక్ష్మీనారాయణ నరసరావుపేట ఎంపీగా 2019 ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయి మొన్న టీడీపీలో చేరి సత్తెనపల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇలా చాలా ఎవరిని తీసుకున్నా బీజేపీ ఒంటరిగాపోటీ చేసినప్పుడు తోలని చెప్పుకుంటున్న వారు కూడా గెలవలేకపోయారు. . అంటే బీజేపీకి ఏపీలో ఏ మాత్రం ప్రజాదరణ, ఓటు బ్యాంకు ఉందో అర్థం చేసుకోవచ్చు. నాయకత్వ లేమితో పాటు ఎవరికీ వ్యక్తిగత ఇమేజ్ లేదని, వారికి గెలిచే సత్తా లేదని రికార్డులు చెబుతున్నాయి. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఈ సారి గెలిచినప్పటికీ పార్టీలో తామే కీలకం అని భావిస్తున్న వారిని పక్కన పెట్టింది. కేంద్ర మంత్రి పదవిని శ్రీనివాసరాజుకు ఇచ్చింది. రాష్ట్ర మంత్రి పదవిని సత్యకుమార్ యాదవ్ కు కేటాయించింది. రాజ్యసభ పదవిని పాక సత్యనారాయణకు ఇచ్చింది. అంటే కమలం పార్టీ నాయకుల సత్తా కేంద్ర నాయకత్వానికి అర్థమయిందనే అంటున్నారు. అందుకే పార్టీ వీరికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదని చెబుతున్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా పార్టీకి నమ్మకంగా ఉన్న మాధవ్ ను ఎంపిక చేసిందంటున్నారు. మొత్తం మీద కేంద్ర నాయకత్వానికి రాష్ట్ర నాయకుల మీద విశ్వాసం లేదన్నది మాత్రం అర్థమయినట్లు కనిపిస్తుంది.

## అమరావతిలో ఇన్ని వ్యాలీలా



విజయవాడ, : అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం అయిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం మార్కెటింగ్ ఒక రేంజ్ లో చేసి పారేస్తున్నట్లే కనిపిస్తుంది. రాజధాని అమరావతి నిర్మాణ పనులు మొదటిదశకు సంబంధించినవి పూర్తి కావడానికి ఇంకా మూడేళ్ల సమయం పడుతుంది. ఇంకా రాజధాని అమరావతికి సరైన రహదారులు లేవు. అలాగే మౌలిక సదుపాయాలు లేవు. ఈ సమయంలో కార్పొరేట్ సంస్థలు, దేశంలోని దిగ్గజ పారిశ్రామిక సంస్థలు అమరాతిని ఒక రేంజ్ లో చంద్రబాబు మార్కెట్ చేస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. అమరావతిలో ఇన్నివ్యాలీలా అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. ప్రతి సమావేశంలో చంద్రబాబు అమరావతిలో వ్యాలీలు, హబ్ లు అంటూ పెద్దయెత్తున మార్కెటింగ్ చేస్తున్నారు... తొలుత అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ అన్నారు. దీనిపై పెద్దయెత్తున ప్రచారం కూడా చేశారు. క్వాంటమ్ వ్యాలీకి సంబంధించిన పనులు కూడా ప్రారంభమయినట్లు చెప్పారు. భవిష్యత్ లో రాజధాని అమరావతి ప్రపంచంలోనే అత్యున్నతమైన ఐటీ హబ్ గా మారుతుందని, క్వాంటమ్ వ్యాలీ కోసం పేరుగాంచిన సంస్థలు ముందుకు వచ్చాయని కూడా తెలిపారు. ఇక ఇటీవల కేంద్ర క్రీడా శాఖ మంత్రిని కలిసి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ హబ్ గా అమరావతిని మార్చాలని కోరారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో జల క్రీడలకు మంచి అవకాశాలున్నాయని, అందుకోసం కోరారు. అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు క్రికెట్ స్టేడియాన్ని కూడా నిర్మించేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు... ఇక తాజాగా చంద్రబాబు హైడ్రోజన్ వ్యాలీని కూడా ప్రచారం చేయడం మొదలు పెట్టారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్ కు ప్రాధాన్యం పెరిగిందని, దీనిపై పరిశోధనలు చేయాలని చంద్రబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్ హైడ్రోజన్ కు ప్రాధాన్యత ఇస్తుందని, భవిష్యత్ లో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తయారవుతుందని అన్నారు. ఎస్ఎఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి చేసిన ఈ వ్యాఖ్యలపై వైసీపీ సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అమరావతి ఒక పెద్ద వ్యాలీ అని, అక్కడ ఇంకా ఎన్ని వ్యాలీలు తెస్తారంటూ వైసీపీ నేతలు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. మొత్తం మీద అమరావతిని ప్రపంచంలో ప్రమోట్ చేయడంలో మాత్రం చంద్రబాబు ఏ విషయంలో తగ్గడం లేదన్నది విశ్లేకుల అంచనా. మరి చంద్రబాబు కలలు సాకారమవుతాయా? లేదా? అన్నది భవిష్యత్ లో తేలనుంది.

## లోకేష్... నీ టాలెంట్ సూపర్...



ఏలూరు, : ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఆసక్తి చూపడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా జరిగిన చర్చల్లో ఏపీలో సౌరశక్తి, మైక్రో ఇరిగేషన్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు మహీంద్రా గ్రూప్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఈవీ వాహనాలు, రక్షణ, ఏరో స్పేస్ తయారీ రంగాల్లో పెట్టుబడులకు రాయితీలు ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే నారా లోకేష్.. టాప్ ఇండస్ట్రిలియస్ట్‌తో టచ్ లో ఉండేందుకు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా మహీంద్రా గ్రూపు తమ కంపెనీకి సంబంధించిన ఓ ప్రకటనను తెలుగులో రూపొందించింది. ఒక్క నిర్ణయం చాలు...మీ విధి మీ చేతుల్లో ఉంది. ట్రక్ మార్చండి. మీ విధిని వశం చేసుకోండి అని ఆనంద్ మహీంద్రా తన సోషల్ మీడియా అకౌంట్‌లో దాన్ని షేర్ చేశారు. ఆ ప్రకటనపై నారా లోకేష్ స్పందించారు. తెలుగు ప్రకటన చాలా నచ్చింది సార్. మీ వాహనాలకు ఏపీ పెద్ద మార్కెట్. ఏపీలో అధునాతన ఆటోమోటివ్ ఎకో సిస్టమ్, పెద్ద మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవడానికి సన్ రైజ్ స్టేట్ అయిన ఆంధ్రప్రదేశ్‌లో మహీంద్రా ప్లాంట్ ను ప్రారంభించాలని కోరారు. ఏపీకి వస్తే.. ఉన్న అవకాశాలను తెలియచేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. లోకేష్ ఆఫర్ పై ఆనంద్ మహీంద్రా కూడా వెంటనే స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవకాశాలు ఉన్నాయని.. ఏపీ జర్నీలో తాము కూడా భాగం అవుతామన్నారు. వివిధ రంగాల్లో కలిసి పని చేసేందుకు తమ బృందాలు ఇప్పటికే చర్చలు జరుపుతున్నాయన్నారు.సోలార్, మైక్రో ఇరిగేషన్, టూరిజం వంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నామన్నారు. మన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది...ముందు ఏమి ఉందో చూద్దామని తెలుగులో రిప్లై ఇచ్చారు. ఈ వారంలోనే నారా లోకేష్ కర్ణాటకలో ఏరో స్పేస్ పార్క్ భూ సేకరణను అక్కడి ప్రభుత్వం రద్దు చేయడంతో వెంటనే లోకేష్ స్పందించారు. తమ వద్ద భూమి అందుబాటులో ఉందని.. రావాలని ఏరో కంపెనీలకు పిలుపునిస్తూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ వైరల్ అయింది. దీంతో కర్ణాటక పరిశ్రమల మంత్రి కూడా స్పందించాల్సి వచ్చింది. తాము భూసేకరణనుక్యాన్సిల్ చేశాం కానీ ఏరో స్పేస్ పార్క్‌ని కాదన్నారు. తమ వద్ద మంచి ఎకోసిస్టం ఉందన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆనంద్ మహీంద్రా ఆసక్తి చూపడంతో.. నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 'మనం కలిసి పనిచేద్దాం. ఈవీ వాహనాలు, రక్షణ, ఏరోస్పేస్ తయారీ రంగాల్లోకి మీ సంస్థను విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే వాళ్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున రాయితీలు ఇవ్వనుంది. మీరు వీటి తయారీకి ఏపీని ఎంచుకుంటేసంతోషిస్తాం' అని లోకేష్ పేర్కొన్నారు. ఇప్పుడు వీరిద్దిర మధ్య జరిగిన చిట్ చాట్ ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా ఒక్క పోస్ట్‌తో లోకేష్.. ఆనంద్ మహీంద్రాను ఒప్పించడం గ్రేట్ అంటున్నారు. ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు జనాలు.

## అధ్యక్షా ... అనడం కోసం తాపత్రయం

### ఎన్నాళ్లీ... ఎదురుచూపులు

అనంతపురం, : చాలామంది తమ వారసులను రాజకీయంగా ఉన్నత పదవుల్లో చూడాలని పరితపిస్తుంటారు. కానీ కొందరే సక్సెస్ అవుతారు. తాము క్రియాశీలకంగా ఉన్నప్పుడే వారసులను రాజకీయంగా సెట్ చేయాలని ఎక్కువ మంది భావిస్తారు. కానీ కొంతమందికి అదివీలవుతుంది. చాలామందిదశాబ్దాలుగా ఎదురు చూడాల్సి వస్తుంది. అటువంటియువ నేతలు, వారసులు ఏపీలోచాలామంది ఉన్నారు. దశాబ్దాలుగా సరైన విజయం దక్కక.. చట్టసభల్లో అడుగుపెట్టలేక రాజకీయాల్లో ఇబ్బంది పడిన వారు ఉన్నారు. అయితే ఒకసారి రాజకీయాల్లోకి రావడమే కానీ.. తిరిగి వెళ్లే పరిస్థితి ఉండదు. ఇప్పుడు కూడా చాలామంది వారసులు సరైన విజయం కోసం పరితపిస్తూనే ఉన్నారు. అటువంటి వారసుల తండ్రులు పేరు మోసిన నేతలే. కానీ క్షేత్రస్థాయిలో వారికి విజయం అందని ద్రాక్ష గానే ఉంది.తండ్రి అకాల మరణంతో రాజకీయాల్లోకి వచ్చారు కింజరాపు రామ్మోహన్ నాయుడు. అంతవరకు ఎర్రం నాయుడుకు ఒక కుమారుడు ఉన్నారని కూడా ఎవరికీ తెలియదు. కానీ చక్కటి వాగ్దాటితో, చరిస్మ కలిగిన నేతగా ఎదిగారు రామ్మోహన్ నాయుడు. మూడుసార్లు వరుసగా ఎంపీగా గెలిచి అతి చిన్న వయసులోనే కేంద్ర పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. నారా లోకేష్ తో పాటు చంద్రబాబు కు ఇష్టమైన యువనేతగా మారిపోయారు. అటు తరువాత అమలాపురం ఎంపీ హరీష్ కుమార్ తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చి తొలి ప్రయత్నంలో విఫలమయ్యారు. రెండో ప్రయత్నంలో ఎంపీ అయ్యారు.అయితే చాలామంది వారసులు సరైన గెలుపు కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. వచ్చేఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని భావిస్తున్నారు. వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాకృష్ణ 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అటు తరువాత ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్నారే కానీ గెలుపు తట్టలేదు. గత రెండు ఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం చిక్కలేదు. వచ్చే ఎన్నికల్లో మాత్రం పోటీ చేసిచట్టసభల్లో అడుగుపెట్టాలని గట్టి ప్రయత్నం లోనే ఉన్నారు. దేవినేని నెహ్రూ కుమారుడు అవినాష్ పరిస్థితి అలానే ఉంది. కాంగ్రెస్, టిడిపి, వైసీపీ నుంచి ఆయన చేయని ప్రయత్నం లేదు. కానీ గెలుపు బాట పట్టలేదు. వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఇప్పటినుంచి ప్రయత్నాలు చేస్తున్నారు.మరోవైపు రాయలసీమలో పరిటాల కుటుంబం నుంచి ఎదురుచూస్తున్నారు శ్రీరామ్. ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జిగా ఉండగా.. ఆయనకు మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కలేదు. ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఆయన భావిస్తున్నారు. నేదురుమల్లి కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉంది. మాజీ ముఖ్యమంత్రి జనార్ధన్ రెడ్డి కుమారుడు రామ్ కుమార్ రెడ్డి వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. వచ్చే ఎన్నికలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇంకా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుమారుడు రామ్ మనోహర్ నాయుడు, తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి వెంకట నాగ్, అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది వారసులు గెలుపు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ వారి ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## వర్మపైనే గీత భారమంతా...

పిఠాపురం, : పిఠాపురంవిషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన ఏంటి? కనీసం అక్కడ వాయిస్ వినిపించేవారు లేరు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసిన వంగా గీత పెద్దగా కనిపించడం లేదు ఎందుకు? పొలిటికల్ సర్కిల్లో ఇదే ఆసక్తికర చర్చ. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచారు పెండ్యం దొరబాబు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన జనసేనలో చేరిపోయారు. దీంతో జనసేన బలమైన శక్తిగా ఎదిగింది. ఎందుకో వంగా గీత మాత్రం పెద్దగా స్పందించడం లేదు. పార్టీ కార్యక్రమాలను తూతూ మంత్రంగా చేపట్టి వదిలేస్తున్నారు. అయితే భవిష్యత్తు కార్యాచరణ దృష్ట్యా ఆమె వెనక్కి తగ్గినట్లు ప్రచారం నడుస్తోంది.వంగా గీతాది సుదీర్ఘ రాజకీయ నేపథ్యం. ఆమె తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆ పార్టీలో చురుగ్గా పనిచేశారు. తరువాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ సమయంలో మెగాస్టార్ కుటుంబంతో ఆమెకు మంచి సంబంధాలే నడిచాయి. వంగా గీత విషయంలో మెగాఫ్యామిలీ కూడా చాలా సానుకూలంగా ఉంటుంది. అయితే వైసిపి హయాంలో కాకినాడ ఎంపీగా పనిచేశారు గీత. తరువాత పవన్ కళ్యాణ్ పై అనూహ్య పరిస్థితుల్లో పోటీకి నిలబడాల్సి వచ్చింది. అయితే ఆ సమయంలో సైతం పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన ప్రత్యర్థి వంగా గీత మంచి మహిళ అని.. ఎప్పటికైనా ఆమె జనసేనలో చేరడం ఖాయమని తేల్చి చెప్పారు. అయితే పిఠాపురం నియోజకవర్గంలో రెండు మూడు ఘటనలు జరిగాయి. కానీ వంగా గీత పెద్దగా స్పందించలేదు.తాజాగా రాష్ట్రస్థాయిలో కూటమి ప్రభుత్వవైఫల్యాలపై ఆందోళనలు జరపాలని జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కానీ పిఠాపురం నియోజకవర్గంలో మాత్రం ఎక్కడ ఆందోళనలు జరగలేదు. తొలి రెండు రోజులు వంగా గీత నేతృత్వంలో కార్యక్రమాలు నిర్వహించారు. కానీ 100కు మించి వైసిపి కార్యకర్తలు హాజరు కాలేదు. దీంతో ఆమె పునరాలోచనలో పడిపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు గీత భవిష్యత్తు విషయంలో ఒక ఆలోచనకు వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. పిఠాపురం వర్మ విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భిన్న ప్రచారం చేస్తోంది. ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరితే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే భవిష్యత్తులో వర్మ వైసీపీలోకి వస్తే తన పరిస్థితి ఏంటనేది గీతకు తలెత్తుతున్న అనుమానం. అందుకే పార్టీ కార్యక్రమాలను ఏదో తూతూ మంత్రంగా నిర్వహించాలన్న ఆలోచనతోఆమె ఉన్నట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. అందుకే పిఠాపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉన్నా.. లేనట్టేనని ఆ పార్టీ వర్గాలే చెబుతుండడం విశేషం.ప్రస్తుతం అక్కడ జనసేన బలంగా ఉంది. వైసీపీ ఎమ్మెల్యేగా ఐదేళ్లపాటు పదవి చేపట్టిన పెండ్యం దొరబాబు తన అనుచరులు, క్యాడర్ తో జనసేనలోకి వచ్చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంప్రదాయ ఓటు బ్యాంకు కొనసాగుతూ వస్తోంది. అయితే వైసిపి ఎక్కువగా వర్మపై ఫోకస్ పెడుతుండడం.. గీత భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. అయితే మెగా ఫ్యామిలీతో ఆమెకు ఉన్న అనుబంధం దృష్ట్యా జనసేనలోకి వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో పిఠాపురం నియోజకవర్గ రాజకీయాల్లో సంచలనాలు నమోదయ్యే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

www.vishvambhara.com తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర

# ఆగస్టు 10 వరకు రేషన్ కార్డుల పంపిణీ





## - వాన కాలం సాగుకు సకల సౌకర్యాలు
## - సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

జయశంకర్ భూపాలపల్లి,: ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాత్రి వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి సచివాలయం నుండి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి , వాకాటి శ్రీహరి, సీతక్క, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో ఖమ్మం నుండి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39 సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదల పై కలెక్టర్ దృష్టి సారించాలని అన్నారు. వరకు మన రాష్ట్రంలో దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, గత 3 రోజులు గా వర్షాలు ఎక్కువ కురుస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, జిహెచ్ఎంసి పరిధిలో హైదరా ఆధ్వర్యంలో 150 బృందాలను సిద్దం చేశామని అన్నారు. నగరంలో వర్షాలు ఉన్నప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిడుగు పాటుకు మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వర్షాలు వచ్చినప్పుడు చెట్ల కింద స్తంభాల దగ్గర ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పిడుగు పాటుతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని, దీనికోసం పోలీసు అధికారులు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని అన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటూ రోగాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని అన్నారు. నీటి నిల్వ లేకుండా చూడాలని, ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉంటే అక్కడ ఆయిల్ బాల్స్ వంటివి స్థానిక సంస్థల ద్వారా వేయాలని అన్నారు. డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని , ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర సమయంలో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మన ప్రాజెక్టులలో నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం మన రాష్ట్రంలో దేశంలోనే అత్యధికంగా రెండు కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వారి ఉత్పత్తి చేశామని అన్నారు. గోదావరి బేసిన్ లో ప్రాజెక్టులలో నీరు తక్కువగా ఉందని, ఇక్కడ నీరు వృధాగా పోకుండా ప్రాజెక్టులలో ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు.ప్రతి జిల్లాలో ఎరువుల స్టాక్ ఎంత అందుబాటులో ఉందో కలెక్టర్ రెగ్యులర్ గా ప్రకటనలు విడుదల చేయాలని, ప్రతి ఎరువుల షాప్ వద్ద స్టాక్ వివరాలు నోటీసు బోర్డులు పెట్టాలని, ఇద్దరూ పోలీస్ అధికారులను నియంత్రణకు పెట్టాలని అన్నారు. ఎరువుల లభ్యత పై అసత్య ప్రచారాలను గట్టిగా తిప్పి కొట్టాలని సీఎం పేర్కొన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతులు ముందస్తుగా ఎరువుల స్టాక్ పెట్టుకోకుండా అవగాహన కలిగించాలని అన్నారు. 20 నుంచి 25 శాతం ఎరువులు వ్యవసాయ అవసరాల కోసం కాకుండా ఇతర అంశాలకు, డీజిల్ వాహనాలలో పొగ తగ్గించేందుకు సబ్సిడీ ఎరువులు వినియోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారని సీఎం అన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ సబ్సిడీ ఎరువులు దారి మళ్ళించకుండా చూడాలని అన్నారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అంశాలకు యూరియా వినియోగిస్తే కఠినంగా వ్యవహరించాలని క్రిమినల్ కేసుల నమోదు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఎరువుల అంశంలో ఫిర్యాదులను నమోదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ జిల్లాలలో ప్రచారం చేయాలని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా దాదాపు 7 లక్షల రేషన్ కార్డులను ,31 లక్షల లబ్ధిదారులతో మంజూరు చేసామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 96 లక్షల 96 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులు రేషన్ కార్డు ఉపయోగిస్తున్నారని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఉన్నప్పుడు ప్రజలు ఎక్కువ పట్టించుకోలేదని బ్లాక్ మార్కెట్లో పోయేదని, ప్రస్తుతం సన్న బియ్యం సరఫరా చేయడంతో చాలా డిమాండ్ వచ్చిందని, ప్రజలు తప్పనిసరిగా రేషన్ తీసుకుంటున్నారని సీఎం సంతోషం వ్యక్తం చేశారు.

జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, వీటిలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ పాల్గొనేలా చూడాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక చోట ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఒక చోట పాల్గోనేలా కలెక్టర్ కోఆర్డినేట్ చేసుకోవాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డిఓ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ కిందిస్థాయి సిబ్బంది అధికారులు ప్రజలను కలెక్టర్ అప్రమత్తం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ , ఇతర జిల్లా అధికారులు ఐడిఓసి కార్యాలయం నుండి పాల్గొన్నారు.

# జైలులో జగన్ కోటరీ



రాజమండ్రి, : వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు అంత్యంత సన్నిహితులుగా ఉన్నవారంతా జైలు ఊచలు లెక్కపెట్టేందుకు సిద్ధంగా ఉండాల్సిందే. గత ఐదేళ్లలో జగన్ కు అనుకూలంగా ఉన్న అనేక మందిని ఇప్పటికే జైలుకు పంపారు. మద్యం స్కామ్ కేసులో ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి తో పాటు ఓఎస్డీగా వ్యవహరించిన కృష్ణమోహన్ రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తాజాగా మిధున్ రెడ్డి కూడా అరెస్ట్ అయ్యారు. అంటే జగన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించిన వారు ఇదే కేసులో జైలులో ఉన్నట్లయింది. జగన్ కు అత్యంత ఆప్తులుగా గత ఐదేళ్లలో వ్యవహరించిన వారందరూ వరసగా జైలుకు వెళుతున్నారు.కేవలం మద్యం కేసు మాత్రమే కాదు.. అనేక కేసులు వరసగా వైసీపీ నేతలను చుట్టుముట్టేటట్లు కనిపిస్తున్నాయి. తర్వాత మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ శాఖ భూములను కబ్జా చేశారన్న ఆరోపణలపై అరెస్ట్ చేసే అవకాశాలను కొట్టిపారేయలేం. ఎందుకంటే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరూ తొలి నుంచి వైరంతో ఉన్నవాళ్లే. కళాశాలలో చదివే నాటి నుంచి వీరి మధ్య వైరం ఉందంటారు. అదే వైరం రాజకీయాల్లోనూ కొనసాగుతూ వచ్చింది. ఇక మద్యం స్కామ్ కేసులో కాకుంటే మరొక కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అరెస్ట్ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే పలు కేసులు ఆయనపై నమోదయ్యాయి. మరొకవైపు గత ఐదేళ్ల కాలంలో సకల శాఖ మంత్రిగా వ్యవహరించారని తెలుగుదేశం పార్టీ ఆరోపించిన సజ్జల రామకృష్ణారెడ్డిని కూడా కేసులు వదిలపెట్టవన్నది వాస్తవం. ఆయనపై కూడా కేసులు నమోదు చేయడమే కాకుండా కటకటాలు లెక్కపెట్టిస్తారన్న టాక్ బలంగా వినపడుతుంది. ఐదేళ్ల పాటు తమ పార్టీ కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు బనాయించడంలోనూ, పోలీసు అధికారులకు డైరెక్షన్ ఇవ్వడంలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉందని తెలుగుదేశం పార్టీ శ్రేణులు గుర్రుగా ఉన్నాయి. సోషల్ మీడియాలోనూ ఆయన అరెస్ట్ ఎప్పుడంటూ ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సజ్జల రామకృష్ణారెడ్డిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తారన్న ప్రచారం అయితే ఊపందుకుంది. ఈ ఏడాదిలోనే ఈ కేసులన్నీ పూర్తిచేసి కీలమైన నేతలను అరెస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.

# పిడుగుపాటుతో 36 గొర్రెలు మృతి చెందిన గొర్ల కాపరిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలి

### -మంథని ఆర్డీవో కు వినతి పత్రం అందజేసిన యాదవ సంఘం నాయకులు



మంథని ప్రతినిధి,: మంథని మండలం సిరిపురం గోదావరినది ఒడ్డున సాయంత్రం గొర్రెలమంద పై పిడుగు పడడంతో చిల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పుట్ట పోచయ్య, పుట్ట సంతోష్ లకు చెందిన 36 గొర్రెలు మృతి చెందిన సంఘటనలో 3లక్షలకు పైన నష్టం వాటిల్లిందని,అట్టి గొర్రెల కాపరి కుటుంభాన్ని ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించా లని మంథని మండల యాదవ సంఘం నాయకులు పర్శవేన మోహన్ యాదవ్, కనవేన శ్రీనివాస్ యాదవ్. జగిరి సదానందం యాదవ్ లు విజ్ఞప్తి చేశారు. మంథని పట్టణంలోని రెవిన్యూ డీవిజినల్ అధికారికి, మంథని తహసీల్దార్ కు మంథని మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా
యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో గొర్రెల, మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలకు గొర్రెల మందను ఎత్తైన ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు. గొర్ల కాపర్ల వృత్తితో జీవనం కొనసాగిస్తున్న చిల్లపల్లి గ్రామానికి చెందిన పుట్ట పోచయ్య, పుట్ట సంతోష్ లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కనవేన కొమురయ్య యాదవ్, సింగనవేన మల్లేష్ యాదవ్, బోగొండ రవి యాదవ్, మాదారవేన ఓదెల యాదవ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చొప్పదండి ని.వ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూ ర్వకంగా కలిసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం లోని పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను గురించి ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చర్చించారని తెలిపారు.ఉత్తర తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు.చొప్పదండి నియోజకవర్గం వరప్రదాయనిగా ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లోని పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి పనులకు సైతం నిధులు కేటాయించి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే సత్యం కు హామీ ఇచ్చారని తెలిపారు.చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించడానికి అనుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపుతున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థులకు టై బెల్టు,బ్యాడ్జిలు అందజేత

ములుగు : ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలో కాపు వాడకు చెందిన ప్రైమరీ నార్త్ స్కూల్ పిల్లలకు గండపల్లి ఫౌండేషన్ చైర్మన్ గండేపల్లి నర్సయ్య ఆధ్వర్యంలో టైలు బెల్టు బ్యాడ్జీలు 110 మంది పిల్లలకు ఉచితంగా అందించారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఎంఈఓ కోయడ
మల్లయ్య,జెడ్ పి ఎస్ ఎస్ స్కూల్ హెడ్మాస్టర్ సాంబశివరావు,నార్త్ స్కూల్ హెడ్మాస్టర్ రాజ శేఖర్, లొట్టపెట్టల రాజేష్,పేరెంట్స్ కమిటీ చైర్మన్ కటుకూరి రాధిక,గండేపల్లి ఫౌండేషన్ సభ్యులు గండేపల్లి వెంకటయ్య,గంప కిరణ్,లక్కీ సాగర్,గండేపల్లి నవీన్,గండేపల్లి చుక్కారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ కు దీటుగా పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన



పెద్దపల్లి : మన ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, వీటిని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింత కుంట విజయరామణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి మొదటిసారిగా ప్రభుత్వం తరుపున ఉచితంగా కళ్ళద్దాలను ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్ సిబ్బందితో కలిసి శాసనసభ్యులుచింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తునందుకు సూపరిండెంట్ శ్రీధర్ తోపాటు వైద్యులను ఎమ్మెల్యే విజయరమణ రావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా పనిచేస్తుందని అన్నారు. మన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతనమైన వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు అందిస్తూ పేద కుటుంబాలకు సహాయసహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు తగ్గకుండా ప్రభుత్వ ఆసుపత్రి అన్ని విధాలుగా సేవలను అందిస్తూ పేదవారికి వైద్య ఖర్చులు లేకుండా చేస్తున్నామని గుర్తుచేశారు. మన ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గణనీయమైన మార్పులు చేశామని అన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు, నియోజవర్గ ప్రజలందరూ ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి శస్త్ర చికిత్స, డయాలసిస్, చర్మ వైద్యం, ముక్కు, నోరు, గొంతు, చిన్న పిల్లల వైద్యం అలాగే నవజాతి శిశువుల కోసం మెరుగైన వైద్య సేవలు, మాత శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం, గర్భిణీ స్త్రీలకు అధిక ఖర్చుతో కూడిన టిఫ్ఫా స్కానింగ్ ను సైతం ఉచితంగా చేయడం లాంటి మరెన్నో వైద్య సేవలు ప్రభుత్వం తరుపున ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్, ఆర్.ఏం.ఓ, ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువులు అందించాలి



**జర్నలిస్ట్ లకి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వాలని డిమాండ్**
**కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేయాలి**
**జూలై 27న కేటీఆర్ పర్యటన**
**మాజీ ఏమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**

జయశంకర్ కాంగ్రెస్ పాలనలో చెప్పులు లైన్లో పెట్టి ఎరువుల కోసం ఎదురు చూసే పరిస్థితి వచ్చింది. జిల్లాలకు మంత్రులు వస్తున్నారు పోతున్నారు మంత్రులు అంటే ప్రభుత్వాని నడిపించేవారు,ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువగా సేద్యం చేసే జయశంకర్ భూపాలపల్లి జిల్లా అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. ఈనెల 27వ తేదీన భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్ళపల్లి మండలం,ఇస్సిపేట గ్రామ మాజీ సర్పంచ్ కీ.శే కొడారి కోమురయ్య విగ్రహ ఆవిష్కరణ మరియు బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో ముఖ్య కార్యకర్తల సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి వర్యులు, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు రాక సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ...మంత్రి శ్రీధర్ బాబు జిల్లాల్లో ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గుర్తు చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మత్తు చేయకపోవడంతో కొన్ని వేల క్యూసెక్కుల నీళ్లు సముద్ర గర్భంలో కలిసి పోతున్నాయి.ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్ట్ మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. అదే విదంగా భూపాలపల్లి లో నివసించే వారు వివిధ ప్రాంతాల నుండి బ్రతుకుదెరువు కోసం వచ్చిన వారు ఎక్కువ వారికీ ఇక్కడ ఇళ్ళు నిర్మించుకోవడానికి కూడా కనీస జాగా లేని వారు ఎక్కువ వాళ్ళల్లో పేదవారైన అర్హులైన లబ్దిదారులకు మేము మా ప్రభుత్వ హయాంలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా డబుల్ బెడ్ రూమ్ లబ్ది దారులను అందరి సమక్షంలో అధికారుల మధ్యలో డ్రా పద్దతిలో ఎంపిక చేయడం జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ లబ్ది దారుల లిస్ట్ మార్చి అంతా దళారీ వ్యవస్థను నడిపిస్తున్నారు. అదే విదంగా మీడియా మిత్రులకు గతంలో మేము ఇచ్చిన ఇళ్ళ పట్టాలను వెంటనే జర్నలిస్ట్ సోదరులకు కేటాయించాలని,అదే విదంగా వారికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేశారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

# అతడి కల, కలమూ ప్రజాపక్షమే!



చౌదరి ఫైజ్ అహ్మద్ ఫైజ్ (13 ఫిబ్రవరి 1911 – 20 నవంబర్ 1984) ప్రఖ్యాత పంజాబీ, ఉర్దూ కవి. ఆయన రచనలు, ఆలోచనలు గొప్ప అభ్యుదయాన్ని ప్రచారం చేశాయి. అధ్యాపకుడిగా, సైనిక అధికారిగా, సంపాదకుడిగా, కవిగా, రచయితగా, కమ్యూనిస్టు నాయకుడిగా ఆయన ఎంతో ప్రాచుర్యం పొందారు. పంజాబ్ ప్రావిన్స్‌లో జన్మించిన ఫైజ్ లాహోర్‌లోని ప్రభుత్వ కళాశాల, ఓరియంటల్ కళాశాలలో చదువుకున్నాడు. బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సేవలందించాడు. భారతదేశ విభజన తర్వాత, ఫైజ్ ఆంగ్ల భాషా దినపత్రిక పాకిస్తాన్ టైమ్స్, ఉర్దూ దినపత్రిక ఇమ్రోజ్‌లకు చీఫ్ ఎడిటర్‌గా పనిచేశాడు. 1951లో లియాఖత్ పరిపాలనను కూలదోసి, వామపక్ష, సోవియట్ అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే కుట్రలో పాల్గొన్నారనే ఆరోపణలతో అరెస్టు చేయబడి జైలు శిక్ష అనుభవించాడు. అనంతరం మాస్కో లండన్‌లో గడిపి, ప్రోగ్రెసివ్ రైటర్స్ ఉద్యమంలో ప్రముఖ సభ్యుడయ్యాడు. సైనిక నియంత అయూబ్ ఖాన్ ప్రభుత్వం పతనం, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం తర్వాత, అతను జుల్ఫికర్ అలీ భుట్టోకు సహాయకుడిగా పనిచేశాడు. కానీ మరొక సైనిక నియంత జియా ఉల్-హక్ చేతిలో భుట్టో ఉరితీయబడిన తర్వాత బీరుట్‌కు బహిష్కరించబడ్డాడు. మార్క్సిస్టు సిద్ధాంతం ఆలంబనగా మార్పు కోసం కృషి చేసిన కవి, ఆరచణవాది ఫైజ్. సోవియట్ యూనియన్ ద్వారా లెనిన్ శాంతి బహుమతి (1962) అందుకున్న మొదటి ఆసియా కవి ఆయన. నోబెల్ సాహిత్య బహుమతికి కూడా నామినేట్ అయ్యాడు.

ఫైజ్ కౌమార దశ చాలామంది యువకుల మాదిరిగానే సాగింది. సియాల్‌కోట్‌లో పొరుగున ఉన్న ఓ యువతి ప్రేమలో పడ్డాడు. కానీ, తన భావాలను వ్యక్తపరచడానికి ధైర్యం చాల్లేదు. తరువాత ఉన్నత చదువు కోసం లాహోర్‌కు వెళ్లాడు. ఆమె వివాహం చేసుకుంది. అతడు అమృత్‌సర్‌లో ఇంగ్లీష్ లెక్చరర్‌గా చేరాడు. అప్పుడే మార్క్సిజం ప్రేమలో పడ్డాడు. ఆ ప్రేమ విశ్వప్రేమ అయింది. కవిత్వమై వెలుగొందింది. భారత ఉపఖండపు రాజకీయ కవిత్వానికి మార్గదర్శకుడయ్యాడు. ఉర్దూ సాహిత్యంలో మహొన్నత వ్యక్తిగా, లెనిన్ శాంతి బహుమతి గ్రహీతగా ఎదిగాడు. తన ప్రారంభ రోజులు అందించిన అనుభవమే తనను గొంతు లేనివారికి స్వరంగా మిగిల్చాయని చెబుతాడాయన.

ఔర్ భీ దుఖ్ హై జమానే మే మొహబ్బత్ కే శివా, రహతేన్ ఔర్ భీ హైన్ వాస్ల్ కి రహత్ కే శివా, ముర్%ఖు% సే పహ్లీ సి మొహబ్బత్ మేరే మెహబూబ్ నా మాంగ్ (ప్రపంచానికి ఇతర సమస్యలు ఉన్నాయి. ప్రేమికుడి వెచ్చని ఆలింగనం కంటే ఇతర సౌకర్యాలు ఉన్నాయి. నేను ఒకప్పుడు నా ప్రేమను అడిగాను. నిన్ను ఇష్టపడలేదు). అలా ఫైజ్ రొమాన్స్, రాజకీయాలను పెళ్లి చేసుకున్నాడు.

ఫైజ్‌కు మహమూద్-ఉజ్-జాఫర్, ఆయన భార్య రషీద్ జహాన్‌తో స్నేహం ఏర్పడింది. 1932లో ఫైజ్ ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్న నలుగురు స్నేహితులతో కలిసి అంగారే (అగ్ని) అనే చిన్న కథల సంకలనం, ఒక నాటకం ప్రచురించాడు. ఆ కథలు ఎక్కువగా స్త్రీ స్వేచ్ఛ గురించి, సమానత్వం గురించి మాట్లాడాయి. సంప్రదాయవాదంలోని బోలుతనంపై విమర్శ చేశాయి. ఫలితంగా ఆ కథల పుస్తకం నిషేధానికి గురైంది. కానీ, ఆ సాహిత్యాపుటాలోచనలోని కొత్త కాంక్ష భారతదేశంలో ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ ఏర్పాటుకు దారి తీసింది. రచయితల సంఘం ఏర్పాటులో ఫైజ్‌ది కీలకపాత్ర.రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో ఫైజ్ సైన్యంలో చేరాడు. ఆవిధంగా ఆయన కవిత్వ సృజనకు కొంత విరామం వచ్చింది. 1947లో తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. వామపక్ష భావాలు కలిగిన ఆంగ్ల భాషా వార్తాపత్రిక ది పాకిస్తాన్ టైమ్స్ సంపాదకుడిగా చేరాడు. దేశ విభజన సమయంలో జరిగిన మత హింసతో నిరాశ చెందిన ఆయన, "యే దాఫ్న్ దాఫ్న్ ఉజాలా యే షబ్-గజిదా సహర్, వో ఇంతిజార్ థా జిస్ కా యే వో సహర్ తో నహిన్" (చీకటితో తడిసిన ఈ వెలుగు, సంధ్యా సమయంతో కలుషితమైన తెల్లవారుజాము లాంటిది. ఇది మనం ఎదురుచూసిన తెల్లవారుజాము కాదు) అని రాశారు.

1951లో లియాఖత్ అలీ ఖాన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కమ్యూనిస్టులు కుట్ర చేశారని ఆరోపిస్తూ, వామపక్ష సైనిక అధికారులతో పాటు ఫైజ్‌ని కేడా అరెస్టు చేశారు.

జైల్లో పెట్టారు. ఆయన జైలు గోడల మధ్య నుంచే దస్త్-ఎ సబా (ది హ్యాండ్ ఆఫ్ ది బ్రీజ్), జిం దాన్ నమా (ప్రిజన్ క్రానికల్స్) అనే రెండు పుస్తకాలు వెలువరించాడు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఫైజ్ తన ఆశను, ఆశయాన్ని వదులు కోలేదు. జైలు గదిలోనే.. ఖఫాస్ ఉదాస్ హై యారో సబా సే కుచ్ తో కహూ. కహిన్‌తో బహార్-ఎ-హుదా ఆజ్ జిక్ర్-ఎ-యర్ చలే (పంజరం విచారంగా, నిశ్శబ్దంగా ఉంది. గాలికి ఏదైనా చెప్పండి. దేవుడి కొరకు, నా ప్రియమైన వ్యక్తి గురించి మాట్లాడుకుందాం) అని రాశాడు.

నాలుగేళ్ల తరువాత జైలు నుంచి విడుదలయ్యాడు ఫైజ్. అప్పటికి చాలా మార్పులు వచ్చాయి పాకిస్తాన్‌లో. పాకిస్తాన్ సీటో, సెంటోలపై సంతకం చేసి, ఆయన ద్వేషించే అమెరికా పక్షాన చేరింది. తరువాత కొన్నేళ్లు సాగాయి. భుట్టో అధికారంలోకి వచ్చాక- ఆయన్ని విద్యా మంత్రిత్వ శాఖకు సాంస్కృతిక సలహాదారుగా నియమించాడు. ఫైజ్ చొరవతో పాకిస్తాన్‌లోని జానపద కథలు, కళలపై విస్తారమైన పరిశోధన, నమోదు సాగాయి.

1974లో ఫైజ్ భుట్టోతో కలిసి బంగ్లాదేశ్‌కు వెళ్లాడు. షేక్ ముజిబుర్ రెహమాన్ అభ్యర్థన మేరకు హమ్ కీ థాహ్రే అజ్నాబీ ఇత్నీ ముదరతోన్ కే బాద్‌ను స్వరపరిచాడు. ఫిర్ బనేంగే అష్నా కిత్నీ ములాఖతోన్ కే బాద్ (ఆతిథ్యం ఇచ్చినప్పటికీ, మేము అపరిచితులమే, మళ్లీ స్నేహితులుగా మారడానికి ఎన్ని సమావేశాలు పడతాయో ఎవరికి తెలుసు) అని రాశాడు. ఆనాటి రాజకీయ పరిస్థితికి అద్దం పట్టే కవితా పాదాలు అవి.

తరువాతి కాలంలో భుట్టోను అరెస్టు చేశారు. మళ్లీ అశాంతి నెలకొంది. ఫైజ్ స్వయంగా బీరూట్‌కు మారిపోయాడు. ఆసియా, ఆఫ్రికన్ రచనలను ప్రోత్సహించడానికి స్థాపించిన లోటస్ పత్రికకు సంపాదకుడిగా మారారు. ఆ మ్యాగజైన్ కార్యాలయాన్ని యాసర్ అరాఫత్ ప్రారంభించారు. స్వదేశం నుంచి దూరంగా బతకటం ఫైజ్‌కి సమస్యే అయింది. తాను దూరంగా ఉన్నట్లు, తన ప్రజల నుంచి వేరు చేయబడినట్లు, తన ప్రజల కోసం ఆరాటపడుతున్నట్లు అతని స్నేహితులు గుర్తించారు. మేరే దిల్, మేరే ముసాఫిర్, హువా ఫిర్ సే హుక్మ్ సదిర్, కి వతన్-బదర్ హౌన్ హమ్ తుమ్ (నా హృదయం, నా ప్రయాణికుడు, ఆదేశం మళ్ళీ జారీ చేయబడింది. మేము మళ్ళీ బహిష్కరించబడ్డాము) వంటి రచనలు ఆకాలంలోనే ఆయన కలం నుంచి కాదుబీ హృదయం నుంచి వెలువడ్డాయి.

ఫైజ్ రాసిన అత్యంత శాశ్వతమైన రచన హమ్ దేఖేంగే. మానవత్వాన్ని, మనిషి ప్రాధాన్యాన్ని చాటిచెప్పిన ఈ రచన మత ఛాందసుల విమర్శలను ఎదుర్కొంది. ఫైజ్ మద్దతు ఇచ్చిన ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం నుంచి ప్రేరణ పొందింది. ఈ కవిత ఇచ్చే సందేశం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కవిత ముగింపులో కవి ఇలా అంటాడు : "ఉత్తేగా అనల్ హక్ కా నారా, జో మై భి హు ఓర్ తుమ్ భి హో". బస్ రాజ్ కరేగి ఖల్కే ఖుదా జో మై భి హు ఓర్ తుమ్ భి హో. అనల్-హక్ అంటే 'నేనే సత్యం'. ఫైజ్ ఈ నినాదాన్ని అందరూ లేవనెత్తుతారని ఊహించాడు. ఇస్లాం, యూదు, క్రైస్తవ మతం వంటి సెమిటిక్ మతాలలో దేవుడు, సృష్టి మధ్య కఠినమైన ద్వంద్వత్వం ఉంది. దీనికి విరుద్ధంగా సూఫీ తత్వంలో 'నేను దేవునితో ఒకడిని' అనే అద్వైత భావన ప్రతిధ్వనిస్తుంది. ఈ వివరణ ద్వారా, ఈ కవిత యొక్క సందేశం ఏమిటంటే – "మానవులే అంతిమ సత్యం – దైవత్వం మానవత్వంలో ఉంది." ఈ మాటల్లోని పరమార్థం ప్రపంచ ప్రజలకు ఇంకా ఆచరణలోకి రావాల్సి ఉంది.

## ఏసిపి కృష్ణ ను పరామర్శించిన నాయకులు



కమాన్ పూర్ : పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ ను పలువురు పరామర్శించారు. ఇటీవల ఏసిపి కృష్ణ తండ్రి ఐలయ్య మంచిర్యాల జిల్లా భీమారం మండలం రసూల్ పల్లెలో రోడ్డు ప్రమాదం లో మృతి చెందారు. దీంతో పలువురు పోలీస్ అధికారులు నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు రసూల్ పల్లెకు వెళ్లి ఐలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఐలయ్య ఆత్మకు శాంతి కలగాలని ఇందులో నివాళులర్పించిన వారిలో కరీంనగర్ పిటిసి ఎసిపి మోహన్, పిపి బాదాంరమేష్, మాజీ ఎంపీటీసీ పిల్లి శేఖర్, రంగాపూర్ మాజీ సర్పంచ్ గంటా రమేష్, మరియు సీనియర్ విలేకరి జబ్బర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడి ఎన్నిక..

### శాలువాతో సన్మానించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు



జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన ఏబూసి శ్రీనివాస్,ను మున్నూరు కాపు సంక్షేమ సంఘం పట్టణ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా మండల కేంద్రంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరు కాపుల ఐక్యతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊడుగుల మహేందర్, గాండ్ల సంపత్, బుక్క రవి , ఏబుషి ఓదెలు, సూర రమేష్, సంద మహేందర్, పొనగంటి రాజు, కొండపర్తి ప్రవీణ్, ముకుంద సుధాకర్, ఊడుగుల వేణు, నీరటి సతీష్,ఏబూషి వినయ్ కుమార్,ఆకుల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు....

# మణిపూర్ లో ముగ్గురు మిలిటెంట్లు అరెస్టు



ఇంఫాల్ : మణిపూర్‌లోని ఇంఫాల్ తూర్పు, కాక్చింగ్ జిల్లాల నుండి రెండు నిషేధిత సంస్థలకు చెందిన ముగ్గురు మిలిటెంట్లను భద్రతా దళాలు అరెస్టు చేశాయని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. మందుగుండు సామగ్రి వ్యాపారంలో పాల్గొన్నారనే ఆరోపణలపై ఇంఫాల్ పశ్చిమ జిల్లా నుండి మరో ముగ్గురిని కూడా అరెస్టు చేసినట్లు తెలిపింది. నిషేధిత ప్రీపాక్‌కు చెందిన స్వయం ప్రకటిత సార్జెంట్ మేజర్‌ను శనివారం ఇంఫాల్ తూర్పు జిల్లాలోని కొంతా అహల్లప్‌లోని అతని నివాసం నుండి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతను మయన్మార్‌లోని తనల్‌లో ప్రాథమిక సైనిక శిక్షణ పొందాడని, గత సంవత్సరం అక్టోబర్‌లో ఆ సంస్థ కోసం ఒక కేడర్‌ను నియమించుకున్నాడని పోలీసులు తెలిపారు. జిల్లా, పరిసర ప్రాంతాలలో దోపిడీ కార్యకలాపాలలో పాల్గొన్నారనే ఆరోపణలతో నిషేధిత యుపిపికెకు చెందిన ఇద్దరు క్రియాశీల సభ్యులను ఆదివారం కాక్చింగ్‌లోని ఒక మార్కెట్ నుండి అరెస్టు చేసినట్లు పోలీసు ప్రకటన తెలిపింది. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని తంగ్మెయిబ్, ఖుయాతోంగ్ పోలెం లైకై ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులను ఆదివారం అక్రమ మందుగుండు సామగ్రి అమ్మకాలకు పాల్పడినందుకు భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు తెలిపింది. వారి వద్ద నుండి 100కి పైగా మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రెండేళ్ల క్రితం జాతి హింస చెలరేగినప్పటి నుండి మణిపూర్‌లో భద్రతా దళాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. మే 2023 నుండి మెయిటీస్ మరియు కుకి-జో గ్రూపుల మధ్య జరిగిన జాతి హింసలో 260 మందికి పైగా మరణించారు, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యమంత్రి ఎన్. బిరెన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత కేంద్రం ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. 2027 వరకు పదవీకాలం ఉన్న రాష్ట్ర అసెంబ్లీని తాత్కాలికంగా నిలిపివేసింది.

# రింగ్ రైలు డీపీఆర్ రెడీ

హైదరాబాద్, : తెలంగాణలో ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ ఖరారైంది. 392 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ.12,070 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. దక్షిణ మధ్య రైల్వే దీన్ని 8 జిల్లాలు, 14 మండలాల పరిధిలో చేపట్టనుంది, ఇందులో 26 కొత్త రైల్వే స్టేషన్లు ఉంటాయి. ఆరు చోట్ల రైల్ ఓవర్ రైల్ వంతెనలు నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధికి, రవాణా మెరుగుదలకు కీలకం కానుంది.తెలంగాణలో ప్రతిష్టాత్మక ఔటర్ రింగ్ రైలు (హైదరాబాద్ రీజినల్ రింగు రైల్) ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ ఖరారైంది. 392 కిలోమీటర్ల పొడవునా సాగే ఈ ప్రాజెక్టుకు రూ.12,070కోట్లు వ్యయం అవుతుందని అంచనా. దక్షిణ మధ్య రైల్వే ఈ ప్రాజెక్టును రాష్ట్రంలోని 8 జిల్లాలు, 14 మండలాల పరిధిలో చేపట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మార్గంలో 26 కొత్త రైల్వే స్టేషన్లు రానున్నాయిముందుగా 508 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, గనుల మంత్రి కిషన్‌రెడ్డి సూచనల మేరకు 392 కిలోమీటర్లకు తగ్గించారు.హైదరాబాద్ రీజినల్‌రింగ్ రోడ్డుకు దగ్గరగా ఉండేలా ఈ అలైన్‌మెంట్‌ను ఎంపిక చేశారు. ఆర్ఆర్ఆర్‌కు 3-5 కి.మీ. దూరంలో ఉంటుంది, రెండు చోట్ల మాత్రం 11 కి.మీ. దూరం ఉండనుంది. దూరం తగ్గినా.. అభివృద్ధికి అధిక అవకాశాలున్న ప్రాంతాలకు దగ్గరగా ఈ మార్గం రానుండటం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ 392 కిలోమీటర్ల రింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు రైల్వే బోర్డుకు పంపించడానికి సిద్ధమవుతున్నారు.ఈ ప్రాజెక్టులో ఆరు చోట్ల రైల్ ఓవర్ రైల్ వంతెనలు నిర్మించనున్నారు. అంటే పాత రైలు మార్గాలపై కొత్త లైన్‌ను ఎత్తుగా, ఫ్లైఓవర్‌లో నిర్మిస్తారు. ఈ ప్రాంతాలుగా మాసాయిపేట, గుళ్లగూడ, బూర్గుల, వలిగొండ, వంగపల్లి, గజ్వేల్‌లను ప్రతిపాదించారు. ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుతో పరిసర ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుంది. ఈ రింగ్ రైలు మార్గాన్ని దగ్గరలోకి తీసుకురావడంతో రోడ్డు, రైలు మార్గంతో కూడిన రవాణా ఆధారిత అభివృద్ధి జోరందుకుంటుంది. ఈ ప్రాజెక్టుతో ఆయా రైల్వే స్టేషన్ల నుంచి నగరానికి బస్సులు, మెట్రో రైలు వంటి రవాణా సేవలతో మల్టీమోడల్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఈ ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఔటర్ రింగ్ రైలు వెళ్లే జిల్లాలు: మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి-భువనగిరి, సిద్దిపేట. అలైన్‌మెంట్ మార్గం: ఆలేరు, వలిగొండ, గుళ్లగూడ, మాసాయిపేట, గజ్వేల్ మీదుగా ఈ రింగ్ రైలు మార్గం అలైన్‌మెంట్ ఖరారు చేయబడింది.

# ఖరీఫ్ కష్టాలు..!

- సాగునీటి కోసం రోడ్డెక్కుతున్న రైతులు
- కృష్ణా ఆయకట్టులో బీటలు వారుతున్న నారుమళ్లు
- దాదాపు 30 వేల ఎకరాల్లో సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన

**మందకొడిగా కౌలుకార్డుల జారీ, రుణాల అందజేత**



ఏలూరు : ఖరీఫ్ సాగులో అన్నదాత అష్టకష్టాలు పడుతున్నాడు. సాగునీటి కోసం రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి దాపురించింది. వానలు లేక, సాగు నీరందక ఖరీఫ్ సాగు రైతులకు కత్తి మీద సాములా మారింది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలోని కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాగు నీరందక రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో 2.22 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఇప్పటి వరకూ 47 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. పశ్చిమలో 2.15 లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సన్నద్ధమవ్వగా, 50 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వానలు కురవకపోవడంతో సాగునీటి కోసం రైతులు పడుతున్న అవస్థలు చెప్పలేనివిగా మారాయి. డెల్టా ప్రాంతంలో సైతం సాగునీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడుకోవా ల్సిన దుస్థితి ఏర్పడింది. దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 30 వేల ఎకరాల మేర కృష్ణా ఆయకట్టు ఉంది. కృష్ణా కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగుకు వేసిన నారుమడులన్నీ బీటలు వారుతున్నాయి. దీంతో తమకు సాగునీరు అందించాలంటూ రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. గోదావరి నుంచి వచ్చే నీటిని కృష్ణా ఆయకట్టుకు తరలించే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఆలోచించాలని రైతులు కోరుతున్నారు. పట్టిసీమ నుంచి కృష్ణాకు నీటిని తరలిస్తున్నా జిల్లాలోని కృష్ణా ఆయకట్టుకు మాత్రం సాగునీరు అందించని పరిస్థితి ఏర్పడింది. ఖరీప్ సాగు ఆదిలోనే ఈ విధంగా ఉంటే ముమ్మందు పరిస్థితి ఏమిటనే భయం అన్నదాతను వెంటాడుతోంది. డెల్టా ప్రాంతంలోనూ సాగునీరు కోసం రైతులు ఆయిల్ ఇంజిన్లు వాడాల్సి రావడంతో ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో సాగు పెట్టుబడి పెరిగిపోతుంది. ఎండల తీవ్రతకు నాట్లు సైతం దెబ్బతింటుండటంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. మందకొడిగా కౌలుకార్డుల జారీ, రుణాలు అందజేత: రెండు జిల్లాల్లో మూడు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉన్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. అయినప్పటికీ కౌలుకార్డుల జారీకి సంబంధించి తీసుకున్న టార్గెట్లు మాత్రం రెండు జిల్లాల్లో తక్కువగా ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 75 వేలు కౌలుకార్డులు జారీ చేయాలని టార్గెట్ తీసుకోగా, ఇప్పటి వరకూ 42 వేల కార్డులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల కౌలుకార్డులు జారీ చేయాలని టార్గెట్ తీసుకోగా 60 వేల కార్డులు వరకూ జారీ చేసినట్లు తెలిసింది. రుణాల మంజూరు మరింత మందకొడిగా సాగుతోంది. ఏలూరు జిల్లాలో కౌలురైతులకు రూ.375 కోట్లు పంట రుణాలుగా ఇవ్వాలని టార్గెట్ నిర్ణయించగా, ఇప్పటి వరకూ రూ.8 కోట్లు మాత్రమే అందించారు. పశ్చిమగోదావరి జిల్లాలో కౌలురైతుల రుణాల మంజూరు పరిస్థితి నామమాత్రంగానే ఉంది. దీంతో కౌలురైతులు ఖరీఫ్ పెట్టుబడుల కోసం నానాతంటాలు పడుతున్నారు. నాట్లు నాటిన రైతులు కూలీలకు, ట్రాక్టర్ దమ్ముకు ఇచ్చేందుకు సొమ్ములు లేక ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంటరుణాలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అంతా కోరుతున్నారు. కార్డుల జారీ త్వరితగతిన పూర్తిచేసి రుణాలు అందిస్తేనే కౌలురైతులకు మేలు జరిగే పరిస్థితి ఉంది. లేకపోతే కౌలురైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో నలిగిపోక తప్పదు.

## శ్రీకాళహస్తిలో ఆడికృత్తిక సందడి

### భక్తిశ్రద్ధలతో కావడి సమర్పించుకుంటున్న బాలుడు

శ్రీకాళహస్తి : హరో.. హర నామస్మరణలతో శ్రీకాళహస్తి మార్మోగింది. ఆడికృత్తిక మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విజ్ఞానగిరిపై కొలువుదీరిన స్కంధుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తజన ప్రవాహంతో ఇక్కడి క్షేత్రంలో సందడి వాతావరణం నెలకొంది. పసుపు వస్త్రాలను ధరించి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి కావళ్లు పట్టుకుని శరవణభవుని నామస్మరణతో కావళ్ల మొక్కు సమర్పించుకున్నారు. ఆదివారం, రెండు రోజులు కృత్తిక నక్షత్రం ఉండటం తో మధ్యాహ్నం నుంచి విజ్ఞానగిరి భక్తజన సంద్రంగా మారింది. భక్తుల మధ్య తొక్కిలసలాటలు లేకుండా క్యూలైన్లను పకడ్బందీగా ఏర్పాటు చేశారు. నారద పుష్కరిణిలోను ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆడికృత్తిక సందర్భంగా విజ్ఞానగిరిపై కొలువుదీరిన కుమారస్వామికి విశేష పూజ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం చందనరూపుడై భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. ఆడికృత్తిక సందర్భంగా ఇంద్రవిమానంపై శ్రీ వల్లి దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్య స్వామిని చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు ఉదయం నుంచి రాత్రి వరకు 70వేల మంది వరకు భక్తులు దర్శనం చేసుకుని ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు

www.vishvambhara.com తెలుగు దినపత్రిక ప్రజా విశ్వంభర

# రష్మిక మరో బిగ్ స్టెప్..



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కెరీర్ లో ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. వరుస సినిమాల్లో నటిస్తున్న అమ్మడు.. అదే సమయంలో హిట్స్ కూడా అలాగే అందుకుంటోంది. బ్లాక్ బస్టర్ సినిమాలతో అందరినీ మెప్పిస్తున్న రష్మిక.. మరిన్ని సినిమాల్లో ఛాన్స్ లు సొంతం చేసుకుని సత్తా చాటుతోంది. మొత్తానికి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా బిజీగా ఉన్న ఆమె.. షూటింగ్స్ తో తీరిక లేకుండా గడుపుతుందనే చెప్పాలి. ఇప్పుడు సౌత్ టు నార్త్.. అనేక ఆఫర్స్ ఆమె చేతిలోనే ఉన్నాయి. అలా తక్కువ టైమ్ లో ఎక్కువ డబ్బులు సంపాదిస్తున్నట్లే ఉంది. అదే సమయంలో ఇప్పుడు రష్మిక మందన్న వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. ఆ విషయాన్ని ఆమెనే చెబుతూ పోస్ట్ చేసిన వీడియోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తొలుత ఓ వీడియో షేర్ చేస్తూ.. "నేను చివరకు దీన్ని రికార్డ్ చేస్తున్నానని నేను నమ్మలేకపోతున్నాను. మీకు ఇప్పటికే తెలిసినట్లుగా, నేను నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న దానిపై పని చేస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చింది. "మీరు దానిని అనుభవిస్తారని నేను ఆశిస్తున్నాను, మీరు దానినిఇష్టపడతారని నేను ఆశిస్తున్నాను.దానినిమీతో పంచుకోవ డానికి వేచి ఉండలేను. చాలా చాలా చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఆందోళనగా ఉన్నాను. కృతజ్ఞతతో ఉన్నాను" అని చెప్పిన రష్మిక.. ఆ తర్వాత తన తల్లితో జరిగిన సంభాషణ వీడియోను పోస్ట్ చేసింది. అందులో రష్మిక "నేను ఇప్పుడు చాలాముఖ్యమైన షూట్‌కువెళ్తున్నాను. మీరు చెప్పిన వ్యాపారాన్ని నేను ప్రారంభిస్తాను" అని తల్లితో చెప్పగా.. ఆమె బెస్ట్ విషెస్ చెబుతారు. అయితే రష్మిక ఏ బిజినెస్ స్టార్ట్ చేయనుందో వెల్లడించలేదు. ప్రస్తుతం ఆమెకు సోషల్ మీడియాలో బెస్ట్ విషెస్ వెల్లువెత్తుతున్నాయి. బిజినెస్ లో కూడా సక్సెస్ అవ్వాలని అంతా కోరుకుంటున్నారు. కాగా, ఇప్పటికే అనేక మంది స్టార్ హీరోయిన్స్..సొంత ఫ్యాషన్ బ్రాండ్‌ను స్టార్ట్ చేసిన విషయం తెలిసిందే. తమ బిజినెస్ తో రాణిస్తున్నారు. ఇప్పుడు రష్మిక కూడా వారి బాటలోనే వెళ్తున్నారని తెలుస్తోంది. ఆ విషయాన్నే అనౌన్స్ చేయనున్నారని సమాచారం. మరి చూడాలి రష్మిక ఏ బిజినెస్ స్టార్ చేస్తారో..

# కబీర్ సింగ్ ను గుర్తుచేస్తున్న సైయారా



బాలీవుడ్ రొమాంటిక్ డ్రామా 'సైయారా' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం వైపునకు దూసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. జూలై 18న రిలీజైన ఈ సినిమా, ఓపెనింగ్ రోజు పెద్దగా వసూళ్లు సాధించలేదు. అయితే మౌత్ టాక్ వల్ల వీకెండ్ అయిన పుంజుకుంది. రెండో రోజు ఆక్యుపెన్సీ పెరిగింది. దీంతో మల్టీప్లెక్స్ లు ఫుల్ అవుకున్నాయి. తొలి రోజుతో పోలిస్తే, రెండో రోజు కలెక్షన్లు 15- 20 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో శనివారం రోజే రూ.24 కోట్ల నెట్ వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఓపెనింగ్ డే కు రెండో రోజుకు స్పందన పెరిగిందనడానికి ఇదే ఉదాహరణ. దీంతో ఓవరాల్ గా సినిమాకు స్పందన పెరగడంతో థియేటర్ల సంఖ్య కూడా పెంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ తోపాటు నార్త్ లో యూపీ, బీహార్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో అయిత ఓపెనింగ్ రోజు కూడా డీసెంట్ కలెక్షన్లు వచ్చాయి. మరీ ముఖ్యంగా ఢిల్లీ, యూపీ సర్క్యూట్ లలో సైయారా కు విశేష ఆదరణ దక్కుతోంది. అక్కడ ఇది బ్లాక్ బస్టర్ సినిమాలు ఛావా, సికిందర్, హౌస్ ఫుల్ 3 చిత్రాలను దాటేసింది. దీంతో నార్త్ లో ఈ సినిమా నిలకడగా వసూళ్లు సాధిస్తుందని ట్రేడ్ వర్గాల అంచనా. అయితే ఇదంతా చూస్తుంటే గతంలో బాలీవుడ్ బ్లాక్ బస్టర్ కబీర్ సింగ్ ట్రెండ్ ను సైయారా ఫాలో అవుతున్నట్లు అనిపిస్తోంది. కబీర్ సింగ్ ఏ సర్టిఫికేట్ సినిమా కావడంతో కొన్ని పరిమితులతోనే రిలీజ్ అయ్యింది. ఆ తర్వాత హిట్ టాక్ తో మెల్లిగా పికప్ అయ్యింది. అలా కబీర్ సింగ్ భారీ విజయం దక్కించుకుంది. తండ్రి ఇప్పుడు సైయారా విషయంలోనూ ఇదే జరిగేలా కనిపిస్తుంది. ఓపెనింగ్ డే అంతంత మాత్రం ఉన్న కలెక్షన్లు, రెండో రోజు పెరిగాయి. ఇక మూడోరోజు ఆదివారం కావడంతో వసూళ్లు ఇంకా పెరిగే ఛాన్స్ ఉంది. పైగా కబీర్ సింగ్ ఏ సర్టిఫికెట్, కానీ సైయారా ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ ను కూడా ఆకర్షిస్తుంది. ఒకవేళ బాక్సాఫీస్ వద్ద ఇదే జోరు కొనసాగితే సైయారా 2025లో బాలీవుడ్ లో సూపర్ హిట్ సినిమాల్లో ఒకటిగా నిలుస్తుందని ట్రేడ్ పండింతులు చెబుతున్న మాట!

# స్టన్నింగ్ లుక్‌లో రామ్ చరణ్..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది అనే సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత ఆయన నటించిన గేమ్ ఛేంజర్ చిత్రం బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచింది. దీంతో ఇప్పుడు పెద్ది కోసం బాగానే హార్డ్ వర్క్ చేస్తున్నారు. "ఉప్పెన" సినిమాతో భారీ హిట్ అందుకున్న డైరెక్టర్ బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ సినిమా, ఒక స్పోర్ట్స్ మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ వీడియో, పోస్టర్లు మెగా అభిమానుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. రామ్ చరణ్ మాస్ లుక్, పవర్‌ఫుల్ ప్రెజెన్స్ చూసిన తర్వాత సినిమా మీద హైప్ మరింత పెరిగిపోయింది. ఈ చిత్రం కోసం రామ్ చరణ్ బాడీ లాంగ్వేజ్, ఫిజిక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా ఆయన ట్రైనింగ్ సమయంలో తీసిన ఫోటోను షేర్ చేస్తూ, Changeover for #PEDDI అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఆ ఫోటోలో చరణ్ గుబురు గడ్డం, రఫ్ హెయిర్‌స్టైల్, సిక్స్ ప్యాక్ బాడీతో హాలీవుడ్ హీరో మాదిరి కనిపించారు. ఈ లుక్ చూసిన అభిమానులు "ఇది ఊర మాస్ అంతే!", "పెద్ది బాక్సాఫీస్‌ను బద్దలు కొడుతుంది" అంటూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఈ సినిమాలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అలాగే చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించడం మరో హైలైట్. బుచ్చిబాబు డైరెక్షన్, చరణ్ మాస్ పవర్, రెహమాన్ మ్యూజిక్.. ఈ కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొనేలా చేశాయి. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2025లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. 'పెద్ది' నుంచి రాబోయే రోజుల్లో మరిన్ని అప్డేట్స్, ఫస్ట్ లుక్, టీజర్ రిలీజ్‌లు అభిమానుల్ని కట్టిపడేస్తాయని చెప్పొచ్చు. 'పెద్ది' కోసం రామ్ చరణ్ ట్రాన్స్ఫర్మేషన్, మేకోవర్ అభిమానుల్లో అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ సినిమా మెగా హీరో కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందా? అనే ఉత్కంఠ ఇప్పుడు ఫ్యాన్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.

# అకీరానందన్ కటౌట్

బెంగళూరు, : పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరో గా నటించిన 'హరి హర వీరమల్లు'చిత్రం మరో 2 రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా అభిమానులు రెండు తెలుగు రాష్ట్రాల్లో కోలాహలం చేయడం మొదలు పెట్టేశారు. థియేటర్స్ బయట కటౌట్స్, బ్యానర్స్, బ్యాండ్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. సాధారణంగా ఇలాంటివి సినిమా విడుదల రోజు చేస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం నాలుగు రోజుల ముందే మొదలు పెట్టేశారు. ఎంతైనా పవన్ కళ్యాణ్ సినిమా వచ్చి మూడేళ్లు దాటింది. అభిమానుల్లో ఆ మాత్రం ఆకలి ఉండడం సహజమే. బెంగళూరు లో ఈరోజు పవన్ కళ్యాణ్ అభిమానులు సంధ్య థియేటర్ వద్ద చేసిన హంగామాకు సమందించిన వీడియోస్ ఇప్పుడు సోషల్ మీడియా లో సెన్సేషనల్ టాపిక్ గా మారింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 12 కటౌట్స్ ని థియేటర్ వద్ద ఏర్పాటు చేశారు.అంతే కాకుండా పవన్ కళ్యాణ్ తనయుడు అకిరా నందన్ కి సంబందించిన కటౌట్ ని కూడా లాంచ్ చేశారు. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యింది. అకిరా నందన్ ఈమధ్య కాలం లో సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాడు. ఒకప్పుడు కెమెరా ముందుకు రావడానికే భయపడే అకిరా నందన్, ఇప్పుడు తన తండ్రితో కలిసి జాలీగా తిరుగేస్తున్నాడు. ఆయనకు సంబంధించిన లేటెస్ట్ ఫోటోలలో ఒకటి ఎంచుకొని ఈ కటౌట్ ని లాంచ్ చేశారు. దీనికి ఆడియన్స్ నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆ వీడియో ని మీరు కూడా క్రింద చూసేయండి. అదే విధంగా విజయవాడ లో కూడా అభిమానులు కటౌట్ ని లాంచ్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఇది కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కటౌట్ లాంచ్ ఈవెంట్ కి అంత మంది అభిమానులు రావడం ఏంటి బాబోయ్ అని ఆశ్చర్యపోయారు.ఇప్పుడే ఇలా ఉందంటే ఇక విడుదల రోజు ఎలా ఉంటుందో. పైగా పైడ్ ప్రీమియర్




షోస్ కూడా ఉన్నాయి. రాబోయే రోజులు మొత్తం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ హంగామా ఆన్లైన్ లో ఆఫ్ లైన్ లో నాన్ స్టాప్ గా చూడబోతున్నాం అన్నమాట. ఆరేళ్ళ తర్వాత వస్తున్న సినిమా కావడం తో ఈ చిత్రం పై మాములు ఆడియన్స్ లో కావాల్సినంత హైప్ జనరేట్ అవ్వలేదు అనేది వాస్తవం. కానీ రేపు హైదరాబాద్ శిల్ప కళా వేదికలో జరగబోయే ప్రీ రిలీజ్ ఈవెంట్ మాత్రం ఒక రేంజ్ లో హైప్ ని జనరల్ ఆడియన్స్ లో క్రియేట్ చేస్తుందని, అభిమానులు కంగారు పడాల్సిన అవసరమే లేదని అంటున్నారు. అంతే కాదు మూవీ టీం తరుపున రేపు ఒక మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి పవన్ కళ్యాణ్ కూడా హాజరు కాబోతున్నాడట.

# పవన్ సినిమాలో రాశీ ఖన్నా..



టాలీవుడ్‌లో దశాబ్దకాలంగా తనదైన ముద్ర వేసుకున్న కథానాయిక రాశీ ఖన్నాకు ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమాలో ఇప్పటికే శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. మరో కథానాయికగా రాశీ ఖన్నా ఎంపికైనట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమాలో శ్లోక అనే పాత్రలో కనిపించబోతుంది రాశీ. ఈ సందర్భంగా రాశీ ఫొటోను చిత్రయూనిట్ పంచుకుంది. మరోవైపు ఇప్పటికే రాశీ షూటింగ్ సెట్‌లో అడుగు పెట్టి, పవన్ కళ్యాణ్‌తో కలిసి కీలక సన్నివేశాల్లో పాల్గొంటున్నారని సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్–హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఈ వయసులోనూ ఇంతందమా..!




సినిమాలు చూసేవారికి శైలజ ప్రియ పరిచయమే. ఎన్నో సినిమాల్లో అక్కగా, వదినగా, పిన్నిగా, అమ్మగా నటించి తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించారు ప్రియ. 1997లో వెండితెరకు పరిచమైన శైలజ ప్రియ ఆ తర్వాత సినిమాలు, సీరియల్స్ లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రియ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు తన అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఉంటారు. ప్రియ అందానికి ఫిదా అవని వారుండరు. దానికి తోడు ఆమె ఎంతో మంచి నటి కూడా. అందుకే ఆమె ఎప్పుడూ చేతి నిండా అవకాశాలతో బిజీగా ఉంటారు. కేవలం ప్రియ యాక్టింగ్‌కే కాకుండా, ఆమె అందానికి కూడా ఎంతో మంది ఫ్యాన్స్ ఉన్నారు. ప్రస్తుతం ఆమె వయసు 47. ఈ వయసులో కూడా ప్రియ చాలా అందంగా, హీరోయిన్ కు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్నారు. తాజాగా ప్రియ వెకేషన్ కు వెళ్లి దానికి సంబంధించిన కొన్ని ఫోటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ ఫోటోల్లో ప్రియ మరింత అందంగా కనిపిస్తున్నారు. మామూలుగా ప్రియ కాస్త బొద్దుగానే ఉంటారు. ఆమె హైట్ కు తగ్గ పర్సనాలిటీతో ఉండే ప్రియ రీసెంట్ గా షేర్ చేసిన ఫోటోల్లో చాలా స్లిమ్ గా మారినట్టు కనిపించారు. స్లిమ్ గా అవడమే కాకుండా ప్రియ ఈ ఫోటోల్లో మరింత అందంగా కూడా కనిపించారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road Hyderabad - 500060. Telangana. EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwam hara.daily@gmail.com